fb.com/vaartha Digital
నిజామాబాద్
12-9-2026 శనివారం సంపుటి: 32
సంచిక: 224 పేజీలు: 10+4 వెల: 6.50
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

టోల్‌ప్లాజాల వద్ద డిజిటల్ విధానం : గడ్కరీ 3లో

రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదు: భట్టి 6లో

# 3వేల కోట్లు పైనే ఇచ్చాం

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై అసెంబ్లీలో సిఎం రేవంత్ వెల్లడి**

**గత ప్రభుత్వం వదిలేసిన బకాయిలు కూడా చెల్లించాం**

**క్లీన్‌చిట్ ఉన్న కాలేజీలకే రీయింబర్స్‌మెంట్**

**పాలిటెక్నిక్‌లు ప్రైవేటుపరం చేయం: ముఖ్యమంత్రి**


శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు11:** 'గత ప్రభుత్వం పోతూ పోతూ ఫీజు రీయింబర్స్ మెంట్ రూ. 5430 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు వారు బకాయిలు పెట్టి వెళ్లిపోయిన వాటిలో రూ. 1410 కోట్లు మేం చెల్లించాం' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం వచ్చాక కొత్తగా రూ.1475 కోట్లు చెల్లించాం. ఈ 32 నెలల్లో రూ. 3488 కోట్లు ఫీజు రీయింబర్సుమెంట్ కోసం చెల్లించాం' అని వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీలు ప్రైవేటు పరం అవుతాయని దుష్ప్రచారం చేస్తున్నారని, పాలిటెక్నిక్ కాలేజీల ప్రైవేటైజేషన్ అనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి అసెంబ్లీలో తెలంగాణ విద్యావిధానంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఐటిఐలను ఎటిసిలుగా మార్చి టాటా సహకారంతో నైపుణ్యాన్ని అందిస్తున్నాం, అలాగని ఐటిఐలను ప్రైవేటు పరం చేసినట్టా? అని ప్రశ్నించారు. విద్యార్థులు రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దని పిలుపునిచ్చారు. 'ఎటిసిలో చదివే వారికి ప్రతీ నెల 2 వేలు స్కాలర్ షిప్ అందించాలని చెప్పాం, మేం ఒక మంచి సంకల్పంతో పని చేస్తుంటే కొంతమంది విద్యార్థుల్లో అపోహాలు కలిగిస్తున్నారు.భూములు అమ్ముకుంటారని, ఉద్యోగాలు పోతాయని ప్రచారం చేస్తున్నారు,ప్రభుత్వమే అదనంగా 282 ఎకరాల రెవెన్యూ >>2

## అసెంబ్లీ నుంచి బిజెపి వాకౌట్

**జనగణనలో కులగణన వివాదం**

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** జనగణనలో భాగంగా పక్కాగా కులగణన చేపట్టాలంటూ శాసనసభ తీర్మానం చేసిన సందర్భంగా శుక్రవారం సభలో వాడివేడి చర్చ జరిగింది. ఓపెన్ కాలమ్ పెట్టడం వల్ల ఒబిసిల సంఖ్యపై స్పష్టత రాదని ప్రతి కులానికి కోడ్ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. ఈ అంశంపై చర్చ సందర్భంగా మంత్రులు, బిజెపి సభ్యులమధ్య వాడీవేడి చర్చ జరిగింది. జనగణనలో కులగణనకు అనుకూలమా? కాదా? ఏదో ఒకటి చెప్పాలని బిజెపిని అధికార పార్టీ నిలదీయగా బిసి డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేశారంటూ ఆ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. బిసి డిక్లరేషన్ అమలు చేస్తామని అధికారం >>2

## గొంతు నొక్కిదాడి చేశారు

**ప్రజా ప్రతినిధులమని కూడా చూడకుండా అవమానించారు..**

**ఢిల్లీలో మహిళా కమిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదుచేసిన బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు**

**తక్షణం డిజిపి నివేదిక కోరతామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ హామీ**


న్యూఢిల్లీలో మహిళాకమిషన్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గ పాలనపై ప్రజల పక్షాన పోరాడాల్సిన తాము తమను తాము రక్షించుకునేందుకు, తమ సమస్యను పరిష్కరించుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ప్రజాప్రతినిధులమని కూడా చూడకుండా నా గొంతు నులమడం, సహచర ఎమ్మెల్యే చీర లాగి అత్యంత అవమానానికి గురిచేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో బిఆర్ఎస్ మహిళా >>2

SIR Special Intensive Revision
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
భారత ఎన్నికల సంఘం

తెలంగాణ ముసాయిదా ఓటర్ల జాబితా 17.08.2026న ప్రచురించబడింది.
క్లెయిమ్‌లు & అభ్యంతరాలు స్వీకరణ దశ ప్రారంభమైంది.
మీ పేరు & వివరాలు జాబితాలో పరిశీలించండి.



క్లెయిమ్‌లు & అభ్యంతరాలు స్వీకరణ దశ
07-10-2026 వరకు పొడిగించబడింది.
ముందు ప్రకటించిన తేదీలు :17.08.2026 -16.09.2026

స్పెషల్ క్యాంపెయిన్: రెండవ దశ: 12-13 సెప్టెంబర్ 2026
మీ బిఎల్ఓలు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు

- ఫారం-6 : నూతన ఓటర్‌గా నమోదుకు
- ఫారం-7 : తొలగింపులకు
- ఫారం-8 : సవరణలకు, చిరునామా మార్పుకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 09-11-2026

మీ సందేహాలకు 07.10.2026 లోపు బూత్ లెవెల్ ఆఫీసర్ (BLO)/ AERO/ERO ని సంప్రదించండి.

Scan here for ecinet.eci.gov.in
Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in
వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO
CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana
వివరాలకు, టోల్‌ఫ్రీ 1950 ఉ॥ 10:30 - సా॥5:00 వరకు
మీ ఓటు.. మీ బాధ్యత.
ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి-పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

NPCI ALWAYS FORWARD
Bharat Connect




తెలంగాణలో మీకు కరెంట్ బిల్లు వచ్చిందా?
మీకు నచ్చిన యాప్ తెరిచి, క్షణాల్లోనే చెల్లించేయండి!
సులభం • వేగం • సురక్షితం

It's super easy. Done in 2 minutes.
Open - Any of your favourite app
Select - Bills & Recharges
Choose - Your Biller
Pay - Using your preferred payment mode
Ho gaya!

Pay through your favourite payment app.
amazon pay CRED HDFC BANK ICICI Bank Paytm PhonePe
T&C Apply

# బ్రిక్స్ సదస్సుకు అంతా సిద్ధం

## నేడు, రేపు ఢిల్లీలోని భారత్ మండపంలో ఉన్నత స్థాయి సమావేశాలు

### పుతిన్, జిన్‌పింగ్ సహా పాల్గొననున్న పలు దేశాధినేతలు




బ్రిక్స్ సమావేశాలు జరుగనున్న ఢిల్లీలోని భారత్ మండపం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్న 2026 బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి న్యూఢిల్లీ సిద్ధమైంది. 12,13 తేదీల్లో జరగనున్న ఈ కీలక అంతర్జాతీయ సమావేశానికి 11 సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల నేతలు, సీనియర్ ప్రతినిధులు హాజరు అవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా పలువురు ప్రపంచ నేతలు ఢిల్లీకి రానుండటంతో విమానాశ్రయం నుంచి హోటళ్లు, సమావేశ వేదికలు, వివిఐపి మార్గాల వరకు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. రోడ్లపైనే కాకుండా గగనతలం, డిజిటల్ కార్యకలాపాలపైనా భద్రతా సంస్థలు నిఘా కొనసాగిస్తున్నాయి. 30 వేల మందితో భద్రతా వలయం బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఢిల్లీలో సుమారు 30,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు సమాచారం. ఇందులో ఢిల్లీ పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన సిబ్బంది ఉన్నారు. విదేశీ నేతలు బస చేసే హోటళ్లు, భారత్ మండపం పరిసరాలు, విమానాశ్రయం, ముఖ్యమైన రహదారులు, రవాణా కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. నగరాన్ని పలు సెక్టార్లుగా విభజించి, ప్రతి ప్రాంతానికి సీనియర్ పోలీసు అధికారులను బాధ్యులుగా నియమించారు. భారత్ మండపం వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, విదేశీ నేతలు బస చేసే హోటళ్ల వద్ద కూడా బహుళ అంచెల భద్రతను అమలు చేస్తున్నారు.

**హోటళ్ల వద్ద కట్టుదిట్టమైన నిఘా**

విదేశీ దేశాధినేతలు బస చేసే హోటళ్లలో భద్రతను అనేక స్థాయిల్లో ఏర్పాటు చేశారు. హోటల్ పరిసరాలు, ప్రవేశ ద్వారాలు, పైకప్పులు, పార్కింగ్ ప్రాంతాలు తదితర ప్రాంతాలను భద్రతా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా హోటళ్లలో పనిచేసే సిబ్బంది వివరాలు, భద్రతా నేపథ్యాన్ని కూడా పరిశీలించినట్లు సమాచారం. పుతిన్, జిన్‌పింగ్‌ల భద్రత కోసం వారి సొంత దేశాల ప్రత్యేక భద్రతా బృందాలు కూడా ఢిల్లీకి చేరుకుని భారత భద్రతా సంస్థలతో సమన్వయం చేస్తున్నాయి.

**వివిఐపి మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

విదేశీ నేతలు విమానాశ్రయం నుంచి హోటళ్లకు, అక్కడి నుంచి భారత్ మండపానికి వెళ్లే మార్గాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. వీవీఐపీ కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో అవసరాన్ని బట్టి కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా మళ్లించడం జరుగుతుంది. 11 నుంచి 13 వరకు ఢిల్లీలోని పలు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నియంత్రణలు, మళ్లింపులు అమల్లో ఉన్నాయి. విమానాశ్రయం, రైల్వే స్టేషన్, న్యూఢిల్లీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ముందుగానే ప్రయాణ ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు. బ్రిక్స్ సదస్సు కారణంగా కొన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పనితీరులోనూ మార్పులు చేశారు. జాతీయ లోక్ అదాలత్ వంటి కొన్ని కార్యక్రమాల తేదీలను కూడా మార్చినట్లు సమాచారం.




ప్రధాని మోడీతో భేటీ అయిన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**పుతిన్ భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భద్రత విషయంలో భారత, రష్యా భద్రతా సంస్థలు ప్రత్యేక సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఆయన బస చేసే ప్రాంతంలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. పుతిన్ వెంట రష్యాకు చెందిన ప్రత్యేక భద్రతా సిబ్బంది ఉండటంతో పాటు భారత భద్రతా బలగాలు హోటల్ పరిసరాలు, ప్రయాణ మార్గాలు, సమావేశ వేదిక వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. ఆయన ప్రయాణానికి రష్యా ప్రత్యేక భద్రతా వాహనాలను ఉపయోగించే అవకాశం ఉంది. పుతిన్ విదేశీ పర్యటనల్లో ఉపయోగించే లిమోసిన్ వంటి అత్యంత భద్రత కలిగిన వాహనాలు గతంలోనూ ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. అలాగే పుతిన్ ప్రయాణించే ప్రత్యేక విమానం Il-96-300PU కూడా రష్యా అధ్యక్షుడి విదేశీ పర్యటనల్లో కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని అత్యంత భద్రత కలిగిన కమ్యూనికేషన్ సామర్థ్యాలతో కూడిన అధ్యక్ష విమానంగా రష్యా ఉపయోగిస్తోంది.

**జిన్‌పింగ్ కోసం కూడా హైలెవల్ సెక్యూరిటీ**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలోనూ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఆయన బస చేసే హోటల్, ప్రయాణించే మార్గాలు, సమావేశ వేదిక వద్ద భారత భద్రతా సంస్థలతో పాటు చైనా భద్రతా బృందాలు సమన్వయం చేసుకుంటున్నాయి. పుతిన్, జిన్‌పింగ్ వంటి అగ్రశ్రేణి నేతల పర్యటనల సమయంలో సాధారణంగా వారి స్వదేశ భద్రతా ప్రోటోకాల్స్‌ను కూడా భారత భద్రతా వ్యవస్థతో సమన్వయం చేస్తారు. డిజిటల్ ప్రపంచంపైనా అధికారులు దృష్టి పెట్టారు. సోషల్ మీడియా, ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ వేదికల్లో నిరసనలకు పిలుపులు, పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించే ప్రయత్నాలు, ముప్పు కలిగించే సమాచారం వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమైన సమావేశ వేదికలు, హోటళ్లు, రవాణా కేంద్రాలు, వీవీఐపీ మార్గాల చుట్టూ నిఘాను పెంచారు. ఏదైనా అనూహ్య పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించేందుకు భద్రతా సంస్థలు ప్రత్యామ్నాయ ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నాయి.

## బ్రిక్స్ 21 దేశాల వాణిజ్యం

# గ్లోబల్ ట్రేడ్‌లో 25శాతం

### గ్లోబల్ వాణిజ్య అడ్డంకులున్నా ఆగని అభివృద్ధి

### బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 11:** ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతున్న సమయంలో భారత్ మాత్రం అడ్డంకులు అధిగమించడంపై దృష్టి సారిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బ్రిక్స్ దేశాల ఆర్థిక శక్తి, ప్రపంచ ప్రాధాన్యత వేగంగా పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.బ్రిక్స్ బిజినెస్ ఫోరం లీడర్స్ సెషన్‌లో శుక్రవారం ప్రసంగించిన ప్రధాని మోడీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జిడిపిలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు ఏర్పడుతున్న వేళ భారత్ ఆర్థిక అడ్డంకులు అధిగమించే వ్యవస్థలు నిర్మిస్తోందని ప్రధాని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ వృద్ధి, స్థిరత్వానికి విశ్వాసాన్ని అందించే దేశంగా నిలుస్తోందని చెప్పారు.గత కొన్నేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుమారు రెండున్నర రెట్లు విస్తరించగా బ్రిక్స్ దేశాల ఉమ్మడి జిడిపి దాదాపు నాలుగున్నర రెట్లు పెరిగిందని ప్రధాని వివరించారు. మిగతా ప్రపంచంతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థికశక్తి దాదాపు రెండింతల వేగంతో పెరిగిందని మోడీ పేర్కొన్నారు. బ్రిక్స్‌దేశాలు ప్రపంచ ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని అన్నారు.అట్టడుగు స్థాయి కార్యక్రమాలనుంచి అత్యాధునిక సాంకేతికతల వరకు వివిధ రంగాల్లో కొత్త అవకాశాలు రూపుదిద్దుకుంటున్నాయని ప్రధాని తెలిపారు. బ్రిక్స్ దేశాల పరిమాణం, వేగం, ఆశావాదం తమ మధ్య స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు.భారత్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడాన్ని ప్రస్తావించిన ప్రధాని మోడీ ఇప్పటివరకు జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని తెలిపారు. సభ్య దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు, వాణిజ్య సహకారం పెరుగుతున్న ప్రాధాన్యతకు ఈ సమావేశం నిదర్శనమని పేర్కొన్నారు.

## రష్యా అధ్యక్షుని కారులోనే ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** సాధారణంగా దేశాధినేతల మధ్య దౌత్య చర్చలు సమావేశ మందిరాల్లో జరుగుతుంటాయి. అయితే ఇటీవలి కాలంలో కార్లు కూడా దౌత్యానికి వేదికగా మారుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణగా ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కలిసి చేసిన ప్రయాణమే. ద్వైపాక్షిక చర్చల అనంతరం ప్రధాని మోడీ, అధ్యక్షుడు పుతిన్ ఇద్దరూ పుతిన్‌కు చెందిన అత్యంత భద్రత కలిగిన ఆరస్ సెనాట్ ఆర్మర్డ్ లిమోసిన్‌లో కలిసి ప్రయాణించారు. ఈ వాహనాన్ని తరచూ చక్రాలపై కోటగా అభివర్ణిస్తారు. భారత్ మండపంలో జరుగుతున్న ఇన్నోప్రోమ్ ప్రదర్శనకు ఇద్దరు నేతలు ఈ కారులో కలిసి వెళ్లారు. 11 దేశాల సభ్యులతో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు ఒకరోజు ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. గత యేడాది చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా కూడా ప్రధాని మోడీ, పుతిన్ ఇదే కారులో కలిసి ప్రయాణించి వార్తల్లో నిలిచారు. అంతకుముందు మరో రెండు సందర్భాల్లో కూడా ఇద్దరు నేతలు కలిసి కారులో ప్రయాణించారు. శుక్రవారం జరిగిన ప్రయాణం వీరిద్దరి నాలుగో సంయుక్త కార్ రైడ్‌గా నిలిచింది. ద్వైపాక్షిక సమావేశం అనంతరం పుతిన్‌కు చెందిన ఆర్మర్డ్ లిమోసిన్‌లో ఇద్దరు నేతలు భారత్ మండపంలోని ఇన్నోప్రోమ్ ప్రదర్శనకు వెళ్లారు.ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరస్పర ఆసక్తి ఉన్న పలు అంశాలపై కూడా మోడీ పుతిన్ చర్చించారు. పశ్చిమ ఆసియాలోని ఘర్షణలు, నల్ల సముద్ర ప్రాంతంలోని పరిస్థితులు తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఘర్షణలకు పరిష్కారం కనుగొనడంలో సంభాషణ, దౌత్యమే ముందుకు వెళ్లే మార్గమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. శాంతి ప్రయత్నాలకు సహాయం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.పుతిన్ చివరిసారిగా 2025 డిసెంబర్‌లో భారత్‌ను సందర్శించారు. అయితే ఈ నెల ప్రారంభంలో కిర్గిజిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోడీ పుతిన్ మరోసారి భేటీ అయ్యారు. ఇన్నోప్రోమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీదారులు, కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన. ఆధునిక సాంకేతికతలను ప్రదర్శించడానికి, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించడానికి, వ్యాపార సంస్థల మధ్య సంబంధాలను పెంపొందించడానికి ఇది కీలక వేదికగా ఉపయోగపడుతుంది.

## అసెంబ్లీ నుంచి బిజెపి వాకౌట్

>> లోకి వచ్చిన కాంగ్రెస్ ఆ తర్వాత మోసం చేసిందని పాయల్ శంకర్ విమర్శించగా మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో బిజెపి ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బిసి మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన మీరా మాట్లాడేదని ఏలేటి విమర్శించగా బండి సంజయ్‌ను అధ్యక్షుడిగా ఎందుకు తొలగించారని పొన్నం ప్రశ్నించారు. జనగణనలో కులగణనకు అనుకులమా? వ్యతిరేకమా? ఏదో ఒకటి చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు బిజెపిని డిమాండ్ చేశారు.

## 3వేల కోట్లు పైనే ఇచ్చాం

>> భూమిని ఎటిసిలకు బదలాయించిందని చెప్పారు.ఒక్కో ఎటిసిపై రూ.46 కోట్లు ఖర్చు చేశాం,పాలిటెక్నిక్ కాలేజీలు ప్రైవేటుపరం చేయబోం అని పేర్కొన్నారు.ఇప్పటి వరకు ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో అలాగే ఉంటాయి,కేవలం టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి యంగ్ ఇండియా యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నాం అని చెప్పారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానించడమే ప్రభుత్వ ఉద్దేశం,పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునిక ల్యాబొరేటరీలు, పరికరాలు, శిక్షణా సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నదే మా లక్ష్యం అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిసీషిప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశాలను పెంచాలని ఈ నిర్ణయం తీసుకున్నాం అని చెప్పారు. ఎఐ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి కొత్త రంగాలకు అనుగుణంగా కోర్సులను ఆధునీకరిస్తామని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలానే మా తపన,సాంకేతిక విద్య-నైపుణ్యాభివృద్ధి విభాగం అనుసంధానంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్న మౌలిక వసతులు, ల్యాబ్‌లు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాం అని చెప్పారు.విద్యార్థులలో అపోహలను తొలగిస్తాం, జీవోలో సవరణ కావాలంటే చేస్తాం, ఎఐసిటీ అప్రూవల్ లేదని అంటున్నారు, స్కిల్స్ యూనివర్సిటీకే ఆ అప్రూవల్ తీసుకొస్తాం అని చెప్పారు. మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకున్న హరీష్ రావు ఇపుడు ఆ వ్యవస్థనే ముందుకు వెళ్లకుండా కుట్ర చేస్తున్నారు, కడుపులో కుల్లు, పేద పిల్లలపై ద్వేషంతో ఆ కుటుంబం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు.పేద పిల్లలకు మేం అన్యాయం జరగనివ్వం, వారి భవిష్యత్ బాగుండాలనే మా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థలో రెండున్నరేళ్లకే పాఠశాలకు పంపిస్తున్నారు, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఐదేళ్లకు పాఠశాలకు పంపిస్తున్నారు అందుకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారు నర్సరీ, ఎల్.కే.జీ విధానంతో పాటు ఇంగ్లీష్ భాష కోసం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారు అందుకే ప్రభుత్వం పాఠశాలల్లో మొట్ట మొదటిసారిగా ప్రీ ప్రైమరీ విధానాన్ని ప్రారంభించాం' అని చెప్పారు. ఈ ఏడాది 64 వేల మంది ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నాం నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం అని చెప్పారు. విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నాం పదేళ్లు వాళ్లు పట్టించుకోకపోతే మేం ఆధికారంలోకి రాగానే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాం. విద్య కోసం 15 శాతానికి బడ్జెట్‌ను పెంచడమే మా లక్ష్యం, పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రి లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అంటున్నారు ముఖ్యమంత్రి ఆ శాఖను నిర్వహిస్తున్నారంటే ఆది అత్యంత ప్రధానమైనదని అర్థం ముఖ్యమంత్రిగా నేను ఎడ్యుకేషన్ సమీక్ష చేస్తే మొత్తం సిస్టమ్ వచ్చి సమీక్షలో ఉంటుంది అని చెప్పారు. ఈ మాత్రం తేడా కూడా సభ్యుడికి తెలియకపోవడం బాధాకరం నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది 2023-24 బడ్జెట్‌లో బిఆరెస్ ప్రభుత్వం విద్యా శాఖ కు రూ.19,093కోటల కేట్లయిస్తే.. మా ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ.21,292 కోట్లు కేటాయించింది 2025-26 బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ.26,647 కోట్లకు పెంచాం అని చెప్పారు. కేవలం మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచాం.మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 రోజుల్లోనే 10,006 మంది టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశాం అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7857 మంది టీచర్లను నియమించారు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరానికి కూడా దృష్టిలో ఉంచుకుని విద్యా విధానం తీసుకొస్తున్నాం అని చెప్పారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందనినమ్మి విద్యా శాఖ నా దగ్గర పెట్టుకున్నా, ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు చేసినపుడు కొన్ని వివాదాలు జరుగుతాయి అలాంటిదే పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.97 నేను విద్యా శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్నాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మంది పెరిగారు ఇది విద్యా శాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనం అని వివరించారు. కాలేజీలపై విజిలెన్స్ ఎంక్వైరీని, అడ్డు పెట్టుకుని కేసీఆర్ పార్టీ ఫిరాయిం పులను ప్రోత్సహించారు, ఇప్పటి వరకు ఆ రిపోర్ట్ ఏం చేశారో ఎవరికీ తెలియదు అని చెప్పారు.

# దౌత్యమే సరైన దారి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ప్రభావం సముద్ర వాణిజ్యంపై పడుతున్న తీరును, భారత నావికుల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దృష్టికి తీసుకెళ్లారు. వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ముందుకు వెళ్లే మార్గమని మోడీ మరోసారి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా శుక్రవారం మోడీ, పుతిన్ 45 నిమిషాలకుపైగా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారత్-రష్యా సంబంధాలపై సమీక్ష జరిపిన ఇరువురు నేతలు కీలక ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణల కారణంగా సముద్ర వాణిజ్యం, భారత నావికుల భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ముందుకు వెళ్లే మార్గమని మోడీ పునరుద్ఘాటించారని, శాంతి ప్రయత్నాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణల నేపథ్యంలో నల్ల సముద్రంలో ఇప్పటివరకు ఐదుగురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ అంశాన్ని భారత్ మాస్కో, కీవ్‌లతో చర్చించింది. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల మధ్య రష్యాతో ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం సుమారు 65 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

### విడతలవారీగా ఫీజు బకాయిలు: మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాత వార్త:** విద్యార్థులు ఎలాంటిఇబ్బందులు పడకుండా బకాయి లన్నింటినీ పూర్తిగా చెల్లించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై అక్బరుద్దీన్ ఓవైసీ, పాయల్ శంకర్ అడిగిన ప్రశ్నలకు సమాధాన మిస్తూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిలన్నింటినీ విడతల వారీగా పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

### వారం - వర్జ్యం

12-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, పుబ్బ కార్తె,,
తి.పాడ్యమి ఉ.7.48
న. ఉత్తరఫల్గుణి మ.12.58
వ.రా.9.27 - రా.11.03
దు.తె.5.55 - ఉ.7.32
రాహు. ఉ.9.00 - ఉ.10.30, శుభ స. లేదు.

### వార్తాఫలం

**మేషం :** స్పెక్యులేషన్లు దూరంగా ఉండటం మంచిది. ఆదాయాన్ని మించిన ధన వ్యయ సూచన.

**వృషభం :** ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటారు. అనుకున్న విధంగా కాకపోయినా పనులను కొంతవరకు పూర్తి చేయగలుగుతారు.

**మిథునం :** నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఎదుటివారు చెప్పేది ఆసాంతం విని ప్రత్యుత్తరం ఇవ్వండి.

**కర్కాటకం :** ఆశించిన ఋణాలు లభించవు. జీవిత భాగస్వామి సలహాలను సంప్రదింపులను పాటిస్తారు.

**సింహం :** చిరునవ్వును చెరగనివ్వరు. వ్యాపారంలో పురోగతికి ఉపకరించే ఒప్పందాలను చేసుకుంటారు.

**కన్య :** క్రయవిక్రయాలపట్ల ఆసక్తి చూపుతారు. కార్యక్రమాలలో స్పష్టత లోపిస్తుంది. ప్రయోజనాలకు ముప్పు వాటిల్లదు.

**తుల :** విస్తారమైన చర్చలను సాగిస్తారు. ధనాన్ని ఇచ్చిపుచ్చుకునే విషయంలో జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం :** ప్రయోజనాలకు ముప్పు వాటిల్లదు. నమ్మిన సిద్ధాంతాల కోసం కొన్ని త్యాగాలు చేయవలసి వస్తుంది.

**ధనుస్సు :** లౌక్యం లోపిస్తుంది. సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేస్తారు. అదృష్టాన్ని ఎక్కువగా నమ్ముతారు.

**మకరం :** వృత్తి, ఉద్యోగాలపరంగా మీ స్థాయి యధాతథంగా ఉంటుంది. సేవా శ్రమాలను సందర్శిస్తారు.

**కుంభం :** వివాదాలకు ఆమడదూరంలో ఉంటారు. బంధుమిత్రులను కలుసుకుంటారు. ఋణాలు లభించవు.

**మీనం :** ఎవరు మంచివారో! ఎవరు చెడ్డవారో! గుర్తించడం కష్టం. లౌక్యం లోపిస్తుంది. కొన్ని త్యాగాలు చేయవలసి వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గొంతు నొక్కి దాడి చేశారు

>> ఎమ్మెల్యేలపై జరిగిన దాడి, పోలీసులు వ్యవహరించిన తీరుపై బిఆర్ఎస్ ఢిల్లీ వేదికగా పోరును ముమ్మరం చేసింది. మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తన, తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించడంపై బిఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహట్కర్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసుల చేత అవమానించడం, శాసనసభ్యులుగా తమ హక్కులకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి అంశాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు చేస్తున్న దాడులపై స్పందించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలకు సంబంధించిన అన్ని సిసిటివి ఫుటేజీలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నేతలు కోరారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను దేశం మొత్తం గమనిస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రాష్ట్రంలోని సమస్యలపై సభలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే సమావేశాల ప్రారంభ రోజునే తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో, అసెంబ్లీలో అడుగుపెట్టకముందే పోలీసులు తమను నిలువరించారని చెప్పారు. నల్లదుస్తులు ధరించడాన్ని కారణంగాచూపి అడ్డుకున్నా రని, అయితే తమ దుస్తులపై ఎలాంటి అభ్యంతరకరమైన రాతలు లేవని స్పష్టం చేశారు. మేము మంత్రులుగా పనిచేశాం. 20-30 సంవత్సరాలుగా ఎమ్మెల్యేలుగా ఉన్నాం. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన వాళ్లం. అయినా అసెంబ్లీలోకి వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారు? అని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అవమానకరంగా ఉందని ఆరోపించారు. చీర, జుట్టు పట్టుకుని లాగారని, ఇతర ఎమ్మెల్యేలను కింద పడేసి తొక్కారని ఆరోపించారు. అసెంబ్లీ వంటి పవిత్ర ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. 'మా మనసులు గాయపడ్డాయి. భారమైన గుండెలతో మాట్లాడుతున్నాం. మహిళలుగా మాకు అవమానం జరిగింది. శాసనసభ్యులుగా మా హక్కులకు భంగం కలిగింది అని సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగి 100 గంటలు దాటినా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు సంబంధించి కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆమె ఆరోపించారు. మరోవైపు తమపైనే కేసులు నమోదు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతోనే ఢిల్లీకి వచ్చామని తెలిపారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు తమ ఆవేదనను వివరించామని చెప్పారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యు లపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును పూర్తి వివరాలతో జాతీయ కమిషన్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలను భరించి రాజకీయంగా నిలదొక్కుకున్నామని, ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాల్సిన తాము ఇప్పుడు తమపై జరిగిన దాడి గురించి మాట్లాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దారుణమని అన్నారు.అందుకే మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలో న్యాయం జరగలేదని భావించి ఢిల్లీకి వచ్చాం అని సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించి తిరిగి వారిపైనే కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. తమపై జరిగిన అవమానంపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, స్పీకర్ స్పందించి ఉంటే ఆయనకు చేతులెత్తి నమస్కరించేవాళ్లమని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం: జడ్చర్ల మునిసిపాలిటీ,
మహబూబ్‌నగర్ జిల్లా (TS)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
2026-27 సంవత్సరానికి MUDA గ్రాంట్ క్రింద "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై రూ.50.00 లక్షల యొక్క మొత్తానికి 01 పనికి టెండర్ పిలువబడుతోంది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 10.09.2026 మ.02.00గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 18.09.2026 మ.02.00గం. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ ఆధార్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు కార్యాలయం: కమిషనర్, జడ్చర్ల మునిసిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 7337351867.
సం/-, కమిషనర్, జడ్చర్ల మునిసిపాలిటీ.
DIPR.NO. 9847-PP/CL/ADVT/1/2026-27 తేది: 11.09.2026

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**
CIN: L65990MH1984PLC032403 • GSTN: 27AACS7403E1ZN
Reg. Address: Finkurve Financial Services Limited (FFSL/The Company), Unit No. 1 Trade Garden, First Floor, Building No. A, Kamla Mill Compound, Lower Parel, Mumbai - 400013.
Contact Person : Ramprakash Gupta • Mob. 8691962385 • E-mail: Ramprakash.gupta@augmont.com

సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయడమేమిటంటే, ఫిన్‌కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క క్రింద పేర్కొన్న శాఖల వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు, గడువు ముగిసినప్పటికీ మరియు పదేపదే నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు విడిపించుకోబడలేదు. కావున, ఈ ఆభరణాలు 17/09/2026 న వేలం వేయబడతాయి. గోప్యత మరియు డేటా రక్షణ నిబంధనలకు లోబడి, సంబంధిత శాఖల వద్ద లేదా అనుబంధ పత్రంలో శాఖల వారీగా రుణ వివరాలు మరియు వినియోగదారుల వివరాలు అందుబాటులో ఉన్నాయి.

బంగారు వేలం ప్రజా ప్రకటన

**NIZAMABAD - Auction Center Address:** H. No. 7-96, Plot No. 6, First Floor, Meena Idly Center Building, Beside Vijay High School, Mamidipelly, Armoor, Nizamabad Telangana. **Branch Name: ARMOOR ARVOG BRANCH :** Loan A/c No. : **ARMO-15987, ARMO-53123, ARMO-89571, ARMO-17015, ARMO-97889, ARMO-09108, ARMO-63901, ARMO-06182.** • Contact Person : **Samuel Karne, Mobile : 9000931546.**

**Nizamabad - Auction Center Address:** H. No. 1-4/3/B,1st Floor, Main Road, Opp. Govt Hospital, Bheemgal, Dist. Nizamabad, Telangana - 503307. **Branch Name: BHEEMGAL ARVOG F :** Loan A/c No. : **BHEE-67931, BHEE-33227, BHEE-75860, BHEE-77948, BHEE-98106, BHEE-50477, BHEE-92935, BHEE-85481.** • Contact Person : **Ganga Mohan, Mobile : 9948343510.**

**Nizamabad - Auction Center Address:** D. No.1-139, First floor, Main Road, Near Honey Gift Shop, Opp. RTC Busstand, Nandipet, Nizamabad (Dist.)- Telangana -503212. **Branch Name: NANDIPET ARVOG BRANCH:** Loan A/c No.: **NAND-63528, NAND-48911, NAND-36807, NAND-12554, NAND-53294, NAND-50471, NAND-63172, NAND-86291, NAND-93288, NAND-01669, NAND-10490, NAND-64881, NAND-97677, NAND-25789, NAND-79600, NAND-90169, NAND-93668, NAND-51341, NAND-06970, NAND-19260, NAND-57656.** • Contact Person : **Samuel Karne, Mobile : 9000931546.**

**Nizamabad - Auction Center Address:** Municipal No. 5-6-291/2, 1st Floor, Sarawathi Nagar, Hyderabad Road, Nizamabad, Telangana - 503001. **Branch Name: NIZAMABAD ARVOG BRANCH :** Loan A/c No.: **NIZA-02805, NIZA-85264, NIZA-83985, NIZA-15745, NIZA-94511, NIZA-57361, NIZA-77557.** • Contact Person : **Samuel Karne, Mobile : 9000931546.**

వర్తించే నియంత్రణ మార్గదర్శకాలకు అనుగుణంగా, కంపెనీ యొక్క అధికృత వేలం నిర్వాహకుడైన egold.auctiontiger.net ద్వారా వేలం కేంద్రంలో శాఖల వారీగా వేలం నిర్వహించబడుతుంది. ఆసక్తిగల బిడ్డర్లు నమోదు, భాగస్వామ్యం మరియు వివరణాత్మక నిబంధనల కోసం egold.auctiontiger.net ను సందర్శించవచ్చు. వేలం సమయం: 17/09/2026న ఉదయం 10:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు.
ఫిన్‌కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీకి ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా, అవే నిబంధనలపై వేలాన్ని తదుపరి తేదీలకు వాయిదా వేసే హక్కు ఉంది. ఒకవేళ ఏదైనా కారణం చేత వేలం విజయవంతం కాకపోతే, ఫిన్‌కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ, అధికృత వేలం నిర్వాహకుడైన egold.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో తదుపరి వేలం నిర్వహించే హక్కును కలిగి ఉంటుంది.
గమనిక: రుణగ్రహీతలు వేలం తేదీన లేదా అంతకంటే ముందు, సంబంధిత శాఖ యొక్క పని వేళల్లో అన్ని బకాయిలను చెల్లించడం ద్వారా తాకట్టు పెట్టిన తమ బంగారు ఆభరణాలను విడిపించుకోవచ్చు/విడుదల చేసుకోవచ్చు. అలా చేయడంలో విఫలమైతే, ఆభరణాలు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం వేయబడతాయి. ఫిన్‌కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు ముందస్తు సమాచారం లేకుండా వేలం జాబితా నుండి ఏదైనా రుణ ఖాతాను తొలగించే అధికారం ఉంది మరియు ముందస్తు సమాచారం లేకుండా రద్దు చేసే హక్కు కూడా ఉంది.
ప్రదేశం: ముంబై • తేదీ: 12/09/2026
ఫిన్‌కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తరపున

# వీడిన మిలటరీ ఆయుధాల చోరీ మిస్టరీ

### నిందితుడు మద్రాస్ రెజిమెంట్ మాజీ హావల్దార్

### తుపాకులు, తూటాలను నాగర్‌కర్నూలు జిల్లా శ్రీపురంలో గొయ్యితీసి దాచాడు

### నేరం ఎందుకు చేశాడనే దానిపై విచారిస్తున్నాం: డిజిపి ఆనంద్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలో మిలటరీ ప్రాంతంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీపై మిస్టరీ వీడింది. పది రోజులుగా అటు పోలీసులు, ఇటు మిలటరీ అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేసిన ఈ ఘటన లో మాజీ సైనికుడు, ఆయుధాల చోరీ జరిగిన మద్రాస్ రెజిమెంట్‌లో హావల్దార్‌గా పనిచేసి క్రమశిక్షణా రాహిత్యం కింద బలవంతంగా తొలగించ బడ్డ ఉప్పుతోళ్ల మల్లేష్ అలియాస్ రాజు (37)గా నిందితుడుగా తేలింది. ఈ ఆయుధాల చోరీలో ఇతరుల ప్రమేయానికి సంబంధించి ఇప్పటి వరకు ఆధారాలు లభించలేదేని, ఇందులో ఎలాంటి కుట్ర, కుతంత్రం వున్నట్లు తేలలేదని, కోపం, ఆవేశంతోనే రాజు ఈ నేరానికి పాల్పడినట్లు ప్రాథమికంగా ఆధారాలు లభించినట్లు డిజిపి సి.వి ఆనంద్ తెలిపారు. ఈ కేసులో పూర్తి వివరాలను వెలికి తీసేందుకు నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించి అన్ని విషయాలను నిగ్గు తేలుస్తామని శుక్రవారం సాయంత్రం డిజిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో డి జిపి తెలిపారు.

కంటోన్మెంట్ ప్రాంతంలో గల మిలటరీ విభాగంలో వున్న మద్రాస్ రిజ్‌మెంట్ ఆయుధ గోదాములో గత నెల 30వ తేదీన జరిగిన ఆయుధా లు, మందుగుండు సామాగ్రి చోరీపై నిందితుడు ఎట్టకేలకు పట్టుబడ్డాడు. ఆగస్టు 30వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఆయుధాల చోరీపై 31వ తేదీన ఉదయం మిలటరీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. నాలుగు ఎకె 47, ఒక ఇన్సాస్ తుపాకులతో పాటు ఆరు పిస్టళ్లు, మరో సివిల్ విభాగం పిస్టల్, రాత్రిల్లో చూడగలిగే బైనాక్యూలర్, రెండు వేల వరకు తూటాలు చోరీ అవడం విదితమే. కాగా ఈ ఘట న దేశ వ్యాప్తంగా సంచలనం రేపగా దీనిపై విచారణ చేసేందుకు రక్షణ శాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు రంగంలో దిగారు. ఈ చోరీ వెనుక ఇంటి దొంగల హస్తం వుందని మొదటి రోజే పోలీసులు అనుమానించినా ఎటువంటి ఆధారాలు లభించలేదు.

చోరీ జరిగిన ఆయు ధ గోదాము వద్ద రాత్రి వేళల్లో సిసి కెమెరాలు పనిచేయక పోవడం, సిబ్బంది నిర్లక్ష్యం వుండడంతో ఆ సమయంలో ఇక్కడ పనిచేసిన మిలటరీ సిబ్బందిని, అధికారులను విచారించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఈ మిస్టరీని ఛేదించేందుకు ఆయుధ గోదాముపై అధికారం వున్న వారు, ఇక్కడ రాకపోకలు సాగించే వారిని విచారించినా క్లూ దొరకలేదు. దీంతో చివరగా ఈ ప్రాంతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారు. ఉద్యోగాల నుంచి తొలగించబడ్డ వారి వివరాలు సేకరించగా ఇందులో ఇద్దరిపై అనుమానాలు రేగాయి. వీరిలో మద్రాస్ రిజ్‌మెంట్‌లో హావల్దార్‌గా పనిచేసి క్రమశిక్షణారాహిత్యం కింద బలవంతంగా తొలగించబడ్డ ఉప్పుతోళ్ల మల్లేష్ అలియాస్ రాజు కదలికలు, అతని మాట తీరు పోలీసులకు అనుమానాలు పెంచాయి. అయితే ఇతనిపై నిఘా వుంచి ఇంటికి పంపి ఎవరెవరిని కలుస్తున్నారనే దానిపై సమాచారం సేకరించారు. ప్రకాశం జిల్లాకు చెందిన రాజు నాగర్‌కర్నూలు జిల్లా ఆమ్రాబాద్ మండలం జంగారెడ్డిగూడెం శ్రీపురంలో కొంతకాలంగా వుంటున్నాడు. ఇతన్ని విచారణకు పిలిస్తే రాకపోవడం, ఒకసారి వచ్చిన సమయంలో విచారణలో బెదరడం వంటివి జరిగాయి. ఇదే సమయంలో రాజు భార్య , మామకు ఆయుధాల చోరీ గురించి వివరించి, దీని తీవ్రతను పోలీసులు వివ రించారు. చివరగా రాజు భార్య కూడా గట్టిగా నిలదీయడంతో అ తను నేరాన్ని అంగీకరించాడు. మిలటరీ ఆయుధాలను తానే చోరీ చేసినట్లు అతను తెలిపాడు.

గత నెల 30వ తేదీ రాత్రి మొదట మోటార్‌సైకి ల్‌పై ఆయుధాలు వుండే చోటుకు వచ్చిన రాజు తొలుత తుపాకులు వుండే గది తాళాలు బద్దలు కొట్టి తుపాకులను దొంగిలించాడు. అనంతరం రెండవ దఫాగా మందుగుండు సామాగ్రి వుండే గది తాళాలు బద్దలుకొట్టి వాటిని దొంగిలించాడు. దీని తరువాత మోటార్‌సైకిల్‌పై వాటిని తర లించి రెండు కిలోమీటర్ల దూరంలో గల ఒక దేవాలయం వద్ద వుంచాడు. అనంతరం మరోదఫా మళ్లీ వచ్చి మందుగుండు సామాగ్రి వుండే గ ది నుంచి తూటాలను వుండే కవర్లు దొంగిలించాడు. దీని తరువాత మోటార్‌సైకిల్‌పై ఇదే ప్రాంతంలో గల బాలాజినగర్‌లో తాను వుండే ఇంటి కి వెళ్లాడు. అనంతరం తాను వాడే ఫ్రీజా కారును దేవాలయం వద్దకు తీసుకువచ్చి ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని వాటిలో దాచిపెట్టి తెల్లవారుజామున అంటే ఆగస్టు 31వ తేదీన నాలుగున్నర గంటలకు బాలాజినగర్‌కు వెళ్లాడు. దీని తరువాత కారులో దేవరకొండ, డిండి మా ర్గంలో వెళ్లాడు. శ్రీశైలం మార్గంలో వెళితే టోల్‌గేట్లు వుంటాయనే భయంతో దేవరకొండ మార్గంలో వెళ్లాడు. మార్గమధ్యలో ఆరుగురు ప్రయా ణీకులను ఎక్కించుకుని వారు దిగేచోట దించి డబ్బులు తీసుకున్నాడు. దీని తరువాత ఈ నెల ఒకటవ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు అచ్చ ంపేట్‌కు చేరుకున్నాడు. అనంతరం కారును తన కుటుంబం వుండే శ్రీపురం గ్రామానికి వెళ్లాడు.

అక్కడ ఎవరు చూడని సమయంలో గోతితీసి, ఆయుధాలను దాచివుంచాడు. ఈ గోతిపై వరిగడ్డితో పాటు చెత్తను వేసి ఎవరికి అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డాడు. ఈ ఆయుధాలను అప్ప టి నుంచి ఈ నెల ఆరవ తేదీ వరకు అక్కడే వుంచాడు. ఆరవ తేదీ ఉదయం కారులో తీసుకువెళ్లి ఇదే ప్రాంతంలో గల తన మిత్రుడి ఇంట్లో దాచాడు. అయితే మిత్రుడు దీనిపై నిలదీయడంతో ఎనిమిదవ తేదీన వాటిని తిరిగి తన ఇంటికితెచ్చి ఇదివరకు దాచిన చోట వుంచాడు. కాగా రాజు వ్యవహారంపై పోలీసులకు అనుమానం రావడంతో అతన్ని గురువారం నాడు విచారణకు పిలిపించి భార్య సమక్షంలో విచారించడంతో తన నేరాన్ని అంగీకరించాడు. దీని తరువాత పోలీసులు అతని శ్రీపురంలో అతని ఇంటిని సోదాచేయగా బయట గోతిలో దాచిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రి వెలుగు చూశాయి. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని హైదరాబాద్‌కు తరలించారు. ఆవేశం, కోపం తోనే నేరం చేసి నట్లు ప్రాథమిక ఆధారాలు, ఇతరుల ప్రమేయంపై ఆధారాలు లభించలేదు. ఈ కేసును ఛేదించి న పోలీసులను డిజిపి అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, సిటీ కొత్వాల్ సజ్జన్నర్, నిఘా విభాగం అ దనపు డిజి విజయ్ కుమార్, మల్కాజిగిరి కొత్వాల్ సుమతి తదితరులు పాల్గొన్నారు.



## హైవేలపై టోల్‌ప్లాజాల వద్ద డిజిటల్ విధానం

### కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ

**ముంబయి, సెప్టెంబరు 11:** హైవేలపై టోల్ చెల్లింపుల్లో కీలక మార్పు రానుంది. ఇక వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానాన్ని తీసుకురానున్నారు. వచ్చే ఫిబ్రవరిలోగా ఈ విధానం అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌కు వాహన నంబర్‌ప్లేట్ గుర్తింపు సాంకేతికతను జోడించనున్నట్లు చెప్పారు. ఫాస్టాగ్, నంబర్‌ప్లేట్ రెండింటి సాయంతో వాహనాలను గుర్తించి టోల్ వసూలు చేస్తారు. కొత్త విధానం వల్ల టోల్ వసూళ్లు ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందని గడ్కరీ చెప్పారు. టోల్ చెల్లించేందుకు వాహనాలు ఆగకపోవడంతో ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని తెలిపారు. ఫాస్టాగ్ రాకతో టోల్ ప్లాజాల వద్ద వేచిచూసే సమయం ఇప్పటికే 80 నుంచి 90 శాతం తగ్గిందని మంత్రి చెప్పారు. గతంలో 12 నిమిషాల వరకు ఉండే నిరీక్షణ కొన్నిచోట్ల 30 నిమిషాలకు చేరేదన్నారు. ఇప్పుడు మిగిలిన ఆలస్యాన్ని కూడా సాంకేతికతతో తొలగించనున్నట్లు వివ రించారు. ఫాస్టాగ్‌ను 2016లో ప్రవేశపెట్టారు. 2021లో దేశవ్యాప్తంగా తప్పనిసరి చేశారు. వాహనం టోల్ ప్లాజాను దాటుతున్నప్పుడు ఫాస్టాగ్ ద్వారా అనుసంధానిత ఖాతా నుంచి రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవు తుంది. నగదు చెల్లింపులతోపాటు చిల్లర కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకపోవడంతో టోల్ వసూళ్లు వేగంగా మారాయి. ఇక తదుపరి దశలో టోల్ ప్లాజాల వద్ద అడ్డంకులే లేకుండా వాహనాలు నేరుగా వెళ్లేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు.

## త్వరలో పాలిటెక్నిక్ విద్యార్థులకు శుభవార్త: మంత్రి వివేక్‌వెంకటస్వామి

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** త్వరలోనే పాలిటెక్నిక్ విద్యార్థులకు శుభవార్త చెబుతామని మంత్రి వివేక్ ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో విద్యాసంస్కరణలపై జరిగిన చర్చలో మంత్రి పాల్గొన్నారు. జీవో97లో మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, పాలిటెక్నిక్ విద్యను రూ.8 వేల కోట్లతో ఆధునీకరించాలని భావిస్తున్నట్లు వివరించారు. పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ అవుతుందని అపోహలు ఉన్నాయని, ఈ విభాగం ప్రభుత్వ అధీనంలోనే ఉంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని,బిఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు.

## పోలీసు కేసుపై కెటిఆర్ పిఆర్‌ఒ, పిఎలకు హైకోర్టులో ఊరట

### అరెస్టు చేయవద్దని పోలీసులకు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** అసెంబ్లీ గేటు వద్ద సోమవారం నాడు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పోలీసులతో గొడవ పడిన ఘటనకు సంబంధించి సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులుగా వున్న కెటిఆర్ పిఆర్‌ఓ మహేష్‌తో పాటు పిఎ మహేందర్‌లకు హై కోర్టులో ఊరట లభించింది. వీరిద్దరిపై సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో బిఎన్ఎస్ 132, 351 (2), రెడ్‌విత్ 3 (5) బి సెక్షన్ల కింద గురువారం కేసు నమోదవడం తెలిసిందే. దీనిపై మహేష్, మహేందర్‌లు శుక్రవారం హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం దీనిపై తదుపరి విచారణ జరిగే వరకు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయరాదని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

## కృత్రిమ పనీర్‌పై యేడాది పాటు నిషేధం

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని కృత్రిమ పనీర్ తయారీ, అమ్మకం, వాడకంపై యేడాది పాటు నిషేధం విధించారు. ఈ మేరకు టిజి సేఫ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. పాలతో సంబంధం లేకుండా రసాయనాలు, ఇతర ప దార్థాలతో తయారుచేసే నాన్ డెయిరీ లేదా ఆర్టిఫిషియల్ పనీర్ వల్ల అనేకచోట్ల అనేక మంది అనారోగ్యం పాలైనట్లు అందిన ఫిర్యాదుల మేర కు దీనిపై నిషేధం విధించారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006 నిబంధనల ప్రకారం ఈ నిషేధం వెంటనే అమల్లో వస్తాయని టిజి సేఫ్ డైరక్టర్ అవినాష్ మొహంతి తెలిపారు. కృత్రిమ పనీర్‌పై నిషేధం వల్ల దీని తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిలువచేయడం, పంపిణీ చేయడం, విక్రయించడం వంటివి ఎవరూ చేయ రాదు.

ఎవరైనా ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవినాష్ మొహంతి హెచ్చరించారు. కృత్రిమ పనీర్‌పై ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

## వేడి నీళ్ల బకెట్‌లో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి



బాలిక మనస (ఫైల్)

**హైదరాబాద్ (అత్తాపూర్) సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** వేడి నీళ్ల బకెట్‌లో పడి నాలుగేళ్ల బాలిక మానస మృతి చెందిన విషాద ఘటన మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో చోటు చేసుకుంది. వేడినీళ్ల బకెట్‌లో ప్రమాద వశాత్తూ పడి తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒ కుటుంబం ఉపాధి నిమిత్తం మైలార్ దేవ్‌పల్లి పరిధిలోని ప్రగతినగర్‌లో నివాసముంటోంది. చిన్నారి తల్లి ఓ కంపెనీలో పనిచేస్తోంది. పని ముగించుకుని ఇంటికి వచ్చిన అనంతరం స్నానం చేసేందుకు బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టి నీటిని వేడి చేస్తోంది.అదే సమయంలో ఆమెకు ఫోన్ రావడంతో కొద్దిసేపు బయటకు వెళ్లింది. ఇంట్లో ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలిక మానస ప్రమాదవశాత్తూ వేడినీళ్లతో ఉన్న బకెట్‌లో పడిపోయింది. దీంతో చిన్నారి శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మానస మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## జూబ్లీహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** భర్త నుంచి విడిపోయి ఒంటరిగా వుంటున్న వివాహితపై లైంగిక దాడికి పాల్పడడంతో పాటు ఆ మె నుంచి మూడు కోట్ల రూపాయలు తీసుకున్న కేసులో నిందితుడుగా వున్న జూబ్లీహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి ముందస్తు బెయి ల్‌ను హైకోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో శ్రీనివాసులు రెడ్డిని ఇప్పటికే సస్పెండ్ చేయడం తెలిసిందే. శ్రీనివాసులు రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసిన హైకోర్టు దీనిపై పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## పశ్చిమబెంగాల్ బొగ్గు కుంభకోణం కేసులో ఇడి దూకుడు

### హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, జార్ఖండ్‌లోని పలుచోట్ల సోదాలు

### ఎఆర్ఎం సంస్థ కార్యాలయంలో పత్రాలు జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ సిఎంగా వున్న సమయంలో వెలుగు చూసిన బొగ్గు కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దూకుడు పెంచింది. ఈ స్కాంపై ఇప్పటికే పశ్చిమ బెంగాల్ పోలీసులు నేరు గా విచారిస్తుండగా ఈడీ అధికారులు సమాంతరంగా విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం నాడు ఈడీ అధికారులు హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, జార్ఖండ్‌లోని పలు ప్రాంతాలలో ఏక కాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు సంబంధించి ఏఆర్ఎం సంస్థ కార్యాల యంలో ఈడీ అధికారులు తనిఖీలు చేబట్టారు. ఈ సంస్థ అధిపతిగా వున్న మహేష్ రెడ్డి టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాత కావడం గమనార్హం. ఆ యన కార్యాలయంతో పాటు ఈ సంస్థతో సంబంధం వున్న ఇతరుల ఇళ్లు, కార్యాలయాలలోనూ సోదాలు నిర్వహించారు. బెంగాల్‌లో సంచ లనం రేపిన ఈ స్కాంలో రూ. 650 కోట్లకు పైగా గోల్‌మాల్ జరిగిందని ఈడీ అభియోగాలు మోపడం తెలిసిందే. బెంగాల్‌లోని దుర్గా పూర్.. అసన్సోల్ ప్రాంతానికి అక్రమంగా బొగ్గును తరలిస్తూ డెలివరీ ఆర్డర్ హోల్డర్లు, రవాణాదారుల నుంచి గూండా టాక్స్, రంగదారి పన్ను ల పేరుతో బొగ్గు సిండికేట్ మమత బెనర్జి హయాంలో బొగ్గు సిండికేట్ ఏకంగా 650 కోట్ల రూపాయలకు పైగా ప్రొసీడ్స్ ఆఫ్ క్రైం (నేర పూ రిత రాబడి) ఆర్జించిందని ఈడీ ప్రాథమికంగా నిర్ధారించడం తెలిసిందే. బెంగాల్‌లో అక్రమ కోల్ మైనింగ్ వ్యవహారంపై ఈడీ అధికారులు ఇప్ప టికే ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖ లు చేసింది. ఈ కేసులో అరెస్టయిన చిన్మయ్ మొండల్, కిరణ్ ఖాన్‌లతో పాటు మరో ముగ్గురి పేర్లను ఇందులో నిందితులుగా ఇడి చేర్చింది. బొగ్గు అక్రమ రవాణా నిరాటంకంగా సాగేందుకు స్థానిక రాజకీయ ప్రముఖులతో పాటు కొందరు సర్కారు అధికారులకు భారీగా లంచాలు ఇచ్చినట్లు ఈడీ తేల్చింది. కాగా దాడుల సందర్భంగా అన్నిచోట్ల కీలక పత్రాలను ఈడీ జప్తు చేసింది. అక్కడి అధికారుల వాంగ్మూలం నమోదు చేసింది.

## కొండా సురేఖ మాజీ ఒఎస్డీ సుమంత్ తండ్రి ఆత్మహత్యాయత్నం

**ప్రభాతవార్త సుబేదారి, సెప్టెంబరు 11:** మాజీమంత్రి కొండా సురేఖ ఒఎస్‌డి సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం నిద్రలేవకపోవడంతో కుటుంబసభ్యులు వరంగల్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నది. అయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం కు ట్రీట్‌మెంట్ జరుగుతున్న హాస్పిటల్ నుండి సుమంత్ భార్య మాట్లాడుతూ మాజీమంత్రి కొండా సురేఖకు ఒఎస్‌డిగా పనిచేసిన సుమంత్‌పై ప్రభుత్వం నుండి ఒత్తిళ్ల పెరగడంతో మా మామయ్య ఆత్మ హత్యయత్నానికి పాల్పడినట్టు తెలియజేశారు. ఇప్పటికే సుమంత్ పోలీ సుల ఎదుట లొంగిపోయినప్పటికీ కుటుంబసభ్యులకు బంధువులపై ఒత్తిడి తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాకు సుమంత్ భార్య వాస్తవాలని మాత్రమే ప్రచారం చేయండి అని మీడియాకు ఆమె ఒక విడి యో ద్వారా విన్నవించుకున్నారు. సుమంత్ లైఫ్ నాశనం అయిందని ఇంతా టార్చర్ పెట్టడమేంటి? ఒత్తిడి తట్టుకోలేక మా మామయ్య సూసైడ్ అటెంప్ట్ చేశారని ఆమె తెలిపారు. మా అందరికీ ఇదొక బ్రేకింగ్ పాయింట్ మా మామయ్య చావుబతుకుల మధ్య ఉన్నారు, సుమంత్ ఐఐఎంలో చదువుకున్నారు. కార్పొరేట్ సెక్టార్ కాదనుకుని సురేఖ దగ్గరగా ఒఎస్‌డిగా పనిచేశారు కేసుల వల్ల చాలా డిస్టబ్ అయ్యాం ఇవన్నీ మాకెందుకని బిజినెస్ చేసుకుంటున్నాం, ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. సుమంత్ విషయంలో మా బంధువుల్లో చాలామందిని పోలీసులు టార్చర్ పెడు తున్నాడు. అని ఆమె విడియో ద్వారా మీడియాకు తెలియజేసారు.



సుబ్రహ్మణ్యం

## శ్రీశైలం, సాగర్‌లో భారీగా తగ్గిన విద్యుత్ ఉత్పత్తి

### 865 మిలియన్ యూనిట్లకు పడిపోయిన ప్రొడక్షన్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభవ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో జల విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా మూడో వంతుకుపడిపోయింది. వానాకాలం సీజన్ ప్రారంభమైన జూన్ 1వ తేదీ నుంచి గత నెలాఖరు వరకు కేవలం 865 మిలియన్ యూనిట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయింది. గతేడాది ఇదే కాలంలో 2,609 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అయింది. ప్రధాన జల విద్యుత్ కేంద్రాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్లోనూ ఈసారి జనరేషన్ భారీగా తగ్గింది. సరైన వర్షాలు లేక నీటి లభ్యత తగ్గడంతో సాగర్ లెఫ్ట్ కెనాల్, సింగూరు హైడల్ పవర్ జనరేషన్ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రాష్ట్రం థర్మల్ విద్యుత్తై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. కృష్ణా, గోదావరి బేసిన్లలో కలిపి రాష్ట్రంలో 2,441.76 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని జెన్కో నిర్వహిస్తోంది. సాధారణంగా వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించి హైడల్ పవర్పై ఆధారపడతారు.

కానీ ఈసారి జల విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో థర్మల్ ప్లాంట్లపై ఒత్తిడి పెరుగుతోంది. గతేడాది హైడల్ పవర్ ఉత్పత్తి రికార్డు స్థాయిలో నమోదైంది. ఏడాది మొత్తంలో 6,913.42 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసి 50 ఏండ్ల రికార్డులను అధిగమించింది.

గతేడాది జూన్ నుంచి ఆగస్టు 31 వరకు 2,609.57 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా, ఈసారి కేవలం 865.28 మిలియన్ యూనిట్లకే పరిమితమైంది. మరోపక్క కృష్ణా, గోదావరి నదుల ఎగువ ఈప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలోనూ వర్షాలు తగ్గడంతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలకు వరద ప్రవాహాలు తగ్గాయి. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల, పులిచింతల వంటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో విద్యుత్ డిమాండ్ మరింత పెరగ్గా, ఇదే సమయంలో తగిన నీటి నిల్వలు లేక విద్యుత్ ఉత్పత్తి భారీ పతనానికి దారితీసింది.

## కొట్టుకుపోయిన పోతిరెడ్డిపాడు గేట్

### నిరంతరంగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఆంధ్రకు నీళ్లు

### శ్రీశైలం జలాశయానికి గడ్డు పరిస్థితి?

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** శ్రీశైలం జలాశయం నుంచి రాయలసీమకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తరలించేందుకు ఏర్పాటు చేసిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ తొమ్మిదవ రోప్ తగ్గిపోవడం చర్చనీయాంశం అయింది. శ్రీశైలం జలాశయం నుంచి గత కొన్ని రోజులుగా 8 వేల క్యూసెక్కుల చొప్పున పోతిరెడ్డిపాడు నుంచి నిరంతరంగా నీటిని తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం పోతిరెడ్డిపాడు తొమ్మిదవ గేట్ రోప్ తెగిపోవడంతో గేటు కూడా నీటి ప్రవాహంతో పాటు



కొట్టుకుపోయింది. దీంతో శ్రీశైలం బ్యాక్ పార్ట్ నుంచి నిరంతరంగా నీరు ఆంధ్రకు తరలిపోతున్నది. ఈ విషయంపై ఇప్పటివరకు ఇరిగేషన్ అధికారులు స్పందించ కపోవడం మరింత ఆందోళ నకు గురి చేస్తు న్నది. శ్రీశైలం జలాశ యంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు అందిన సమాచారం మేరకు జలాశయం పూర్తి సామర్థ్యం 215.807 టిఎంసిలకు గాను ప్రస్తుతం 124.5286 టీఎంసీలు నిల్వ ఉన్నది. శుక్రవారం ఉదయం టీఎస్ పవర్ హౌస్ కు 17036 క్యూసెక్కులు, హంద్రీనీవా సృజన స్రవంతి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి 2005 క్యూసెక్కులు, మాత్మ గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి 1267 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు 8000 క్యూసెక్కులు, వెలుగొండ ప్రాజెక్టుకు 3500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ప్రాజెక్టుకు 720 క్యూసెక్కులు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు తొమ్మిదవ గేట్ రోప్ తగ్గిపోవడంతో శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నిరంతరంగా ఆంధ్రకు తరలి వెళ్తున్నాయి. రెండు మూడు రోజుల పాటు గేట్లకు మరమ్మత్తు చేయకుండా ఇదే విధంగా నీటి తరలితే 100 టీఎంసీల లోపు శ్రీశైలం జలాశ నీటి నిల్వలు తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా 200 టీఎంసీలకు పైగా నీరు ఉన్నప్పుడు మాత్రమే పోతిరెడ్డిపాడు నుంచి తొమ్మిది గేటు నుంచి నీటిని తరలించాల్సి ఉండగా 127 టీఎంసీల ఉన్నప్పుడు నీటిని తరలించడం వెనుక పలు అనుమానాలకు తావిస్తున్నది.

ఎల్‌నినో ఎఫెక్ట్ కారణంగా వర్షాలు తక్కువగా పడడం ఎగువ నుంచి వరద కూడా తక్కువగా రావడంతో ఈ ఏడాది శ్రీశైలం జలాశయం గరిష్టంగా 180 టిఎంసిలకు మాత్రమే చేరుకున్నది. గత కొన్ని రోజులుగా ఆంధ్ర ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి హంద్రీనీవా, ముచ్చుమర్రి , పోతిరెడ్డిపాడు, వెలుగొండ పథకాల ద్వారా ఆంధ్రకు నీళ్ల తరలించకపోతున్నది. ఈ క్రమంలో పోతిరెడ్డిపాడు తొమ్మిదవ గేటు రోప్ తెగిపోవడం మరింత అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి మరమ్మత్తులు చేపట్టి అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు భావిస్తున్నారు.




వార్త

మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్నీ నశిస్తాయి కాని వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

- భర్తృహరి

# నజరానాలకూ షరతులు!

దేశ రాజకీయాల మాటున 'నీ కది నాకది' అని ఉపకారాలు ప్రత్యుపకారాల తంతు నడుస్తున్న దారిలోనే 'ముందస్తు ఉచితాలు మీకు, ఆ తర్వాత శుభమస్తునాకు' అనే ధోరణిలో బల్లచాటు వ్యవహారాలు వడివడిగా నడచిపోతున్నాయి. ఇవన్నీ భారత దేశానికే సొంతం అనుకోవడం సరికాదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మహాశయుడు 'ఇదేదో బాగుందని' ఆచరించేందుకు సిద్ధమౌతున్న సంకేతాలు కనపడుతున్నాయి.అమెరికా రాజకీయ పాలనా వ్యవహారాల్లో ట్రంప్ విధానాలు ఎప్పుడూ చర్చనీయాంశాలుగానే ఉంటున్నాయి. ఎప్పటికెయ్యది అవసరమో! అప్పటికదే మాట్లాడటం ఆయనకు తెలియని విద్య. ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామనే హామీలు, పన్నులు తగ్గింపులు, కొందరు ప్రజలకు ప్రత్యేకించి ఏదో ఓ మేలు చేస్తున్నామని చెప్పుకునే ధోరణిలో 'ఉచితా'లు ప్రకటించడం సర్వసాధారణమైపోయింది. ఈ ధోరణిని వంట బట్టించుకున్న ట్రంప్ అమెరికా ఓటర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. త్వరలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో తమ పార్టీకి ఘనవిజయం లభించి రిపబ్లికన్‌ల నియంత్రణ కొనసాగిస్తే ప్రతి ఒక వయోజనునికి 5వేల డాలర్లు ఉచితంగా అందచేస్తానని ప్రకటించారు. నిజానికి ఒక పక్క ట్రంప్‌కు ప్రజాదరణ బాగా తగ్గిపోతుందని పలుసర్వేలు అధ్యయన విశ్లేషణలు చెబుతున్నాయి. అమెరికా ఎన్నికల చరిత్రలోనే ఇలాంటి ఆఫర్ ఇవ్వడం ట్రంప్ నుండే మొదలవుతోంది. ఒకపక్క ఇరాన్ మీద అనుచిత యుద్ధంలో పర్యవసానాలుఎటూ తేలకపోగా మళ్లీమళ్లీ విద్వేషాలు రగులుతున్నా యి. ఆ యుద్ధానికి అయిన, అవుతున్న ఖర్చు అంత తక్కువేమీ కాదు. అయినా ట్రంప్ మాటల్లో చెప్పాలంటే యుద్ధతంత్రం కొరకరాని కొయ్యగా మారినట్లే. అందుకైన ఖర్చు కూడా తడిసి మోపెడని విశ్లేషకులే చెప్తున్నారు. అయినా అమెరికా చెక్కుచెదరని ఆర్థిక బలంతో ఉందని చెప్పుకోవడం విశేషం. ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకిఎదురుగాలివీస్తోందన్నది గత ఆరునెలలుగా బయటకు వస్తున్న సమాచారం. ట్రంప్ ఎప్పుడు ఏమి చేసినా ఎలాచేసినా, సంచలనాత్మకంగానే ఉంటుందన్నది ప్రపంచానికి తెలిసిందే. ఈసారి ఆయన 'ట్రంప్ డివిడెండ్' పేరిట నజరానాలు ప్రకటించారు. ట్రంప్ చేష్టలు, నిర్ణయాల వలన ఇప్పటికే రిపబ్లికన్ పార్టీ పరువు నానాటికీ తగ్గిపోతోంది. దానిని కిందకు దిగజారకుండా ట్రంప్ పన్నిన వ్యూహాల పాచికలు పారేటట్లులేవు. అమెరికాలో 20కోట్ల మందికి పైగానే వయోజనులు ఉన్నందున వారందరికీ తన మాట ప్రకారం ఒక్కొకరికీ 5వేల డాలర్ల చొప్పున ఇవ్వాల్సివస్తే కనీసం లక్ష కోట్ల డాలర్లు అవసరమౌతుంది. అమెరికా ఖజానా తీవ్ర ద్రవ్యోల్బణ సమస్యతోతలబద్దలు కొట్టుకుంటోంది. ఇప్పటికే బాగా అప్పులో మునిగిపోయింది. బుధవారం డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ కార్యక్రమంలో ట్రంప్ ఎంతో ధీమాగా కానుకలు ప్రకటించారు. అమెరికా తన పౌరులను వాటాదారులుగా భావించి ఇలా డివిడెండ్ అందచేస్తోందన్న రీతిలో మాట్లాడారు. ఇప్పటికే ఉన్న ద్రవ్యోల్బణం, అప్పుల్లో మునిగిన ఖజానాలకు మరింత లోటులో కూరుకుపోయేటట్లు చేస్తోంది. దాదాపు 18 ట్రిలియన్ డాలర్ల వార్షిక బడ్జెట్ లోటులో ఉంది. రిపబ్లికన్‌లు గెలిచారంటేనే వయోజనులు గెలిచినట్లు అంటూనే వారి కోసం అందుకునే డివిడెండ్ ఎంతో ఆశావహ స్థాయిలోఉందని ప్రకటించారు. దాదాపుఆయన ప్రసంగాన్ని పోల్చిచూస్తే యావత్తుభారత్‌లో వివిధరాష్ట్రాల ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా ప్రభుత్వాలు పార్టీలు ప్రకటించినట్లుగానే 'ఉచితా'ల స్థాయిలో ఉన్నాయి. ముందు ఇచ్చినా తర్వాత ఇచ్చినా వయోజన ఓటర్లకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తానని చెప్పడమంటే దానిని 'ఎర'గానేభావించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ట్రంప్ ఏ లెక్కన ఇలాంటి ఉచితాలు ప్రకటించారో కానీ అమెరికాకు ఈవాగ్దానం మరింత భారమే.అంతేగాదుఅమెరికాలో కనీసం 10 లక్షల మంది 'ఒబామా కేర్' లబ్ధిదారులకు 500 డాలర్ల రిబేట్ చెక్కులు కూడా ముదరా ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. గత బైడెన్ ప్రభుత్వ హయాంలో ఒబామా కేర్ కింద ప్రజలనుంచి ప్రీమియం అధికంగా వసూలు చేశారని ఆది నుంచి ట్రంప్ ఆక్షేపిస్తూనే ఉన్నారు.ఈసారి తాము ప్రతి ఒక్కరికీ అధిక ప్రీమియం సొమ్మును వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇన్ని రకాల ప్రయోజనాల విషయంలో ట్రంప్ గుప్పిస్తున్న వాగ్దానాలకు నిధులు ఎలా సమకూరుస్తారో ఆయన చెప్పకపోయినా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ట్రంప్ 'డివిడెండ్' అందుకునే వారి జాబితాలో సంపన్నులు ఉండరని తేల్చి చెప్పారు. వయోజనులకిచ్చే కానుకల సొమ్మును సుంకాలద్వారా వచ్చేఆదాయన్నుంచి ఖర్చు చేస్తారని వివరించారు. ఈ సరికే అమెరికన్‌లు ఆరోగ్యబీమా రుసుములు, ప్రీమియమ్‌ల భారంఅధికంగా మోస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతో మంది తమ ఆరోగ్య బీమా ప్లాన్‌లను తగ్గించుకోవడం లేక ఉపసంహరించుకుంటున్నారు. ప్రజల్ని అనేక రకాలుగా ఇబ్బందుల పాలు చేస్తున్న ట్రంప్ పాలన కొత్తకొత్త నజరానాల ప్రకటనల నేపథ్యంలో రిపబ్లికన్‌ల పట్ల ఎలాంటి ఆదరణ చూపగలరో వేచి చూద్దాం. విచిత్రమేమిటంటే తానిచ్చే నజరానాలు అమెరికాలోనే ఖర్చు చేయాలిట. ఏ కెనడానో, జర్మనీ, చైనానో వెళ్లి ఖర్చు చేస్తానంటే కుదరదని షరతులు పెట్టాడు. ఇలాంటి కానుకలు ఎలా ఖర్చు చేయాలో ఎక్కడ ఖర్చు చేయాలో చెపుతూ షరతులు వర్తిస్తాయంటే 'ట్రంప్'కు మామూలుగా లేదనుకోవాలి. ఎన్నికల ముందు ఇలాంటి ప్రకటనలు అనైతికమేఅయినా ట్రంప్ జంకడు లొంగడు. అమెరికన్ ప్రజాస్వామ్యంలో ట్రంప్ తరహా ముద్ర అంటే ఇదేనేమో!



మనిషి విలువ అతని మాటలనుబట్టి, చేతలనుబట్టికాక, అతను జీవితంలో ఎలా మారుతున్నాడనే దాని మీదనే ఆధారపడి ఉంటుంది.

అరవింద ఘోష్



జీవితంలో ఎన్ని కోట్లు సంపాదించినా కలగని ఆనందం ఒక మంచి మిత్రుణ్ణి పొందినప్పుడు కలుగుతుంది.

ఎస్.రాధాకృష్ణన్

# ప్రజాస్వామ్యాన్ని ప్రహసనం చేయొద్దు

**సోమ, మంగళవారాల్లో కొందరు గౌరవసభ్యులు వాడిన భాష, వ్యవహరించిన తీరు పరాకాష్ఠగా చెప్పొచ్చు. క్షమాపణల పర్వం మొదలైంది. తర్వాత బిఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడంతో సస్పెన్షన్ పర్వం మొదలైంది. ఏదిఏమైనా ఎంతో విలువైన సభాకాలాన్ని వృధా చేసి, వ్యక్తిగత దూషణలు చేసి అవి అందరు వినడమే కాదు టీవీల ద్వారా వీక్షించిన తర్వాత ఇప్పుడు క్షమాపణలు చెప్పుకుంటే, రికార్డుల నుంచి తొలగిస్తే ప్రజలు మరిచిపోతారా అన్నది ఒక్కసారి ఆలోచించాలి. ఆవేశానికిలోనై అనాలోచితంగా మాట్లాడితే ఆ తర్వాత క్షమాపణలు చెబితే వారి గౌరవం వారే కించపరుచుకుంటున్నట్లు అవుతుంది. ఇప్పుడు కేసుల పర్వం మొదలైంది. మొత్తం మీద ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా రాజ్యాంగానికి పుట్టినిల్లుగా భావిస్తున్న చట్టసభల్లో కార్యక్రమాలు జరుగుతున్న తీరు అందరిని కలచివేస్తున్నది. ఇప్పటికైనా మనసుపెట్టి పార్టీలకు అతీతంగా అందరూ ఆలోచించాల్సి న తరుణమిది.**

దామెర్ల సాయిబాబ

ఇల్లు కాలి ఒకరు ఏడుస్తుంటే ఆ మంటల్లో చుట్ట కాల్చుకునేందుకు వాదులాడుకున్నట్లుగా ఉంది తెలంగాణ రాష్ట్ర శాసనసభలో కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరు. అడ్డూ అదుపు లేకుండా పెరిగిన ధరలు, వర్షాభావ పరిస్థితులతో ప్రజలు అల్లాడుతుంటే వ్యక్తిగత దూషణలతో, వాదులాటలతో శాసనసభలో బాధ్యత కలిగిన ప్రజాప్రతి నిధులు వ్యవహరించడం ప్రజాస్వామ్యవాదులు జీర్ణించు కోలేకపోతున్నారు. కొందరు సభ్యులు వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న విన్యాసాలు, మాట్లాడుతున్న మాటలు విని విస్తుపోతున్నారు. వీరా మన నాయకులు అన్నట్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈసారి అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఖరీఫ్ అదను దాటిపోయిందనే చెప్పొచ్చు. సూపర్ ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ సాగుపై తీవ్రంగా చూపుతున్నది. ఇంకొకపక్క ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఆకాశానికి ఎగబాకుతున్నట్లుగా పరిస్థితి కన్పిస్తున్నది. రాబోయే కరవును దృష్టిలో ఉంచుకొని కొందరు దళారులు పెద్దఎత్తున సరుకులను నల్ల బజారుకు తరలించి నిల్వ చేసుకుంటున్నట్లు వార్తలు అందుతున్నాయి. ఏ కోణం నుంచి చూసినా సామాన్యుల జీవితం అతలాకుతలమ వుతున్నది. మరోపక్క నేరాలు, ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, పట్టపగలు హత్యలు పెరిగిపోయాయి. ఇక ప్రమాదాల గురించి చెప్పక్కర్లేదు. శాంతిభద్రతల పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు జీవనం సాగిస్తుంటే ఇప్పుడు జరుగుతున్న రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఏ తీరుగా ఉండాలి? బాధ్యత కలిగిన గౌరవ ప్రజాప్రతినిధులు వ్యవహరించాల్సి న తీరు ఇదేనా? వీళ్లు మనకేమీ చేయగలరు? అన్న సంశయం, ఆందోళన కూడా కలుగక తప్పడం లేదు. మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ. రాష్ట్రానికి సంబంధించినంతవరకు శాసనసభ అత్యున్నత వేదిక. ప్రజలకు సంబంధించిన ఏ సమస్య అయినా అక్కడ సమగ్రంగా చర్చించి అన్నికోణాల్లో పరిశీలించి, అధ్యయనం చేసి, నిర్ణయం తీసుకోవాలి. అధికారంలో ఉన్నవారు చేసేప్రభుత్వ కార్యక్రమాలు అన్నింటిని సమీక్షించాల్సి ంది అక్కడే. అధికారులు, పాలకులు తప్పులను ఎత్తిచూపి ప్రజల దృష్టికి తీసుకువచ్చేది కూడా అక్కడే. అందుకే రాజ్యాంగ నిర్మాతలు శాసనసభ్యులకు సకల సౌకర్యాలు కల్పించారు. తమ అభిప్రాయాలను నిర్భయంగా, నిర్మొహమాటంగా వ్యక్తం చేసే అవకాశాలు కూడా ఏర్పరిచారు. న్యాయస్థానాల నుంచి కూడా రక్షణ కల్పించారు. ఇక్కడ చేసే వ్యాఖ్యలపై కానీ, విమర్శలపై కానీ మరెవరు జోక్యం చేసుకునే అవకాశం లేదు. అంతటి స్వేచ్ఛను వారికి కల్పించారు. గతంలో ఈ శాసనసభ కార్యక్రమాలు ఎంత హుందాగా జరిగేవో అందరికి తెలిసిందే. సమస్యలపై సబ్జెక్టులపరంగా చర్చలతోపాటు ఎన్నో ఛలోక్తులుండేవి. అన్నిటికంటే ముఖ్యంగా సమా వేశాల్లో మాట్లాడే అవకాశం పొందినవారు ఎంతో ముందుగా సబ్జెక్టులకు సంబంధించి పుర్వాపరాలు సేకరించి, అధ్యయ నం చేసి, పటిష్టమైన వాదనలతో సభలో ప్రసంగించేవారు. పాలక పక్షమైనా, ప్రతిపక్షమైనా ఎవరికివారు తీసిపోరన్నట్లుగా వాదనలుండేవి. వినేవారికి కూడా ఎంతో ఆసక్తికరంగా, మరెన్నో కొత్త విషయాలు తెలుసుకునే విధంగా ఉండేవి. ఏది తమకు ఆమోదయోగ్యమో, ఆచరణయోగ్యమో ప్రజలను కూడా ఆలోచింపచేసే విధంగా ఉండేవి. కానీ రాను రాను పరిస్థితులు మారిపోయాయి. ఆ విలువలు అంతరించిపోతున్నాయి. వ్యక్తిగత దూషణలు, తిట్లు, బూతులు,

## ఒక్క మాట

శాపనార్థాలకు శాసనసభ నెలవుగా మారుతున్నది. ప్రతి రోజూ ఏదో ఒక వివాదం లేవనెత్తడం, అసలు సమస్యనే పక్కదారి పట్టించడంలో కొందరు నేతలు ఆరితేరిపోయారు. వెటకారం తోపాటు అన్నిటికంటే మించి రన్నింగ్ కామెంట్రీలు, ఒకరిని నొకరు కించపరిచే వ్యాఖ్యలతో సభాగౌరవాన్ని దిగజారు స్తున్నారు. మొన్న సోమవారం నినాదాలు రాసిన నల్ల టీ షర్టులు ధరించి వచ్చిన శాసనసభ్యులను అడ్డుకోవడంలో ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు పలు విమర్శలకు తావిస్తున్నది. అలాగే కొందరు శాసన సభ్యులు ఆ నల్ల టీషర్టులను విప్పి పోలీసులపై విసిరివేయడం అందులో మహిళా ఉద్యోగులు ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. అసలు బిఆర్ఎస్ సభ్యులు నినాదాలతో కూడిన నల్లరంగు టీ షర్టులు ధరించి నేరుగా అసెంబ్లీ మూడో నెంబరు గేటు వద్దకు వచ్చారంటే భద్రతా విభాగం ముఖ్యంగా నిఘా విభాగం ఎంత విఫలమైందో అర్థమవుతుంది. ఇక ఆ విషయాన్ని అలా వదిలిపెడితే సమస్యలపై నిర్మాణాత్మక విమర్శల కంటే ఒకరిపై ఒకరు ఎత్తులు, పైఎత్తులు, విమర్శలు, ప్రతివిమర్శలు, వ్యూహాలు, ప్రతివ్యూహాలతో పుణ్యకాలాన్ని గడిపేస్తున్నారు. సమస్యల పరిష్కారం కంటే ఆ సమస్యల ను ఎత్తిచూపుతూ, పాలకపక్షాన్ని ఇరుకున పెట్టి ప్రజల ముందు పాలకులను అసమర్థులుగా, అవినీతి పరులుగా నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా పాలకపక్షంపై ఎలా సంధించాలనేదే తప్ప ఎలా పరిష్కరిద్దామన్న ఆలోచన ఉన్నట్లు కన్పించడం లేదు. పాలకపక్షం కూడా ఇందుకు భిన్నంగా వ్యవహరించ డం లేదు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఈ స్థాయిలో లేవని చెప్పొచ్చు. అంతమాత్రాన అప్పుడు రాజకీయ వ్యూహాలు, ఎత్తులు, పైఎత్తులు లేవని కాదు. అప్పుడు కూడా ఉండేవి. కానీ అవి బయటపడేవి కావు. ఓర్పు, నేర్పు నైపుణ్యాలతో సర్వప్రియులమనే భావం కలిగించే విధంగా ప్రవర్తించేవారు.కానీ ఇప్పుడు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. పాలకపక్షం కూడా తమ తప్పులను అంగీకరించి సరిదిద్దుకోవడం ద్వారా విశాలహృదయం ప్రదర్శించలేకపోతున్నది. దీంతో వాదోపవాదాలు పెరిగి అసలు సమస్య పక్కదారి పడుతున్నది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను పరిశీలిస్తే అందుకు అద్దం పడుతున్నది. బాధ్యత కలిగిన కొందరు మంత్రులు, అలాగే ఉన్నత చదువులు చదివిన ప్రతిపక్షంలోని సీనియర్ నేతలు కూడా ఆవేశపూరిత ప్రసంగాలు ఇస్తూ మాటలు జారుతున్నారు. ఇక రాష్ట్రానికి సంబంధించినంత వరకు అత్యున్నతమైన ఈ చట్టసభకు సర్వాధికారి స్పీకరే. ఆ స్థానానికి అత్యంత గౌరవం ఇవ్వాలి. అయితే స్పీకర్ కూడా ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అటు పాలక పక్షాన్ని ఇబ్బందులో పెట్టకుండా, ఇటు ప్రతిపక్షం అసంతృప్తికి గురికాకుండా నిష్పక్షపాతంగా చాకచక్యంగా వ్యవహరించాలి. ఇది కత్తిమీద సాము లాంటిది. సొంత పార్టీ ఆగ్రహానికి గురికాకుండా తమను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలు కాపాడుకుంటూ, స్పీకర్ పదవికి పక్షపాత దృష్టి చూపకుండా అత్యంత క్లిష్టమైన బాధ్యత అది. చెప్పినంత సులభం కూడా కాదు. ఎంతో ఓర్పు, నేర్పు, విషయం పట్ల అవగాహన అన్నింటిని మించి సమయస్ఫూర్తి అవసరం. ప్రస్తుత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎంతో ఓర్పుతో నిర్వహిస్తున్నా, అదుపు తప్పుతున్నవారిని నియంత్రించలేకపోతున్నారేమోననిపిస్తు న్నది. మొన్న ఒక గౌరవ సభ్యుడు అసెంబ్లీ ప్రాంగణం బయట వాడిన పదాలతో ఆయన స్పీకర్ సీట్లో కూర్చొనే కన్నీళ్లు పెట్టుకున్నారు. బహుశా రాష్ట్ర శాసనసభ చరిత్రలో అత్యంత ఉన్నతమైన అధ్యక్షస్థానంలో కూర్చుని స్పీకర్ కన్నీరు పెట్టుకొన్న సందర్భం లేదనే చెప్పొచ్చు. సోమ, మంగళవారాల్లో కొందరు గౌరవసభ్యులు వాడిన భాష, వ్యవహరించిన తీరు పరాకాష్ఠగా చెప్పొచ్చు. క్షమాపణల పర్వం మొదలైంది. తర్వాత బిఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడంతో సస్పెన్షన్‌పర్వం మొదలైంది. ఏదిఏమైనా ఎంతో విలువైన సభా కాలాన్ని వృధా చేసి వ్యక్తిగత దూషణలు చేసి అవి అందరు వినడమే కాదు టీవీల ద్వారా వీక్షించిన తర్వాత ఇప్పుడు క్షమాపణలు చెప్పుకుంటే రికార్డుల నుంచి తొలగిస్తే ప్రజలు మరిచిపోతారా అన్నది ఒక్కసారి ఆలోచించాలి. ఆవేశానికి లోనై అనాలోచితంగా మాట్లాడితే ఆ తర్వాత క్షమాపణలు చెబితే వారి గౌరవం వారే కించపరుచుకుంటున్నట్లు అవుతుంది. ఇప్పుడు కేసుల పర్వం మొదలైంది. మొత్తం మీద ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా, రాజ్యాంగానికి పుట్టినిల్లుగా భావిస్తున్న చట్టసభల్లో కార్యక్రమాలు జరుగుతున్న తీరు అందరిని కలచివేస్తున్నది. ఇప్పటికైనా మనసుపెట్టి పార్టీలకు అతీతంగా అందరూ ఆలోచించాల్సి న తరుణమిది. ●

# ఒకరికి కొత్త జీవితం, కొందరికి ఇంకా నిరీక్షణ!

శ్రీశైలం దూడం

ఒకే ఉద్యమం.. ఒకే అడవిబాట.. ఒకే లక్ష్యం. ఒకప్పుడు కలిసి నడిచిన వారిలో కొందరు లొంగిపోయారు. మరి కొందరు అరెస్టయ్యారు. కాలం మారింది. లొంగిపోయిన వారు ప్రభుత్వ పునరావాస పథకాలతో జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు. అరెస్టయిన వారు మాత్రం కేసుల మధ్య, జైలు గోడల మధ్య సంవత్సరాలు గడుపుతున్నారు. ఒకే ఉద్యమంలో ఉన్న వారిలో ఒకరికి కొత్త జీవితం.. మరొకరికి అంతులేని నిరీక్షణ. ఈవ్యత్యాసంపైనే ఇప్పుడు కేంద్ర హోంశాఖమానవతా దృక్పథంతో ఆలోచించాల్సి నఅవసరంఉంది. మావోయిస్టు ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్రం, రాష్ట్రాలు లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాయి. కేంద్ర విధానం లో ఉన్నత స్థాయి క్యాడర్లకు రూ.5లక్షల వరకు,ఇతరులకు రూ.2.5లక్షలవరకు సహాయం, 36నెలల పాటు నెలకు రూ. 10వేల జీవనభృతి వంటి నిబంధనలు ఉన్నాయి.2025లో దేశవ్యాప్తంగా 2,337మంది మావోయిస్టులు లొంగిపోయారని,2024 నుంచి2026 మార్చి వరకు 3,927 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారని కేంద్రం వెల్లడించింది. తెలంగాణలో ఇదే కాలంలో 721 మంది లొంగిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వంతెలిపింది. లొంగినవారికి చేయూత ఇవ్వడం శాంతి ప్రక్రియలో భాగమే. అయితే అదే సమయంలో గతంలో అరెస్టయికేసుల్లో చిక్కుకున్న వారి పరిస్థితిపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. లొంగిపోయినవారికి పునరావాసంఉంటే జైల్లో ఉన్నవారికి న్యాయ సమీక్ష ఎందుకు ఉండకూడదు? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాలి. అయితే ఇదిఅందరినీ ఒకేసారి విడుదల చేయాలనే డిమాండ్ కాదు.హత్యలు, పేలుళ్ల, భద్రతాబలగాలపై దాడులు వంటి తీవ్రమైన నేరాల ఆరోపణలు ఉన్న కేసుల్లో విచారణ తప్పనిసరి.బాధితులకు న్యాయంజరగాలి.కానీ సుప్రీంకోర్టు గతంలో అండర్ ట్రయల్స్ విషయంలో ఇచ్చిన మార్గదర్శకాల స్ఫూర్తితో, ఏళ్లతరబడి విచారణ సాగని కేసులు, ఆధారాలు బలహీనంగా ఉన్న కేసులు,చిన్నస్థాయి ఆరోపణలతో దీర్ఘకాలంగా జైల్లో ఉన్న వారి పరిస్థితిని మాత్రం ప్రత్యేకంగా పరిశీలించాలి. ఇందు కోసం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలవారీగా మావోయిస్టు నేపథ్యం ఉండిజైల్లో ఉన్నవారి పూర్తి వివరాలు సేకరించాలి. అరెస్టయిన తేదీ, కేసుల సంఖ్య, ఛార్జిషీట్ దాఖలు పరిస్థితి, విచారణ దశ, నిర్బంధ కాలం,వయస్సు, ఆరోగ్యం, ఇతర రాష్ట్రాల్లోని కేసులు వంటి అంశాలను ఒకే వ్యవస్థలో నమోదు చేయాలి. ఐదేళ్లకు మించి విచారణలో ఉన్న కేసులకు ప్రాధాన్యమివ్వాలి. పదేళ్ల దాటిన కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలి. దేశంలో మావోయిస్టు కేసుల్లో జైల్లో ఉన్నవారి ఖచ్చితమైన జాతీయసంఖ్య ప్రజలకు అందు బాటులో లేకపోవడం కూడా ఒక లోటే. ఈ నేపథ్యంలో కేంద్రం ఒక సమగ్ర జాతీయ డేటాబేస్ రూపొందిస్తే ఎవరు ఎందుకు జైల్లో ఉన్నారు, ఎంతకాలంగా ఉన్నారు, కేసు ఏదశలో ఉందన్నది స్పష్టమవుతుంది. తుపాకీని వదిలినవారికి సమాజం తలుపులు తెరిచినప్పుడు, న్యాయం కోసం ఎదురుచూస్తున్న జైలు జీవితాలపైనా అదే సమాజం ఒకసారి వెనక్కి తిరిగి చూడాలి.కేసు ఉంటే విచారణ.. నేరం రుజువైతే శిక్ష.. ఆధారం లేకుంటే విముక్తి.మారిన జీవితానికి పునరావాసం. ఇదే చట్టబద్ధమైన మార్గం. ఇదే మానవీయ మార్గం. ఇదే శాంతికి శాశ్వతమైన బాట. ●

# వినాయక చవితి పర్యావరణ హితంగా సాగాలి

డా. ఎ. భాగ్యరాజ్

వినాయక చవితి మన భారతీయ సమాజంలో భక్తి, ఐక్యత, ఉత్సాహానికి ప్రతీకగా నిలిచిన పండుగ. విఘ్నాలను తొలగించే వినాయకుడిని పూజించడం మన సంప్రదాయంగా వస్తూవుంది. అయితే కాలానుగుణంగా పండుగల నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చాయి. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయం కంటే ఆర్భాటం, పోటీ, ప్రదర్శన ఎక్కువవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 25 నుండి 30 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని కొన్ని నివేదికలలో తెలుస్తోంది. ఈనేపథ్యంలోవినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపుకోలేమా?' అనే ప్రశ్న ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సి న అవసరం ఉంది. వినాయక చవితి స్వాతంత్ర్యం కోసం పోరాడెవారందరిని ఒకే జెండా కింద తీసుకువచ్చి ప్రజలలో దేశభక్తిని పెంపొందించేస్థలం అయింది. మతాన్ని ఆధారంగా తీసుకుని ప్రజల్లో జాతీయ చైతన్యం కలిగించడం జరిగింది. వినాయక చవితి 1893 ముందు ఎక్కువగా ఇళ్లలో జరుపుకునే ఆచార పద్ధతిగా ఉండేది. బాలగంగాధర తిలక్ దానిని సామాజిక ఉత్సవంగా మార్చి, సమాజంలోని అన్ని వర్గాల హిందువులను ఒక్కటిగా చేర్చే ప్రయత్నం చేశారు. జాతీయోద్యమంలో వినాయక చవితిని సామూహిక పండుగగా మార్చిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్ గారిదే. బ్రిటీష్ పాలనలో ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావడం కష్టమైన సమయంలో ఆయన వినాయక చవితిని ఒక జాతీయ పండుగగా మార్చారు. ప్రజలు గుమికూడి పూజలు చేయడం,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, స్వాతంత్ర్య పోరాటం, జాతీయ గీతాలు, జాతీయ చైతన్యం విస్తరించడంవల్ల వినాయక చవితి ఒక సాంస్కృతిక, రాజకీయ పునరుజ్జీవన వేదికగా నిలిచింది. కానీ నేడు ఒకే వీధిలో, ఒకే గ్రామంలో రెండు మూడు వినాయక మండపాలు కులాలవారీగా,వర్గాల వారీగా, రాజకీయ పార్టీలవారీగా విడిపోయి జరుపుకుంటున్నాము. కానీ ప్రస్తుతం అనేక పెద్ద గణేష్ మండపాలకు రాజకీయ పార్టీలు లేదా కార్పొరేట్ సంస్థల సహకారం లభిస్తోంది. ఇది ఒక విధంగా ఓటు బ్యాంక్ రాజకీయాలకు దారితీస్తోంది. వినాయక చవితి ఒక మతపరమైన పండుగ మాత్రమే కాకుండా, చరిత్రలో స్వాతంత్ర్య పోరాటానికి ఆయుధం, నేడు రాజకీయ ప్రభావానికి వేదిక. ఇది భారతీయ సమాజంలో మతం, సంస్కృతి, రాజకీయాల సమ్మేళనంగా ప్రత్యేక స్థానం సంపాదించింది. కానీ ప్రస్తుతం వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులు వాడటం వల్ల చెరువులు, నదులు, ఇతర జలవనరులు తీవ్రంగా కలుషితమవుతున్నాయి. నిమజ్జనం తర్వాత నీటిలో కలిసే రసాయనాలు జలచరాలకు హాని కలిగించడమే కాకుండా నీటి నాణ్యతనుదెబ్బతీస్తాయి. పూజా సామగ్రి, ప్లాస్టిక్ కవర్లు, అలంకరణ వ్యర్థాలు కూడా నీటి వనరులను చెత్తకుప్పలుగా మార్చుతున్నాయి. దేవుడిని పూజించే పేరుతో ప్రకృతిని నాశనం చేయడం ఎంతవరకు సమంజసం? అయితే సమస్య కేవలం ప్రజలదే కాదు,



వ్యవస్థలోని పర్యవేక్షణాలోపం కూడా దీనికి ప్రధాన కారణం. పర్యావరణ నిబంధనలు,శబ్ద కాలుష్య పరిమితులు, విగ్రహాల తయారీకి సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటి అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో అధికార యంత్రాంగం తరచూ విఫలమవుతోంది. నిబంధనలు కాగితాలపై కఠినంగా ఉన్నా, వాటిని ఉల్లంఘించి నప్పుడు చర్యలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తుంది. ముందస్తు అవగాహన కల్పించడం,ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేయడం, వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించడం వంటి చర్యలు మరింత సమర్థంగా ఉండాలి. ఇక రాజకీయ నాయకుల పాత్ర కూడా ప్రశ్నించాల్సి ందే, ప్రజల మద్దతు కోసం పండుగల సమయంలో భారీ ఏర్పాట్లకు ప్రోత్సాహం ఇవ్వడం, పెద్ద విగ్రహాలు, భారీ శబ్దాలు, హంగామాను రాజకీయ ప్రతిష్ఠగా చూడడం సరికాదు.పర్యావరణ పరిరక్షణ గురించి వేదికలపై మాట్లాడటం ఒక వైపు, పర్యావరణ నిబంధనలుఉల్లంఘించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం మరోవైపు ఉండకూడదు. ప్రజాప్రతినిధులు ముందుండి పర్యావరణహిత పండుగలకు ఆదర్శంగా నిలవాలి. అంతేకాదు, ప్రజల్లో, ముఖ్యంగా యువతలో 'మా వినాయకుడే గొప్ప' అనే భావనతో ఏర్పడుతున్న పోటీని కూడా ఆలోచించాలి. పెద్దవిగ్రహం, ఎక్కువ లైట్లు, భారీ సౌండ్ సిస్టమ్, ఎక్కువ రోజులు కార్యక్రమాలు, ఎక్కువ ఖర్చు ఇవేగొప్పతనానికి ప్రమాణాలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తమ కార్యక్రమం అంద రికంటే ప్రత్యేకంగా కనిపించాలనే తాపత్రయం కూడా ఈ పోటీని పెంచుతోంది. కానీ భక్తిని కొలవడానికి విగ్రహం ఎత్తు అవసరమా? భక్తిని నిరూపించడానికి డెసిబెల్స్ అవసరమా? దేవుడిపై ప్రేమను చూపించడానికి ప్రకృతిని నాశనం చేయడం అవసరమా?నిజానికి యువతలో ఈ పరిస్థితిని మార్చగల శక్తి వుంది. పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం,సహజ రంగులు ఉపయోగించడం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండటం, శబ్దకాలుష్యాన్ని తగ్గించడం, కృత్రిమ నిమజ్జన కుంటలను ఉపయోగించడం, నిమజ్జనం తర్వాత పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను యువత ముందుండి నిర్వహించవచ్చు. గొప్పలకు పోవడంలోకాదు, గొప్ప మార్పుకు నాయకత్వం వహించడంలోనే యువత అసలైన గొప్పతనంఉంది. పర్యావరణహిత వినాయక చవితి అంటే పండుగను ఆపేయడం కాదు, పండుగను బాధ్యతతో జరుపుకోవడం. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి, సహజ పదార్థాలతో అలంకరించి, ఇంట్లోనే లేదా నిర్దేశిత ప్రదేశాల్లో నిమజ్జనం చేయవచ్చు. పూజా సామాగ్రిని నీటిలో పడేయకుండా ప్రత్యేకంగా సేకరించి సరైన విధంగా నిర్వహించవచ్చు.గణేశ్ మండపాలు పోటీకి కాకుండా సేవా కార్యక్రమాలకు వేదికలుగా మారాలి. వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడు. మరి మన పండుగ వల్లే పర్యావరణానికి కొత్త విఘ్నాలు ఎందుకు సృష్టించాలి? ప్రకృతిని కాపాడటమే వినాయకుడికి మనం ఇవ్వగలిగే నిజమైన నైవేద్యం. పర్యావరణ పరిరక్షణబాధ్యత ఒక్క ప్రభుత్వానిదే కాదు, అధికారులదే కాదు, నిర్వాహకులదే కాదు. ప్రభుత్వం నిబంధనలను కఠినంగా అమలు చేయాలి, రాజకీయ నాయకులు బాధ్యతాయుతమైన ఆదర్శాన్ని చూపాలి, నిర్వాహకులు ఆర్భాటానికి దూరంగా ఉండాలి, ప్రజలు, యువత తమ గొప్పతనాన్ని పర్యావరణ హిత మార్గంలో జరిపి చూపించాలి. ప్రకృతి మరియు సమాజాన్ని గౌరవిస్తూనే, గణేశుడిని భక్తితో జరుపుకోవడం పండుగను నిజంగా అర్థవంతంగా చేస్తుంది. ●

# ప్రజావాక్కు

### ముఖ్యమంత్రి గారు మాట నిలబెట్టుకోండి

దొంగబాబాలు ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోలేని అధికారులు, మంత్రులు రాష్ట్రాన్ని ఏమి పాలిస్తారు?అరటికాయ వలచి చేతిలో పెట్టినట్లుగా దొంగ బాబాలు ఆక్రమించిన భూముల వివరాలు,సర్వేనంబర్లు, విస్తీర్ణం,వాళ్ళు ఎలా మోసంచేస్తుంది, మొత్తం రహస్యం ఎంతో కష్టపడి సేకరించి, ఇన్నికోట్ల రూపాయల ప్రభుత్వ భూములు దొంగలుఆక్రమించి, ఆశ్రమాలపేరుతో మోసం చేస్తున్నారని, సమాచారహక్కు చట్టంకింద, అధికారులకు వ్రాసి దొంగబాబాల గుట్టు మొత్తం బయటపెట్టి , స్వాధీనం చేసుకోండి అంటే స్వాధీనం చేసుకోవటం చేతగాని తహసీల్ దారులు,కలెక్టర్లు, రాజధాని అధికారులు ఇంకా రాష్ట్రానికి ఏమి న్యాయం చేస్తారు? లక్షలు లక్షజీతాలు దండగ. అదేవిధంగా తమ బాధ్యత మరచిన ప్రజాప్రతినిధులకు ఆయా పదవులలో ఉండే అర్హత కూడా లేదు. ముఖ్యమంత్రి గారు మీరుజోక్యం చేసుకోండి. మీరేమధ్య ఆక్రమిస్తే జైలేగతిఅన్నారు.మీరైనా మాట నిలబెట్టుకోండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అతివేగం ప్రమాదం

అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. అంతేకాదు, తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగిస్తున్నారు.రోడ్డుమీద వాహనం నడిపేటప్పుడు వేగంకంటే భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. తొందరగా వెళ్లాలనే ఆలోచనతో వాహనాన్ని వేగంగా నడపడం ఎప్పటికీ మంచిది కాదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం,హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ పెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. మన కోసం మాత్రమే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి కోసం జాగ్రత్తగా ఉండాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అందరిని సమానంగా చూడాలి

ఉమ్మడి కుటుంబంలో నివసిస్తున్న ఆ కుటుంబంలోని కొందరి సభ్యులపట్ల జరుగుతున్న వివక్షత, అన్యాయాన్ని ఎప్పటికప్పుడు అడుగుతూనే ఉండాలి. ఒకరిని ఎక్కువగా మరొకరికి తక్కువగాచూస్తూ సహాయ సహకారాలు, అందకపోతే ఆత్మగౌరవం దెబ్బ తినకపోతే ఏంజేస్తుంది. ఒక కుటుంబంలోని అందరూ సమానమే కదా ఎందుకు ఈ వ్యత్యాసం వివక్షత. ఆత్మగౌరవం బ్రతకాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### పునః తనిఖీలు నిర్వహించాలి

సత్య నికేతన్ విషాదం మనందరినీ కలచివేసింది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు దిగ్భ్రాంతి వ్యక్తంచేయడం, విచారణకు ఆదేశించడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం అవసరమే. అయితే అంతకంటే ముఖ్యమైనది ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం. ప్రతి ప్రమాదం మనకు ఒక పాఠాన్ని అందించాలి. ఆ పాఠం భవిష్యత్తులో ప్రాణాలను కాపాడే చర్యగా మారాలి. వేగంగా విస్తరిస్తున్న పట్టణాల్లో పాత భవనాలు,అధికవినియోగంలో ఉన్ననిర్మాణాలు, విద్యార్థుల వసతి గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి ప్రజా వినియోగ భవనాల భద్రతపై నిరంతర దృష్టి అవసరం. నిర్మాణం పూర్తయిన తర్వాత భవనం భద్రతా పరీక్షతో బాధ్యత ముగియకుండా, నిర్దిష్ట కాల వ్యవధిలో పునః తనిఖీలు నిర్వహించే విధానం ఉండాలి.ఈ దిశగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక భద్రతా పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టడం ప్రయోజనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నాణేల పంపిణీకి ఆర్.బి.ఐ చర్యలు తీసుకోవాలి

గతంలో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రజలకు నాణేలు పంపిణీ చేయబడేవి. ప్రస్తుతం, ఈ వ్యవస్థ లేదు. ఇప్పుడు గుర్తింపు పొందిన వాణిజ్య బ్యాంకుల ద్వారా నాణేలను పంపిణీ చేస్తామనిఆర్.బి.ఐ చెప్పింది. అయితే ప్రస్తుతం ఏ బ్యాంకుకు వెళ్లినా, ఆ నాణేలు లభించటం లేదు. రిజర్వ్ బ్యాంక్ వాటిని పంపిణీ చేయకపోతే, జాతీయ బ్యాంకులలో కూడా పంపిణీ జరగకపోతే, ప్రజలకు ఆ నాణేలు ఎక్కడి నుండిలభిస్తాయి?వినియోగదారులకుసులభంగా అందుబాటులో ఉండేలా, 5, 10 విలువ గల నాణేలను గుర్తింపు పొందిన వాణిజ్య బ్యాంకులకు తగినంత పరిమాణంలో పంపిణీ చేయడానికి ఆర్.బి.ఐ చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### బోర్‌వెల్స్ రీచార్జ్

ఎల్‌నీనోను అవకాశంగా ఎందుకు చూడకూడదు అనే ఆలోచన మొదలు అయింది. తెలంగాణాలో ఇప్పుడు నీటి వసతి పెరిగింది.కానీ ఒకప్పుడు బోర్లావాహనాలు ఇబ్బడి ముబ్బడిగా ఊరుఊర తిరిగిన నేపథ్యాలు మనకు తెలుసు. అయితే కాలువలు ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండలోనే ఉండేవి. అయితే ప్రత్యేక రాష్ట్రంసిద్ధించిన తరవాత పరిస్థితి కొంత మెరుగైంది. అయితే నీటి పారదల వ్యవస్థ కుప్ప కూలకుండా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సుస్థిరత, సహకారం 'బ్రిక్స్' లక్ష్యం




## అంతర్జాతీయ స్థాయికి సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ కార్యాచరణ

## భారత్ అధ్యక్షతన నేటి నుంచి రెండు రోజులు శిఖరాగ్ర సదస్సులు

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 11:**బ్రిక్స్ సదస్సుకు ప్రస్తుతం భారతదేశం అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో, సంక్షోభాలను తట్టుకునే సామర్థ్యం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత అనే స్పష్టమైన, లక్ష్యబద్ధమైన థీమ్‌తో భారత్ ముందుకు సాగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను అందించే కార్యాచరణ ప్రణాళికగా రూపొందింది. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో భారత బ్రిక్స్ అధ్యక్షత, ఉన్నత స్థాయి రాజకీయ సమన్వయానికే పరిమితం కాకుండా, సభ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొనేలా చేయడం, కొత్త సాంకేతికతలను వినియోగించుకోవడం, సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. సంక్షోభాలను తట్టుకునే సామర్థ్యానికి తొలి ప్రాధాన్యత.

బ్రిక్స్ అజెండాలో రెసిలియెన్స్ తొలి స్తంభంగా నిలిచింది. ఆహారం, ఇంధన భద్రత, విపత్తు ప్రమాదాల తగ్గింపు, ఆరోగ్య రంగంలో సహకారం, మరింత పటిష్టమైన విలువ గొలుసుల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సభ్య దేశాలు తమ అనుభవాలు, వనరులను పరస్పరం పంచుకోవడం ద్వారా ఏ ఒక్క దేశం కూడా సంక్షోభ సమయంలో ఒంటరిగా మిగలకుండా చూడాలన్నదే ఈ విధానంలోని ప్రధాన ఉద్దేశం. వ్యవసాయం, ఔషధ రంగంలో సహకారం, అత్యవసర పరిస్థితుల కోసం ముందస్తు ప్రణాళికలు వంటి అంశాలు ఏడాది పొడవునా జరిగిన మంత్రిత్వ స్థాయి సమావేశాల్లో ప్రాధాన్యత పొందాయి. అభివృద్ధిచెందుతున్న దేశాల్లో ఆవిష్కరణలకు భారత్ ప్రాధాన్యత పెంచింది. డిజిటల్ గుర్తింపు, తక్షణ చెల్లింపులు, డేటా ఆధారిత ప్రభుత్వ సేవలు వంటి డిజిటల్ వనరుల వ్యవస్థలు భారత్‌లో కోట్లాది మంది ప్రజలకు ఆర్థిక సేవలు, ప్రభుత్వ సేవలు, మార్కెట్లను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఈ నమూనాను ఇతర దేశాలపై బలవంతంగా అమలు చేయాల్సిన సిద్ధంగా ఉన్న వ్యవస్థగా కాకుండా, ఆయా దేశాల అవసరాలకు అనుగుణంగా మార్చుకోగల ఓపెన్ ఆర్కిటెక్చర్‌గా భారత్ బ్రిక్స్ వేదికపై ప్రదర్శిస్తోంది. బ్రిక్స్ ఏర్పాటయి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ అంతర్జాతీయ వేదిక కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సమూహంగా ప్రారంభమైన బ్రిక్స్ కాలక్రమేణా సభ్య దేశాల సంఖ్యను పెంచుకోవడంతో పాటు తన కార్యాచరణ పరిధిని కూడా విస్తరించింది. అయితే ఏ అంతర్జాతీయ వేదిక అయినా దీర్ఘకాలం కొనసాగాలంటే ప్రభుత్వాల అధికారిక ప్రకటనలు, తీర్మానాలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవితాలతో దాని కార్యక్రమాలు ముడిపడి ఉండాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన హ్యూమానిటీ ఫస్ట్ స్ఫూర్తికి సాంస్కృతిక మార్పిడి,విద్యా సహకారం, యువత భాగస్వామ్యం, సమగ్ర అభివృద్ధికి కేంద్ర స్థానం కల్పిస్తూ భారత అధ్యక్షత బ్రిక్స్‌ను ప్రజలకు మరింత చేరువ చేసే ప్రయత్నం చేసింది. సబ్కా సాథ్ సబ్కా వికాస్ అనే సూత్రం భారతదేశ పాలనావిధానంలో చాలాకాలంగా కీలకంగా ఉంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యత ఈ ఆలోచనను అంతర్జాతీయ స్థాయికి విస్తరించింది. భారతదేశంలోని వివిధ నగరాల్లో నిర్వహించిన 350కి పైగా సమావేశాల్లో రాజకీయ, ఆర్థిక అంశాలతో పాటు ప్రజాసంబంధాలను కూడా మరింత బలోపేతం చేసారు. 2026లో భారతదేశం చేపట్టిన బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు ప్రజా కేంద్రిత విధానానికి ప్రాధాన్యం ఇచ్చాయి. యువ శాస్త్రవేత్తల సదస్సులు, విశ్వవిద్యాలయాల నెట్వర్క్లు, సాంప్రదాయ వైద్య విధానాలపై పరస్పర మార్పిడి, కళాకారుల ప్రదర్శనలు, క్రీడలు, పర్యాటకం, మహిళా పారిశ్రామికవేత్తల వేదికలు వంటి అనేక కార్యక్రమాలు ఇందులో భాగమయ్యాయి.

మానవత్వమే కేంద్రంగా న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రారంభమవుతున్న నేపథ్యంలో భారత అధ్యక్షత ఒక కీలక సందేశాన్ని ముందుకు తెస్తోంది. అంతర్జాతీయ సంబంధాల అంతిమ లక్ష్యం మానవులే. వారి గౌరవం, ఆకాంక్షలు, పరస్పర సహకారం, అభివృద్ధి సామర్థ్యమే అన్న విషయాన్ని భారత్ స్పష్టం చేస్తోంది. బ్రిక్స్ సంస్థాగత వ్యవస్థలో ప్రజల మధ్య సంబంధాలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా రెండో దశాబ్దాన్ని కేవలం విస్తరించిన సంఖ్యతో, పెరిగిన ఆర్థిక ప్రాధాన్యంతో మాత్రమే కాకుండా బ్రిక్స్ దేశాల కోట్లాది ప్రజల మధ్య పరస్పర అవగాహన, విశ్వాసం, ఉమ్మడి లక్ష్యాల బంధాలతో గుర్తుండిపోయేలా చేయాలన్నదే భారత లక్ష్యం. ప్రజా కేంద్రీయత విధానానికి ఇదే ఆచరణాత్మక అర్థం. ఢిల్లీ శిఖరాగ్ర సదస్సు ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్న ప్రధాన లక్ష్యం కూడా ఇదే. భిన్నాభిప్రాయాలను వారధిగా సమిష్టి అభివృద్ధికి భారత్ స్థిరమైన నాయకత్వం వహిస్తోంది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించడం అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రత్యేక స్థానం కల్పించింది.

బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశంగా, గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లో ఈ కూటమికి నాయకత్వం వహించిన అనుభవం భారత్‌కు ఉంది. ప్రస్తుతం 11పూర్తి స్థాయి సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌లో ఏకాభిప్రా యాన్ని కొనసాగించడం, ఆచరణాత్మక ఫలితాలపై దృష్టి పెట్టడం, అభివృద్ధి ప్రధాన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడం కీలకంగా మారింది.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ఈ బాధ్యతను వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో చేపట్టింది. విస్తృత గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రయోజనం చేకూర్చే ఫలితాలపై భారత్ నిరంతరం దృష్టి సారిస్తోంది. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సహకారానికి భారత్ నిరంతరం ప్రాధాన్యం ఇచ్చింది. సభ్య దేశాల మధ్య మరింత సమతుల్యమైన వాణిజ్యం, సేవల రంగంలో పరస్పర మార్పిడి, పటిష్టమైన సరఫరా గొలుసులు, చిన్న, మధ్య తరహా సంస్థలకు మెరుగైన ఆర్థిక వనరులు అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించింది. సరిహద్దు దాటి చెల్లింపులు, వాణిజ్య లావాదేవీల్లో జాతీయ కరెన్సీల వినియోగం వంటి అంశాలను భారత్ సిద్ధాంతపరమైన అంశాలుగా కాకుండా ఆర్థిక ప్రమాదాలను తగ్గించే ఆచరణాత్మక మార్గాలుగా చూస్తోంది. అదే సమయంలో న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ మద్దతు ఇవ్వడంతో పాటు, మౌలిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధి ప్రాజెక్టులకు మరిన్ని నిధులు అందించే అవకాశాలపై కూడా భారత్ దృష్టి సారించింది.

**ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలకు పిలుపు**

అంతర్జాతీయ వేదికపై ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థల్లో మార్పులు అవసరమని భారత్ నిరంతరం స్పష్టం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్క రణలు, ప్రపంచ ఆర్థిక సంస్థల్లో అభివృద్ధి చెందు తున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం, ప్రపంచ వాణిజ్య సంస్థ కేంద్రంగా పనిచేసే బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలు భారత్ ప్రాధాన్యాల్లో ఉన్నాయి. భారత్ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరిగే శిఖరాగ్ర సమావేశం కీలక ముగిం పుగా నిలవనుంది. ఈ సదస్సులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని నేతలు సమీక్షించడంతో పాటు, ఏకాభిప్రాయంతో ఉమ్మడి ప్రకటనను ఆమో దించే అవకాశం ఉంది.

# ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు నుంచి వైదొలగండి




## నాటో దేశాలకు అమెరికా పిలుపు

**వాషింగ్టన్, సెప్టెంబరు 11:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) నుంచి వైదొలగాలని నాటో సభ్య దేశాలను అమెరికా కోరింది. దాని వల్ల ఆయా దేశాలకు ఎదురయ్యే ముప్పును పరిశీలించాలని, మద్దతును నిలిపివేయాలని సూచించింది. ఇకనైనా ఐసిసి నాటకాన్ని ముగిద్దామంటూ పిలుపు నిచ్చింది. దాని సామర్థ్యాలను ఓ క్రమపద్ధతిలో రద్దు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపింది. జూలైలో బ్రస్సెల్స్‌లో జరిగిన నాటోకు చెందిన 32 మంది రాయబారుల రహస్య సమావేశంలో అమెరికా ఈ డిమాండ్ లేవనెత్తినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఐసిసి నుంచి వైదొలగాలని అమెరికా రాయబారి మాథ్యూ జార్జ్ సభ్య దేశాలను కోరినట్లు సమాచారం. ఈ విషయంలో ఎవరు తమతో కలిసివస్తారనే విషయాన్ని అమెరికా నిశితంగా గమనిస్తోందని తెలిపారు. అయితే ఫ్రాన్స్, నెదర్లాండ్స్ ఐసిసిని సమర్థించాయి. అగ్రదేశ వైఖరికి తాము మద్దతివ్వబోమని స్పష్టం చేశాయి. మరో వైపు ఐసిసి అమెరికా సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం ఆరోపించారు. తమను సవాలు చేయడానికి ఐసిసి మద్దతుదారులు అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. తమ అధికారులు, స్వేచ్ఛను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తే అమెరికా తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. జాతి నిర్మూలన, యుద్ధ నేరాలతో సహా తీవ్రమైన అంతరాతీయ నేరాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపేందుకు 2002లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును స్థాపించారు. ఇందులో నాటోకు స్వయంగా సభ్యత్వంలేదు. అయితే, అమెరికా, తుర్కియే మినహా అన్ని నాటో దేశాలు ఈ కోర్టులో సభ్యులుగా ఉన్నాయి.

# పుతిన్ బసకు ఐటిసి మౌర్య, జిన్‌పింగ్‌కోసం తాజ్ ప్యాలెస్

## లామెరిడియన్, ది లలిత్ ఇలా స్టార్ హోటళ్లన్నీ విదేశీ అతిథులకే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** ఢిల్లీ మొత్తం కుట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. శని,ఆదివారాల్లో జరగబోయే బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో దేశ రాజధానిలోని లగ్జరీ హోటళ్లు అన్నీ హైసెక్యూరిటీ జోన్‌లోకి వెళ్లిపోయాయి. ప్రపంచ దేశాధినేతలు, దౌత్యవేత్తలు, వీవీఐపీలు వస్తుండటంతో సెక్యూరిటీ టైట్ చేశారు. ఇదిలా ఉంటే, ఢిల్లీలోని ప్రముఖ స్టార్ హోటళ్లలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలో 3000కు పైగా హోటల్ గదులు బుక్ చేసినట్లు సమాచారం. కొన్ని హోటళ్లలో ఒక్క నైట్ ఖర్చు రూ. 2 లక్షలు దాటింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడి షి జిన్‌పింగ్‌తో పాటు బ్రిక్స్ సభ్యదేశాలకు చెందిన దేశాధినేతలు ఢిల్లీకి చేరుకుంటున్నారు. బ్రిక్స్‌లో మొత్తం 11 సభ్యదేశాలు ఉంటే, ఆయా దేశాధినేతలు ఢిల్లీకి చేరుకుంటున్నారు. పుతిన్ ఢిల్లీలోని ఐటీసీ మౌర్యలో, జిన్ పింగ్ తాజ్ ప్యాలెస్‌లో బసచేస్తున్నట్లు తెలుస్తోంది. ఒబెరాయ్‌లో ఇరాన్ అధ్యక్షుడు, బ్రెజిల్, కజకిస్తాన్, ఇథియోపియా, ఇండోనేషియా ప్రతినిధి బృందాలు ఇక్కడ ఉన్నట్లు సమాచారం. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా ఈ హోటల్‌లోనే బస చేస్తున్నట్లు తెలుస్తోంది. భద్రతా కారణాలతో హోటల్ వద్ద పలు దశల్లో తనిఖీలు చేపడుతున్నారు. సాధారణ పర్యాటకులకు రూమ్‌లు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్‌కు ఉరుగ్వే, ఫిలిప్పీన్స్, క్యూబా, బెలారస్, వియత్నాం దేశాల ప్రతినిధి బృందాలు బస చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ , ప్రపంచ వాణిజ్య సంస్థ డైరెక్టర్ జనరల్స్‌కు ఈ హోటల్‌లో బస ఏర్పాట్లుచేసారు. ఈ హోటల్ కూడా ఇప్పటికే పూర్తిగా బుక్ అయినట్లు దాని అధికార వెబ్‌సైట్ చూపిస్తోంది. ఢిల్లీలోని లె మెరిడియన్‌లో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ బస చేస్తున్నారు. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ అధ్యక్షులు కూడా ఇదే హోటల్‌లో ఉన్నారు. ఉగాండా, నైజీరియా, మలేషియా ప్రతినిధి బృందాలు కూడా ఈ హోటల్‌లో బస చేస్తున్నాయి. దక్షిణాఫ్రికా, బురుండి దేశాల ప్రతినిధి బృందాలు కన్నాట్ ప్లేస్‌లోని ది లలిత్ న్యూఢిల్లీ హోటల్‌లో బస చేస్తున్నారు. ఆఫ్రికన్ దేశాలకు చెందిన ప్రతినిధులకు కూడా ఇదే హోటల్ కేటాయించినట్లు సమాచారం. షాంగ్రీలా ఈరోస్‌లో పశ్చిమాసియాకు చెందిన దేశాల ప్రతినిధులు ఉంటున్నారు.

ప్రస్తుతం బ్రిక్స్‌లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియో పియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యుఏఈ ఉన్నాయి.సదస్సుకు హాజరయ్యే ప్రముఖ నేతల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్‌సిసీ, ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో తదితరులు ఉన్నారు. యుఏఈ తరఫున అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, బ్రెజిల్ తరఫున విదేశాంగ మంత్రి మోరో వియెరా హాజరుకానున్నారు.

# యువతరం శక్తి సామర్థ్యాలపై అపోహాలొద్దు



## 2047నాటికి 'వికసిత్ భారత్‌' సాధ్యం

### గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్

**ముంబై, సెప్టెంబరు 11:** భారతదేశ జనాభా లాభంపై ఉన్న సందేహాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. దేశంలోని యువతరం తమ నిరాశావాదాన్ని పక్కనపెట్టి, ముందుకు సాగి భవిష్యత్ భారతావని నిర్మించారని ఆమె అన్నారు. భారత దేశంలోని యువ శక్తి సామర్థ్యంపై సందేహాలు అవసరం లేదని 2047 నాటికి 'వికసిత భారత్‌' ఖాయమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ 2026'లో నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తూ, భారతదేశ యువతరం ఇప్పటికే రేపటి భవిష్యత్తును రాస్తోందని, శాశ్వతమైన సంస్థలను నిర్మిస్తోందని, భారతదేశపు అతిపెద్ద జనాభా ప్రయోజనం ఒక చురుకైన, ఆపలేని వాస్తవమని నిరూపిస్తోందని అన్నారు. దేశంలోని యువ జనాభా ఇప్పటికే ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, ఆర్థిక వృద్ధిని నడిపిస్తోందని, దీనికి సాంప్రదాయ ఉత్పాదకత కొలమానాల నుండి ధ్రువీకరణ అవసరం లేదని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్న వారు ప్రదర్శించిన శక్తి, ఆశయం భారతదేశ జనాభా ప్రయోజనం బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నారు. "ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను నిర్మించడం, బిలియన్ల కొద్దీ లావాదేవీలను ప్రాసెస్ చేసే యుపిఐ నుండి, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలవడం, అంతరిక్ష పరిశోధనలో సరిహద్దులను ఛేదించడం వరకు ఇది అద్భుతమైన పురోగతిగా రూపాంతరం చెందడాన్ని మనం చూస్తున్నాము" అని ఆమె అన్నారు. భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతికి ఇక్కడ ఉన్న యువత, నవకల్పనలే సజీవ నిదర్శనమని మంత్రి కొనియాడారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన పదబంధాన్ని ప్రస్తావిస్తూ కొందరు 'నారాజ్ ఫూఫాజీల్లు' (అసంతృప్త వ్యక్తులు) ఎల్లప్పుడూ భారతదేశ వేగాన్ని, దేశ యువత అపార సామర్థ్యాలను శంకించేందుకు కారణాలు వెతుకుతూనే ఉంటారని ఎద్దేవా చేశారు. భారతదేశ డెమోగ్రాఫిక్ డివిడెండ్ చేజారిపోయిందా లేక దేశానికి 'భారం'గా మారిందా అంటూ కొందరు టివి స్టూడియోల్లో కూర్చుని అర్థంలేని చర్చలతో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆర్థిక మంత్రి విమర్శించారు. ఇలాంటి నిరాశావాదుల (నయేసేయర్స్) మాటలను పట్టించుకోకుండా దేశం సాధిస్తున్న ప్రగతిని మనమంతా వేడుకలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం సాధిస్తున్న డిజిటల్, సాంకేతిక పురోగతి 2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అభివృద్ధి చెందిన 'వికసిత భారత్‌'గా తీర్చిదిద్దే లక్ష్యానికి బలమైన వేగాన్ని నిర్దేశిస్తోందని నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు.

# యువత ఆశలపై వ్యవస్థ నీళ్లు చల్లుతోంది!



## ఎందుకు ఆశలు కోల్పోయారో చెప్పండి

### సోషల్ మీడియా వేదికగా విద్యార్థులకు రాహుల్ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** భారతదేశ విద్యా వ్యవస్థ, అది ఏ తరాన్ని ఉన్నత స్థాయికి తీసుకురావాలని అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని మండిపడ్డారు. దానిపై ఎందుకు ఆశలు కోల్పోయారో తనకు చెప్పాలని ఆయన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. విద్యా వ్యవస్థను సరిదిద్దడం అనేది, దాని వైఫల్యాలను ప్రతిరోజూ అనుభవిస్తున్న వారి మాటలు వినడంతోనే మొదలవుతుందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. "భారతదేశ విద్యా వ్యవస్థ, అది ఏ తరాన్ని ఉన్నత స్థాయికి తీసుకురావాలో అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోంది. పేపర్ లీకులు. అధిక ఫీజులు. శిథిలమవుతున్న మౌలిక సదుపాయాలు. లక్షలాది మంది యువ భారతీయులు నిజాయితీగా పనిచేస్తున్నా, ఈ వ్యవస్థ వారిని ఇంకా నిరాశపరుస్తోంది' అని రాహుల్ 'ఎక్స్' లో రాసుకొచ్చారు. విద్యావ్యవస్థలో లోపాలకు సంబంధించిన అనుభవాలను తనతో పంచుకోవాలని రాహుల్ గాంధీ ఒక ఆన్‌లైన్ లింక్‌ను షేర్ చేశారు. అందరం కలిసి మళ్లీ ఆశలను చిగురింపజేద్దామని ఆయన పిలుపునిచ్చారు. "దానిని సరిదిద్దడం అనేది, దాని వైఫల్యాలను ప్రతిరోజూ అనుభవిస్తున్న వారి మాటలు వినడంతోనే మొదలవుతుంది. విద్యార్థులారా, తల్లిదండ్రులారా, ఉపాధ్యాయులారా, నాకు చెప్పండి. మీరు విద్యా వ్యవస్థపై ఎందుకు ఆశలు కోల్పోయారు?" అని ఆయన అన్నారు. తాను పంచుకున్న ఆన్‌లైన్ లింక్‌లో తమ అనుభవాలు, ఆధారాలు, ఆలోచనలను పంచుకోవాలని రాహుల్ విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. 'కలిసికట్టుగా మనం ఆశను తిరిగి తీసుకువస్తాం,' అని రాహుల్ అన్నారు.

యువతతో కలిసి మాట్లాడేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని రాహుల్‌గాంధీ అన్నారు.

అయితే, కేవలం కొద్దిమందితో మాట్లాడితే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థి స్వరాన్ని, వారి బాధను, వారి విలువైన అభిప్రాయాలను వినడం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. 'నేడు అస్తవ్యవస్థమైన విద్యా వ్యవస్థ మీ ఆశల జ్వాలను ఆర్పేసి, మీ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిన తీరును దేశం మొత్తం గమనిస్తోంది' అని పేర్కొన్నారు. అందుకే యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకో వడానికి 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దేశంలోని వివిధ నగరాల్లోని యువతను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 19వ తేదీన మరోసారి యువత ముందుకు రానున్నట్లు తెలిపారు.

# రష్యా అధ్యక్షుడి ఆహారమే వేరు..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీసుకునే ఆహారం విషయంలో అత్యంత కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటారు. హోటల్‌లో వండిన ఆహారం కంటే సొంత బృందం సిద్ధం చేసిన భోజనానికే ప్రాధాన్యం ఇస్తారట. 18వ బ్రిక్స్ సదస్సు కోసం పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సదస్సు జరగనుంది. పుతిన్ ఐటీసీ మౌర్యలో బస చేయనున్నట్లు సమాచారం. విదేశీ పర్యటనల్లో పుతిన్ కోసం రష్యా నుంచి ప్రత్యేక వంట బృందం వెంట వస్తుందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఆయనకు వడ్డించే ఆహార పదార్థాలను ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఆయనకు అందిస్తారని సమాచారం. ఆతిథ్య దేశంలోని హోటళ్లు సిద్ధం చేసే ఆహారం సాధారణంగా పుతిన్ రోజువారీ భోజనంలో భాగం కాదని నివేదికలు చెబుతున్నాయి. ఆయన పర్యటనల కోసం ప్రత్యేక వంటగదులను ఏర్పాటు చేస్తారని సమాచారం. రష్యా నుంచి తీసుకొచ్చిన లేదా ముందుగా పూర్తిగా పరీక్షించిన పదార్థాలతోనే అక్కడ వంట చేస్తారట. ఆహారంలో ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చూడటమే ఈ కఠిన నిబంధనల ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. ప్రభుత్వ విందుల్లోనూ పుతిన్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఆహారాన్నే అందించే అవకాశముందని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు ఎక్కువగా ఉన్నా పుతిన్ సాధారణ ఆహారం మాత్రం చాలా సింపుల్‌గా ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి.

# పుతిన్‌తో వచ్చిన కట్టుదిట్టమైన భద్రతా కాన్వాయ్

## ప్రత్యేక ఆకర్షణగా పుతిన్ వాడే ఆరస్ సెనాట్ లిమోజిన్ కారు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీకి చేరుకున్నారు. ఆయన రాకతో పాటు, ఆయనతో పాటు వచ్చిన అత్యంత కట్టుదిట్టమైన భద్రతా కాన్వాయ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కాన్వాయ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది పుతిన్ అధికారిక వాహనం ఆరస్ సెనాట్ లిమోజిన్. దీన్ని నిపుణులు చక్రాలపై తిరిగే కోటగా అభివర్ణిస్తారు.

**స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ:** రష్యా ప్రభుత్వ అవసరాల కోసం స్వదేశీ పరిజ్ఞానంతో వాహనాలను తయారు చేయాలనే లక్ష్యంతో చేపట్టిన కోర్టెజ్ ప్రాజెక్టులో భాగంగా ఆరస్ మోటార్స్ ఈ కారును అభివృద్ధి చేసింది. సోవియట్ కాలం నాటి జడ్ఐఎస్ 110 లిమోజిన్ స్ఫూర్తితో 2018లో దీన్ని రూపొందించారు. విదేశీ పర్యటనల్లో పుతిన్ ఎక్కువగా ఈ బుల్లెట్‌ప్రూఫ్, పేలుడు నిరోధక వాహనంలోనే ప్రయాణిస్తారు. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకునేలా దీన్ని డిజైన్ చేశారు. ఈ కారులో





4.4లీటర్ ట్విన్‌టర్బోచార్జ్ 8 ఇంజిన్‌ను హైబ్రిడ్ సిస్టమ్‌తో అనుసంధానించారు.

ఇది సుమారు 598 హార్స్‌పవర్ శక్తిని, 880 వి టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 9స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్‌తో పనిచేసే ఈ కారు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అధ్య క్షుడి కోసం వాడే ఈ వేరియంట్‌లో అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలను పాటించారు. దీని ఇంటీరియర్ అత్యంత విలాసవంతంగా, ఆధునిక ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో ఉంటుంది. సాధారణ పౌరుల కోసం పరిమిత సంఖ్యలో ఉత్పత్తి చేసే సెనాట్ మోడల్ ధర సుమారు 18 మిలియన్ రూబుల్స్ (దాదాపు రూ. 2.5 కోట్లు) ఉంటుంది. గతంలో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇదే కారులో పుతిన్‌తో కలిసి ప్రయాణించడం అప్పట్లో విశేషంగా నిలిచింది. ఇప్పుడు మరోసారి ఈ వాహనం ఢిల్లీలో కనిపించడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రాచీన గ్రంథం తిరుక్కురళ్ బహూకరించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 11:**బ్రిక్స్ సదస్సు 2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సం దర్భంగా ప్రధాని మోడీ, పుతిన్‌కు ఒక విశిష్ట మైన సాంస్కృతిక కానుకను అందజేశారు. ప్రాచీ న తమిళ సాహిత్య గ్రంథమైన తిరుక్కురళ్ రష్యన్ అనువాద ప్రతిని ఆయనకు బహూకరిం చారు. సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు ఎంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పరస్ప రం కరచాలనం చేసుకుని,ఆలింగనం చేసుకున్నారు.



ఈ భేటీలో ప లు అంతర్జా తీయ, ద్వై పాక్షి క అంశా లపై వారు కూ లంక షం గా చర్చించ ట్లు సమాచా రం. ప్రధాని మోడీ బహూకరించిన తిరుక్కురళ్ తమిళ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్య, గౌర వం పొందిన గ్రంథాల్లో ఒకటి. దీనిని సుప్రసిద్ధ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించారు. ఇందులో నీతి,నైతికత, ప్రేమ, సంపద,పాలన, మానవప్రవర్తన వంటి అనేక అంశాలపై 1,330పద్యాలున్నాయి. ఈ గ్రంథం నైతిక జీవితాన్ని ఎలాగడపాలో తెలియజేసే మార్గదర్శిగా ప్రసిద్ధిచెంది ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది.ఇప్పటికే అనేక ప్రపంచభాషల్లోకి అనువదించబడిన ఈగ్రంథం రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు అందించడంద్వారా, విశ్వ మానవ విలువలనుచాటిచెప్పే భారతీయ సాహిత్యవారసత్వాన్ని మోడీ ఆయనకు పరిచయం చేసినట్టయింది.

# సంక్షిప్త వార్తలు

## బహ్రెయిన్‌పై ఇరాన్ దాడి..అమెరికా నేవీ కీలక స్థావరం ధ్వంసం



**టెహ్రాన్, సెప్టెంబరు 11:** ఇరాన్–అమెరికా మధ్య దాడులు మళ్లీ ప్రారంభమవడంతో పశ్చిమా సియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్య దాడులకు ప్రతిస్పందనగా గల్ఫ్ దేశాలలోని వివిధ అమెరికా స్థావరాలపై టెహ్రాన్ విరుచుకుపడుతోంది. తాజాగా బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో తమ కీలక స్థావరమైన నేవల్ సపోర్ట్ యాక్టివిటీ బహ్రెయిన్ (ఎన్ఎస్‌బి) తీవ్రంగా దెబ్బతిన్నట్లు యుఎస్ నేవీ తాత్కాలిక కార్యదర్శి హాంగ్‌కావో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో అమెరికా నౌకాదళ కార్యకలాపాలకు ఎన్ఎస్‌బి ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రంగా పనిచేస్తోంది.

## ఒక్కరోజే 20 లక్షలకుపైగా ఐఆర్సీటిసి బుకింగ్స్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్క రోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20 లక్షల మార్కును దాటడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఒకే రోజులో మొత్తం 20,06,353 టికెట్లు బుక్ అయ్యాయి.


## కర్ణాటక మంత్రి జర్కిహోళి ఇంట్లో 37 గంటలు ఇడి సోదాలు

**బెంగళూరు, సెప్టెంబరు 11:** కర్ణాటక ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహోళికి సంబంధించిన నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నిర్వహించిన సోదాలు ముగిశాయి. దాదాపు 37 గంటల పాటు ఈ తనిఖీలు కొనసాగాయి. సోదాల్లో లభించిన నగదు తనదేనని, దానికి సంబం ధించిన పత్రాలను సమర్పిస్తానని మంత్రి జార్కిహోళి స్పష్టం చేశారు. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్ మెంట్ యాక్ట్ (ఫెమా) ఉల్లంఘనలు, విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఇడి రంగంలోకి దిగింది.

## కళ్లల్లో కారం చల్లి బ్యాంకులో సొమ్ముచోరీ..

**ముంబయి, సెప్టెంబరు 11:** ముఖానికి ముసుగు ధరించిన ఒక వ్యక్తి బ్యాంక్‌లోకి వచ్చిన వెంటనే ఒక సంచిలో తెచ్చుకున్న కారం అతడు అక్కడున్న బ్యాంక్ సిబ్బంది ముఖాలు, కళ్లల్లో చల్లాడు. గందరగోళానికి గురైన సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ నేపథ్యంలో కౌంటర్‌లో ఉన్న రూ.4 లక్షల డబ్బుతో ఆ వ్యక్తి పారిపోయాడు. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది.

## ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా నిబంధనలు మరింత కఠినం




**కాన్‌బెర్రా, సెప్టెంబరు 11:** ఆస్ట్రేలియాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకుంటున్న విదేశీ విద్యార్థులకు, ముఖ్యంగా భారతీయులకు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ఆ దేశ ప్రభుత్వం విద్యార్థి వీసాలజారీలో కఠిన వైఖరి అవలంబిస్తుండటంతో వీసా తిరస్కరణల సంఖ్య గత పదేళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. ఏబీసీ న్యూస్ వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ఆస్ట్రేలియా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24.2 శాతంగా నమోదైంది. సరిగ్గా పదేళ్ల క్రితం జూన్‌లో ఈ రేటు కేవలం 7.9 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. ఈ కఠిన నిబంధనల ప్రభావం భారత్, నేపాల్ దేశాల విద్యార్థులపై తీవ్రంగా పడుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నేపాల్ నుంచి వచ్చిన దరఖాస్తుల్లో 51శాతానికి పైగా తిరస్కరణకు గురికాగా, భారతీయ విద్యార్థుల విషయంలో ఈ రేటు 40 శాతానికి పైగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థుల వీసా తిరస్కరణ రేటు కేవలం 5.8 శాతంగానే ఉండటం ఇక్కడి పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తోంది.

# రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తేలేదు

## ప్రతిరైతు రెండు మెగావాట్ల సోలార్ ప్లాంట్ పెట్టుకునేలా ప్రోత్సాహం

### శాసన మండలిలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మైక్రో గ్రిడ్ల నిర్మాణం రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే మైక్రో గ్రిడ్ ప్రాజెక్టులను ప్రయోగాత్మ కంగా(పైలట్) చేపట్టామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



#### గ్రీన్ ఎనర్జీని బలోపేతం చేయడమే లక్ష్యం

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణ హితమైన గ్రీన్ ఎనర్జీ బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు.

#### రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్

పీఎంకుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

# మీడియా పాయింట్

## నిషేధిత జాబితాలో 3.6 లక్షలుంటే కోటి ఎకరాలంటూ దుష్ప్రచారం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** 22-ఎ పైన నిర్లజ్జగా హరీశ్‌రావు, కేటీఆర్ కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో ప్రభుత్వం పెట్టిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 3.6 లక్షల ఎకరాల ప్రైవేటు, కోర్టు కేసులు, తగాదాలు, వివాదాలు ఉన్న భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నవి. అని మీకు తెలువదా? మీరు మెక్కిన భూములు ప్రభుత్వం వెనక్కి తీసుకునే ప్రయత్నం చేస్తున్నాం. రైతుల భూములు రైతులకు చెందాలనేది ప్రజాపాలన సంకల్పం. మీరు బెదరించి బదలాయించుకున్న భూముల లెక్కలు బయటపడతాయని చర్చకు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయనే దుష్ప్రచారం ప్రజలు నమ్మద్దు. ఫ్యూచర్ లేనిది కేటిఆర్‌కు, బిఆర్ఎస్ పార్టీకి. ఫ్యూచర్ సిటీలో ఎవరూ పెట్టుబడుకు పెట్టొద్దు అని చెప్పడం వెనుక రాష్ట్ర అభివృద్ధిని మీరు కోరుకోవడం లేదని అర్థం అవుతున్నది.

### ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు : మండలి విప్ బల్మూరి వెంకట్



దళిత వ్యతిరేక బి.ఆర్.ఎస్ పార్టీకి నూకలు చెల్లాయి. బట్టలు విప్పుకొని అసభ్యంగా ప్రవర్తించారు. స్పీకర్‌కి క్షమాపణ చెప్పకుండా ఫామ్ హౌస్‌లో ఇచ్చిన డైరెక్షన్స్‌తో అసెంబ్లీ నడవకుండా చేస్తున్నారు. ప్రజా అంశాలపై, 22ఏపై చర్చ పెడతామని చెప్పినా 22-ఎపై చర్చ జరిగితే హరీష్‌రావు జడ్చర్లలో, కేటీఆర్ జన్వడాలో, ఇంకా తెలంగాణలో వీళ్ళు దోచుకున్న వేల ఎకరాల భూముల లెక్కలు బయటపడతాయని భయపడుతున్నారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి పదవి బిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ. అసెంబ్లీ ముందు మీకు జరిగిన పరిస్థితికి కేటీఆర్, గంగుల కమలాకర్ కారణం. ఆ విడియోలు చూడండి.

### చర్చకు రమ్మంటే, రచ్చ ఎంచుకుంటున్నారు: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

చర్చకు రమ్మంటే, రచ్చ ఎంచుకుంటున్నారు బి.ఆర్.ఎస్ నేతలు. చర్చ జరిగితే వారి అవినీతి, అబద్ధాలు తెలుస్తాయని రచ్చ చేస్తున్నారు. అసెంబ్లీలోకి రాకుండా ఉండడానికే అనేక మార్గాలు అన్వేషిస్తున్నారు. మహిళా ఎం.ఎల్.ఏలను పోలీసులమీదికి నెట్టి రాద్ధాంతం చేశారు. మహిళా పోలీసుల ప్రైవేటు పార్ట్ తాకి కుసంస్కృతితో చిల్లర వేషాలు వేశారు బి.ఆర్.ఎస్ నేతలు. కేసీఆర్ చర్చకు రాని బడి దొంగ! చర్చకు రావడానికి చేత కావట్లేదా? చేవ లేదా కేటీఆర్? ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా బీజేపీ, బిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఎర్రవల్లిలో సభ పెట్టి నీ రాజకీయ జీవిత అంతానికి నాంది పలుకుతాం. రాజ్యాంగాన్ని మార్చాలి అన్నారు కదా కేసీఆర్.. మార్చడం మీ తరం కాదు.

### తప్పల నుండి పారిపోవడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు: ఎమ్మెల్యే వేముల వీరేశం

ఫ్లాష్ సర్వే చేయిస్తే, బి.ఆర్.ఎస్ పార్టీ తెలంగాణ భూమిపై ఉండడానికి వీలు లేదు అనే విధంగా ఉంది. దళితులు చట్టసభల్లో ఉండద్దు అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. వారు చేసిన తప్పుల నుండి పారిపోవడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సికి కంప్లైంట్ చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి బి.ఆర్.ఎస్ మహిళ ఎం.ఎల్.ఎలపై జరిగిన సంఘటనను సుమోటోగా తీసుకొని విచారణ జరపాలి. జడ్చర్ల, అమీన్‌పూర్, జన్వాడ భూముల లెక్కలు బయట పడతాయని బయటపడుతున్నారు.

## కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్?

**హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు కొండసురేఖ అనుచరగణంలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించారు. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# పాడి రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

## 26 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

### పాడి రైతులకు గిట్టుబాటు ధర

### పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొనే 26 లక్షల లీటర్ల పాల పరిమాణం మేరకు ఉత్పత్తిని పెంచేలా పాడి రంగాన్ని బలోపేతం చేస్తామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం గా రాష్ట్రం 13వ స్థానంలో ఉందని పశుసంవర్థక పాడిపరిశ్రమాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో పటోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగు తోందని మంత్రి తెలిపారు. 2026-27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు. పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని మంత్రి తెలిపారు. రైతులకు నాణ్యమైన పాల సేకర ణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసు కుంటు న్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశుసంవర్థక శాఖలో సిబ్బంది 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వ హించామని వెల్లడించారు. పాడి పరిశ్రమలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. కర్ణాటకలోని నందిని డెయిరీతో పోలిస్తే తెలంగాణలో విజయ డెయిరీ ద్వారా పాడి రైతులకు ఎ క్కువ ధరలు చెల్లిస్తున్నా మని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పాడి రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమనీ పాడి పరిశ్రమ బలోపేతమే గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాది' అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



# 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కష్టం: ప్యానల్ స్పీకర్ కడియం

## గొప్పచదువులు చదివిన మంత్రులున్నారు : ఎంఐఎంఎల్పీ నేత అక్బరుద్దీన్



**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఏకబిగిగా ప్రశ్నలు సంధిస్తూ పోతుంటే ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి మధ్యలో అడ్డుపడి మంత్రి సమాధానం ఇవ్వడానికి ఇబ్బంది పడాల్సి వస్తుందేమో అని అన్నారు. మీరు ఒక ప్రశ్న అడిగి తరువాత సమాధానం వచ్చాక మరో ప్రశ్న అడిగితే బాగుంటుందేమో అని సూచించారు. అక్బరుద్దీన్ వరుసగా 20కి పైగా ప్రశ్నలు అడగడంపై కడియం శ్రీహరి.. మీరు సీనియర్ శాసనసభ్యులు ఇంతగా ప్రశ్నలు వేస్తే ఎలా అని అనడంతో అక్బరుద్దీన్ మాట్లాడుతూ సర్ మీరు విద్యా శాఖ మంత్రిగా ఎంతో నేర్పుగా ఎంత జఠిలమైన అంశాలకు సమాధానం ఇచ్చా రు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మంత్రుల బాగా చదువుకున్న పండితులు సెటైర్లు వేశారు. అక్బరుద్దీన్ మాట్లాడుతూ మంత్రులకు కార్యదర్శులు ఐఎఎస్‌లు ఉంటారని వారు యుపిఎస్ వంటి కఠినమైన పరీక్షలు రాసి వస్తారని వాళ్లు ఇచ్చిన రికార్డునే మంత్రులు శాసనసభలో ప్రకటిస్తారని వారికి మేధావులు సహాయకులుగా ఉంటారని అన్నారు. అంతేకాదు మంత్రులు చాలా గొప్ప గొప్ప చదువులు చదివారు.. వాళ్లు అన్నింటికీ సమాధానం చెబుతారు అంటూ వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా నేను కేవలం 12వ తరగతి పాస్ అయ్యాను.. నేను అడిగే ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పలేరా? అంటూ చలోక్తులు వేశారు. అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో సభలో ఉల్లాసకరమైన వాతావరణం నెలకొంది.

# మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్ల కోఆప్షన్

## ఆమోదించిన శాసనసభ, శాసనమండలి

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తు లను కోఆప్ట్ చేసుకునేందుకు వీలు కల్పించే బిల్లు ను తెలంగాణ శాసనసభ ఆమోదించింది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తరపున శుక్రవారం ఈ బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర శాసన వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు. ఈ సవరణ బిల్లుపై పి మనోహర్‌రెడ్డి, పాల్వాయి హరీష్ రావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, వెడ్మ బుజ్జు, కె సంశివరావు, జుల్ఫీకర్ అలీ మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు ఇచ్చి ఈ బిల్లుకు తామ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ మున్సిపాలిటీల (నాల్గవ సవరణ) బిల్లు, 2026 మున్సిపల్ పరిపాలన మరియు నిర్ణయ ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ప్రాతినిధ్యం కల్పిస్తుందని అన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను కోఆప్ట్ చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్పొరేషన్‌లో ఒక ట్రాన్స్‌జెండర్ వ్యక్తిని కోఆప్టెడ్ సభ్యురాలిగా నామినేట్ చేస్తారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 గురు కోప్షన్ సభ్యులను నియమిస్తుండగా, ఇక నుండి ట్రాన్స్‌జెండర్‌తో కలిపి 6 గురిని నియమించాల్సి ఉంటుందన్నారు. సామాజిక వివక్షతకు గురయ్యే వీరికి గౌరవప్రదమైన జీవనం ఇవ్వాలని ప్రభుత్వం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని చెప్పారు. తద్వారా స్థానిక సంస్థల్లో పాలనాపరమైన విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్లకు భాగస్వామ్యం కల్పించినట్లవుతుందన్నారు. ఇప్పటికే పోలీస్ శాఖలో ట్రాఫిక్ బాధ్యతలను కూడా అప్పగించిన రాష్ట్రంగా దేశంలోనే గుర్తింపు పొందిందని తెలిపారు. దీన్ని సులభతరం చేయడానికి, తెలంగాణ పురపాలక సంఘాల చట్టం, 2019కి సవరణ ప్రతిపాదిస్తూ మంత్రి బిల్లును ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సామాజిక వివక్ష, అణచివేతకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే అంశంపై పరిశీలన చేస్తామని వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని ట్రాన్స్ జెండర్ల వివరాలను సేకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తదుపరి బీజేపీ, సీపీఐ మరియు ఇతర పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలపడంతో శాసనసభ ఏకగ్రీవంగా ఈ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. తర్వాత శాసనమండలిలో కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.



మంత్రి శ్రీధర్‌బాబు

# రాహుల్ ప్రధాని కావాలని పాదయాత్ర చేసిన వ్యక్తికి పిసిసి సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని పాదయాత్ర చేసిన వ్యక్తికి పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ శుక్రవారం గాంధీభవన్‌లోసన్మానం చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాటూరు వెంకటేశ్ కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు పాదయాత్ర రాహుల్‌గాంధీ బర్త్‌డే జూన్ 19న మొదలు పెట్టారు. ఈ పాద యాత్ర 1,530 కిలోమీటర్లు 85 రోజులపాటు సాగించారు. కాటూరి వెంకటేష్ ఎపి హైకోర్టులో న్యాయవాది వృత్తి కొనసాగిస్తున్నారు. రాగా ఫర్ రేస్ ఆఫ్ ఇండియా యాత్ర పేరుతో వెంకటేష్ పాదయాత్రను చేశారు. ఆయనను గాంధీభవన్‌లో ప్రభుత్వ సలహాదారు వి, హనుమంతరావు, పిసిసి ఫిషరీష్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ సన్మానించారు. అసెంబ్లీలో పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్‌ను వెంకటేశ్ కలిశారు. ఆయన 85 రోజుల్లో ప్రజలకు రాహుల్‌గాంధీ నాయకత్వ లక్షణాలను ఆయన దేశ ప్రధానమంత్రి కావాల్సిన ఆవశ్యకతను ఎలా ప్రచారంలోకి తీసుకెళ్లారో వివరించారు.

# త్వరలో బియ్యంతోపాటు నిత్యావసర సరకులు

## పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


**హైదరాబాద్,సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** పేద ప్రజలకు అందిస్తున్న సన్న బి య్యం తోపాటు నిత్యావసర సరకుల పంపిణీ ప్రభుత్వం ఆలోచనలో ఉందని, బడ్జెట్ కారణంగా కాస్తా ఆలస్యం జరుగుతుందని మంత్రి ఉత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. శాసన మండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, టి.భాను ప్రసాద్, బి.మహేష్ గౌడ్, దాసోజు శ్రవణ్ అడిగిన ఉప ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1 కోటి 6 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, తద్వారా 3 కోట్ల 42 లక్షల మంది పౌరులకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. నిత్యావసర సరకుల పంపిణీపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మంత్రి సమాధానంపై కోదండరాం స్పందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం వలన ఆహార భద్రత ఏర్పడింది కానీ, ప్రజలకు పౌష్టికాహారం అందడం లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.



### డిసెంబర్ 2027 నాటికి నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పూర్తి

నెల్లికల్లు ఎత్తిపోతల పథకం డిసెంబరు 2027 నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలి ప్రశ్నో త్తరాల సమయంలో సభ్యులు మంకెన కోటిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం ఫేజ్1 పనులు 2027 జూన్ నాటికి, ఫేజ్2 పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి సుమారు 24 వేల ఎకరాలకు నీరు అందిస్తామని మంత్రి తెలి పారు.

### ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు విడతల వారీగా కేటాయింపు: మంత్రి పొంగులేటి



ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాసన మం డలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయం లో సభ్యులు బొమ్మ మహేశ్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయిచిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహాకరం అందించిన, అందించకపోయినా విడతల వారీగా ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సమాధానంపై మహేశ్‌గౌడ్ స్పందిస్తూ గతంలో ప్రభుత్వం అందించే ఇళ్లను నగర శివారుల్లో నిర్మించే వారని, కానీ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నగరం నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తుండటం శుభ పరిణామమన్నారు.

నిజామాబాద్‌లో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మా ణానికి అంగీకరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విఆర్ఏ క్రమబద్ధీకరించడంలో పలు సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని తొల గించి విఆర్ అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభులు దేశపతి శ్రీనివాస్, నెల్లికంటి సత్యం, తీన్మార్ మల్లన్న, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రజాప్రభుత్వం 3,797 విఆర్ కారుణ్య నియామకాలపై విధివిధానాలు రూపొందించి వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### రైతులకు నాణ్యమైన యంత్రాలు అందించాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్రపరికరాలు అందించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో వ్యవసాయ యాంత్రపరికరాల నాణ్య తపై ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారిన నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తున్నదని, కానీ, నాణ్యమైన పరికరాలకు బదులుగా నాసిరకం పరికరాలను పంపిణీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ లభించే యంత్ర పరికరాల ధరకు, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పరికరాల ధరకు భారీ వ్యత్యాసం ఉంటోందని, అధిక ధరలకు నాసిరకం యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు.

ఉదాహరణకు మార్కెట్ ఒక రోటివేటర్ రూ.1.10 లక్షలకు లభిస్తుంటే, ప్రభుత్వం దానిని రూ.1.50 లక్షలు చెల్లించి ఎజెన్సీల నుంచి కొనుగోలు చేస్తుందని, ఈ మొత్తంలో రైతు రూ.85 వేలు చెల్లిస్తుంటే, మిగతాది ప్రభుత్వం చెల్లిస్తున్నదని వివరించారు. నల్లగొండ జిల్లాలో పత్తి రైతుల అవసరా లను దృష్టిలో పెట్టుకుని కాటన్ షెల్టర్ యంత్రాలను అందించాలని ప్రభుత్వానికి నెల్లికంటి సత్యం విజ్ఞప్తి చేశారు.

### రైతుకు నచ్చిన కంపెనీ నుంచే వ్యవసాయ పరికరాలు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునేలా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. శాసన మండలిలో శుక్ర వారం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం లో చిన్న, సన్నకారు, ఎస్ఎస్ మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని, దళారులకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణకు రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

రైతుల డిమాండ్ అనుగుణంగా డ్రోన్ సహా ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తుమ్మల చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.50 లక్షల ఎకరాల్లో ఆయిల్ సాగు జరుగుతుండగా, వచ్చే మూడేళ్లలో మరో 6 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆయిల్ సాగుకు అవసరమైన ఆధునిక యంత్రాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

# మల్లికార్జునఖర్గేతో మధుయాష్కిగౌడ్ భేటీ

## ఎఐపిసి చైర్‌పర్సన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** దేశప్రజల మధ్య సౌభ్రాతత్వం పెంపొందించేందుకు కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకొందుకు బుద్ధిజీవులను ఒక వేదికపై సంఘటిపరిచేందుకు కృషిచేయాలని మధుయాష్కిని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఆదేశించారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ శుక్రవారం ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ని బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గే కి మధు యాష్కీ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. తనపై ఎంతో నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేస్తూ వారందరినీ జాతీయ స్థాయిలో ఒక వేదికపై తీసుకువచ్చే గురుతర బాధ్యతను సమర్థ వంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఖర్గే మధుయాష్కికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి మానవీయ విలువలు పెంచేలా రాజకీయ వాతవర్ణం ఏర్పాటు చేసుకోవాలని ఆయనసూచించారు. సామాజిక ఆర్థిక గతితార్కిక వాదంపై రాజకీయా పునాది ఉండాలని ప్రజలను అలౌకిక ఆనందాలతో మభ్యపెట్టే ధోరణితో అధికారం చేజిక్కించుకొని కొంత మంది కంపెనీల పెట్టుబడిదారులకు మాత్రమే అభివృద్ధి ఫలాలు అందేలా వ్యవహరించే ధోరణిలో పాలన సాగిస్తున్న పాలకులపై ప్రజలను ముఖ్యంగా అన్ని వృత్తులలోకొనసాగే బుద్ధిజీవులను చైతన్యం చేసి వారి ద్వారా సామాన్య ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.



# కివీస్ టెస్ట్ సిరీస్..
# దులీప్ ట్రోఫీ ప్లేయర్లకు లక్కీ ఛాన్స్







**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీ 2026లో రాణించిన ముగ్గురు ఆటగాళ్లు న్యూజిలాండ్ టెస్టు పర్యటనకు భారత జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలను సృష్టించుకున్నారు. నవంబర్ 19 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు దృష్ట్యా కీలకమైన ఈ సిరీస్‌కు దేశవాళీప్రదర్శనలు సెలక్షన్‌లో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. దులీప్ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేసిన వారిలో ఇషాన్ కిషన్ ఒకడు. న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్‌కు అవకాశం ఉన్న ఈ జాబితాలో ఇషాన్ కిషన్ ముందున్నాడు. దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ భారీ 270 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. టోర్నీలో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 109.66 సగటుతో 329 పరుగులు చేశాడు. ఈప్రదర్శనతో న్యూజిలాండ్ టెస్ట్ స్క్వాడ్‌లో అతడి పేరు పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉంది.

ఇషాన్ 2023లో టెస్టుల్లో అరంగేట్రం చేసి రెండు మ్యాచ్‌లు ఆడాడు. అలాగే ముఖేశ్ వికెట్ల వేట కూడా కలిసొచ్చింది. పేస్ విభాగంలో ముఖేశ్ కుమార్ తన అవకాశాలను మెరుగుపర్చుకున్నాడు. దులీప్ ట్రోఫీ 2026లో మూడు ఇన్నింగ్స్‌ల్లోనే 11 వికెట్లు పడగొట్టాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో ప్రధానంగా భారత పేసర్లపై ఆధారపడే అవకాశం ఉండటంతో దేశవాళీ క్రికెట్‌లో అతడి ప్రదర్శన సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదే సమయంలో ఈశ్వరన్‌కు మరో అవకాశం ఇవ్వాలనే దిశగా భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్టర్లు పరిశీలన చేస్తున్నారు. ఓపెనింగ్ విభాగంలో అభిమన్యు ఈశ్వరన్ కూడా పోటీలో ఉన్నాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో రెండు అర్ధశతకాల సాయంతో 180 పరుగులు చేశాడు. ఇప్పటివరకు టెస్టుల్లో అరంగేట్రం చేయని ఈశ్వరన్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా ఎంపిక చేసే అవ కాశం ఉంది. కాగా నవంబర్‌లో న్యూజిలాండ్‌తో పోరు జరగనుంది. ప్రస్తుతం యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ భారత టెస్టు ఓపెనింగ్ జోడీగా ఉన్నారు. అయినా న్యూజిలాండ్ పర్యటన కోసం అదనపు ఓపెనర్ అవసరమైతే ఈశ్వరన్ పేరు పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో ఇషాన్ బ్యాటింగ్ ఫామ్, ముఖేశ్ బౌలింగ్ గణాంకాలు వారి ఎంపిక అవకాశాలను బలోపేతం చేశాయి. అయితే తుది జట్టును సెలెక్టర్లు నిర్ణయించాల్సి ఉంటుంది.



## జాతీయ రికార్డును బద్దలు కొట్టిన తాన్యా
### ఆసియా క్రీడలకు అర్హత..

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడలకు అర్హత సాధించిన తాన్యా చౌదరి జాతీయ హామర్ త్రో రికార్డును బద్దలు కొట్టింది. న్యూఢిల్లీలోని జెఎల్ఎన్ స్టేడియంలో జరిగిన ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్‌లో, స్టార్ అథ్లెట్లతో నిండిన భారత అథ్లెటిక్స్ లైనప్‌లో 22 ఏళ్ల భారత్ అథ్లెట్ తాన్యా చౌదరి మహిళల హామర్ త్రోలో ఒక అద్భుతమైన కొత్త జాతీయ రికార్డును నెలకొల్పి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ యువ ప్రతిభావంతురాలు తన ఐదవ ప్రయత్నంలో 68.35 మీటర్ల భారీ త్రో విసిరి, ఈ ఏడాది ఆరంభంలో భువనేశ్వర్‌లో జరిగిన అంతర్రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో తన శిక్షణా భాగస్వామి అనుష్క యాదవ్ నెలకొల్పిన 67.02 మీటర్ల మునుపటి జాతీయ రికార్డును బద్దలు కొట్టింది.

జపాన్‌లోని ఐచినాగోయాలో జరగనున్న ఆసియా క్రీడలకు కొన్ని రోజుల ముందే ఈ జాతీయ రికార్డు నమోదు కావడం విశేషం. ఈ ప్రదర్శనతో ఆసియా క్రీడల్లో ఆమె భారత్‌కు పతకం అందించే బలమైన ఆశాకిరణంగా నిలిచారు వరుస గాయాలతో పోరాడుతున్న తాన్య, అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్‌కు ముందు కేవలం నాలుగు పోటీలలో మాత్రమే పాల్గొని, ఈ సీజన్‌ను ప్రారంభించింది. మూడు తీవ్రమైన గాయాల నుంచి కోలుకుని, గత మూడేళ్లుగా శ్రమిస్తున్న తాన్యా ఎట్టకేలకు తన కలని నిజం చేసుకుంటూ దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశారు. ఈలోగా అనుష్క 66.34 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో బలమైన రెండవ స్థానంలో నిలిచింది.

## వియత్నాం ఓపెన్..సెమీస్‌కి తన్వి



**హో చి మిన్ సిటీ (వియత్నాం):** వియత్నాం ఓపెన్ సూపర్ 100 టోర్నమెంట్‌లో తన్వి శర్మ తన తోటి క్రీడాకారిణి మాల్వికా బన్సోద్‌ను ఓడించి మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్‌లోకి ప్రవేశించింది. హో చి మిన్ సిటీలో శుక్రవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్, ఏడవ సీడ్‌ను 54 నిమిషాల్లో 21-18, 15-21, 21-14 తేడాతో ఓడించి సెమీఫైనల్‌లో స్థానం సంపాదించింది. టాప్ సీడ్‌తో జరిగిన పోరులో మాల్విక వేగంగా ఆరంభించి 13-6 ఆధిక్యం సాధించింది. ఆమె తర్వాత 13 పాయింట్లలో 10 గెలిచి స్కోరును 16-16తో సమం చేసింది. చివరకు ఒత్తిడిని సైతం తట్టుకుని నిలకడగా ఆడి 21-18 తేడాతో విజయం సాధించింది. రెండవ గేమ్ మరింత హోరాహోరీగా సాగింది. ఈసారి, చివరిలో మాల్విక పట్టు బిగించి 21-15 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. మూడవ గేమ్ సగం వరకు హోరాహోరీగా సాగింది, ఆ తర్వాత తన్వి ఆధిక్యం సాధించి, చివరకు సునాయాసంగా గేమ్‌ను గెలుచుకుని మరో విజయాన్ని పూర్తి చేసుకుంది. మూడవ సీడ్ ఇషారాని బరువా కూడా చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌పై తన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో 21-15, 21-18 తేడాతో విజయం సాధించింది. సెమీఫైనల్‌లో మాన్సీ సింగ్‌ను 21-12, 21-10 తేడాతో ఓడించిన రక్షితా శ్రీతో ఇషారాణి తదుపరి తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో, హెచ్ఎస్ ప్రణయ్ 37 నిమిషాల్లో జరిగిన పోరులో సంస్కార్ సరస్వత్‌ను 28-26, 21-12 తేడాతో ఓడించాడు. అతను తదుపరి రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన టాప్ సీడ్ జియా హెంగ్ టెహ్‌తో తలపడతాడు.



### పురుషుల ఆసియా కప్..
## ఫైనల్‌కు భారత్ అర్హత
### మలేసియా ఓటమి

**మోకి (చైనా) :** మలేసియాను ఓడించిన భారత్, పురుషుల జూనియర్ ఆసియా కప్ 2026 ఫైనల్‌కు అర్హత సాధించింది. శుక్రవారం చైనాలోని మోకిలో జరిగిన మ్యాచ్‌లో మలేషియాపై 3-1 తేడాతో భారత్ విజయం సాధించింది. దీంతో భారత్ జూనియర్ పురుషుల ఆసియా కప్ ఫైనల్‌కు చేరుకుంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ జట్టు తరఫున కెప్టెన్ అన్మోల్ ఎక్కా, సుఖ్వీందర్ గోల్స్ సాధించారు. అన్మోల్ ఎక్కా పెనాల్టీ కార్నర్ల ద్వారా రెండు అద్భుతమైన గోల్స్ (16వ, 54వ నిమిషాల్లో) చేశాడు. మలేషియా తరఫున ఎం.రాహుల్ ఏకైక గోల్ సాధించాడు. కాగా మూడు విజయాలు, ఒక డ్రాతో 10 పాయింట్లు సాధించిన భారత్, పూల్ ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. జపాన్‌ను 3-2 తేడాతో ఓడించి తొమ్మిది పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన దక్షిణ కొరియా, అదే పూల్ నుండి మరో సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. అన్మోల్ ఎక్కా ఈ టోర్నీలో అతని మొత్తం గోల్స్ సంఖ్య 16కు చేరింది. మరో గోల్‌ను 51వ నిమిషంలో సుఖ్‌విందర్ సాధించాడు. మలేషియా తరఫున చివరి నిమిషంలో (60వ నిమిషంలో) ఎం. రాహుల్ ఏకైక గోల్ చేశాడు. ఈ జట్టు పాకిస్థాన్, దక్షిణ కొరియా మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది.

### యుఎస్ ఓపెన్.. గౌఫ్ ఓటమి
## ఫైనల్‌కు రైబాకినా



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో గౌఫ్‌పై రైబాకినా విజయం సాధించి ఫైనల్‌లో సబలెంకాతో పోరుకు సిద్ధమైంది. న్యూయార్క్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో, ఎలెనా రైబాకినా ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని కోకో గాఫ్‌ను 3-6, 6-4, 6-4 తేడాతో ఓడించింది. గౌఫ్ ఆరంభంలోనే పట్టు సాధించింది, తొలి సెట్‌లోని ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఆపై తన సర్వీస్‌ను నిలబెట్టుకుని సెట్‌ను 6-3తో ముగించింది. రెండో సెట్‌లో రైబాకినా పుంజుకుని, నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 4-1 ఆధిక్యాన్ని నెలకొల్పింది. గౌఫ్ పోరాడి సెట్‌ను 4-4తో సమం చేసింది, కానీ రైబాకినా 10వ గేమ్‌లో బ్రేక్ చేసి 6-4తో గెలిచి, నిర్ణయాత్మక సెట్‌కు దారితీసి, మళ్లీ ఆధిక్యం సాధించింది. మూడవ సెట్ హోరాహోరీగా సాగింది. ఆరవ గేమ్‌లో రైబాకినా రెండు బ్రేక్‌పాయింట్ అవకాశాలను కోల్పోయినప్పటికీ, ఎనిమిదవ గేమ్‌లో తన తదుపరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 5-3 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గౌఫ్ పుంజుకుని 30-30 వద్ద బ్రేక్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకొని స్కోరును సమం చేసింది. అయితే, రైబాకినా తన సంయమనాన్ని కోల్పోకుండా 10వ గేమ్‌లో మళ్లీ బ్రేక్ చేసి, రెండు గంటల ఎనిమిది నిమిషాల్లో విజయాన్ని ఖాయం చేసుకుంది.

## జనగణనలో బిసిలకు ప్రత్యేక కాలమ్
### అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
### శాస్త్రీయంగా, పారదర్శకంగా కులగణన చేపట్టాలి
### బిసి సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** జనగణన-2027 రెండో దశ ప్రశ్నావళిలో బీసీ, ఓబీసీల వివరాలను ప్రత్యేకంగా చేర్చాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కేంద్రం నిర్వహిస్తున్న జనగణన రెండో దశ ప్రశ్నావళిలో బీసీ, ఓబీసీల వివరాలను ప్రత్యేకంగా చేర్చాలని శాసనసభలో సభ్యులు సూచించారు. అసెంబ్లీలో శుక్రవారం బిసి కుల గణనకు సంబంధించి స్వల్పకాలిక చర్చ సందర్భంగా పలువురు మంత్రులు, సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వాకిట శ్రీహరి, సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, దానం నాగేందర్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, పాయల్ శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కచ్చితమైన బీసీ జనాభా గణాంకాలు లేకుండా సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లపై సమర్థవంతమైన విధానాలు రూపొందించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీలకు సంబంధించిన ఈ అంశంపై సభలో ఏకగ్రీవ తీర్మా నం చేయాల్సి న అవసరం ఉందని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సభ్యులు కూడా దీనికి మద్దతు ఇవ్వాలని మంత్రి కోరారు. భారత జాతీయ కాంగ్రెస్ తరఫున ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని ప్రభుత్వపరంగా కూడా కేంద్రానికి పంపించి, తగిన చర్యలు తీసుకునేలా కోరాలని నిర్ణయించినట్లు తెలిపారు. కచ్చితమైన కుల గణాంకాల ఆధారంగానే ప్రతి వర్గానికి సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయగలమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు సామాజిక న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (కుల సర్వే) దేశానికే రోల్ మోడల్గా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం సాధించాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ఈ కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచి బీసీ కులాల లెక్క తేల్చి న్యాయం చేయాలని కోరారు.

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థలో 11,828 మెగావాట్ల గరిష్ట డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో క్రమేపీ డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో అత్యధికంగా 11828 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. మధ్యాహ్నం 12:44 గంటల సమయంలో ఈ రికార్డు స్థాయి డిమాండ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అంతకుముందు ఉదయం 10:30 గంటల సమయానికే డిమాండ్ 11,816 మెగావాట్లకు చేరుకోవడం గమనార్హం.

## రూ. 180 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల
### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను శుక్రవారం రూ.179.90 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను త విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తాజా నిధుల విడుదలతో విదేశాల్లో చదువుకుంటున్న మొత్తం 3,008 మంది విద్యార్థులకు భారీ ఆర్థిక ఊరట లభించిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు.

# బలహీనవర్గాలకు న్యాయం
### ఆస్తుల సమాన పంపిణీ ..
### కులగణన ద్వారానే సాధ్యం
### శాసనసభలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** బలహీన వర్గాలకు న్యాయం, ఆస్తుల సమాన పంపిణీ కోసం కులగణన అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్యా, ఉపాధి మరియు రాజకీయ సర్వేల తరహాలో దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాల్సి న అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర శాసనసభలో జనగణన, కుల గణనపై శుక్రవారం జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజికఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సర్వేల తరహాలో దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాల్సి న అవసరం ఉందని భట్టి అన్నారు. దేశంలో సామాజిక అసమానతలను తొలగించి, బలహీన వర్గాలకు న్యాయం అందించాలంటే, జాతీయ జనాభా లెక్కలలో కుల గణనను తప్పనిసరిగా చేర్చాలని స్పష్టం చేశారు. కుల గణన నిర్వహణకు తాము మద్దతిస్తామో, వ్యతిరేకిస్తామో బీజేపీ సభ్యులు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నిర్వహించిన సర్వే దేశం మొత్తానికి ఒక ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. అసెంబ్లీలో సర్వే నివేదికను ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం దానిని ప్రశంసించారని ఆయన గుర్తుచేసుకున్నారు. తెలంగాణలో చేపట్టిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లి, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలుసుకుని, దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని కేంద్రాన్ని కోరారని చెప్పారు. తెలంగాణలో నిర్వహించిన సర్వేను అసెంబ్లీలో ప్రశంసించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కుల గణన జరగలేదని వాదించడం బీజేపీ సభ్యులకు తగదన్నారు. తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని పునరుద్ఘాటించారు. సమాజంలోని అన్ని వర్గాల మధ్య సంపద, వనరులు సమానంగా పంపిణీ కావడం లేదని, ఈ అసమానతలను తొలగించడంలో సమస్య ఎక్కడ ఉందో అర్థం చేసుకోవడమే మొదటి అడుగు తెలియచేశారు.

## ప్రాధాన్యత రంగాల తర్వాత డేటా సెంటర్లకు విద్యుత్, నీరు సరఫరా
### ఎఐ ఆవిష్కరణతో ఐటిలో తగ్గిన ఉద్యోగకల్పన
### గ్లోబెల్ కేపబిలిటీ కేంద్రాలలో లక్ష మందికి నూతంగా ఉద్యోగకల్పన: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదారాబాద్,సెప్టెంబరు 11,ప్రభాతవార్త :** ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, గృహవసరాలు, పరిశ్రలకు విద్యుత్ నీటి అవసరాలు తీర్చిన తరువాతనే డేటా సెంటర్లకు వసతులు కల్పిస్తామని శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరిశ్రమలు, వాణిజ్యం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. శాసభ సమావేశాలు ఐదవ రోజన శుక్రవారం ధన్‌పాల్‌సూర్యనారయణ, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాలయశంకర్, పాల్వాయి హరీష్, పైడిరాకేశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, జానంపల్లి అనురుద్‌రెడ్డి,వేములు వీరేశం ఐటిహబ్, తెలం గాణ రైజింగ్ నినాదంతో వచ్చిన పెట్టుబడులపై అడిన వేరువేరు ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం సమాధానమిస్తూ డేటా సెంటర్ల ఏర్పాటుకు రూ.70వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామనీ ఒక్క డేటా సెంటర్‌తో 7 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో ఎన్ని లాభాలున్నాయో.. అన్ని అనర్థాలు కూడా ఉన్నాయనీ, మనం వద్దంటే మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకొంటారని ఆయన వివరించారు. అంతరిక్షంలో కూడా ఇప్పుడు డాటా సెంటర్లు ,ఫార్మకంపెనీలు పెడుతున్నారని ఆయన సభకు తెలిపారు. కొత్తగా జరిగి సాంకేతిక ఆవిష్క రణల ఫలితంగా ఏర్పడిన మార్పులతో డేటాసెంటర్లు నీటి వినియోగం కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు.ఏఐ వచ్చిన తర్వాత ఉపాధి కల్పన తక్కువగా ఉందనీ ఐనా మన వద్ద కొత్తగా ఏర్పాటైన గ్లోబల్‌క్యాపబుల్ కంపెనీలలో లక్షకుపైగా యువ ఇంజనీర్లకు ఈ సంవత్సరం కొత్తగా ఉద్యోగాలు వచ్చాయని అని శ్రీధర్‌బాబు వివరించారు. హైదారాబాద్ నగరంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటి సంస్థల ఆసక్తి చూపుతున్నాయని టూటైర్‌సిటీల్లోని ఐటీ టవర్లలో సంస్థల ఏర్పాటుకు ముందుకు రావట్లేదు. జిల్లాలోని ఐటి టవర్ల సమీపంలో మౌలిక వసతులపై ఆలోచిస్తున్నారు. పాల్వాయి హరీష్ బాబు సిద్దిపేట ఐటి టవర్‌లో వరిధాన్యం ఆరబెట్టారని అసెంబ్లీ దృష్టికి తీసుకొని రాగా శ్రీధర్‌బాబు స్పందిస్తూ గత ప్రభుత్వంలో కొన్ని జిల్లాల్లో ఐటీ టవర్లను నిర్మించి వదిలేశారని చెప్పారు. రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పెద్దపల్లిలో యాంకర్ పార్టనర్ కోసం వెతుకుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో 100 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభలో ప్రకటించారు. పరిగిలో ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశామని, 3 గ్రామాల్లో భూసేకరణ తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కృషిచేస్తున్నమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## కలెక్టర్ల మెడపై కత్తిపెట్టి 22-ఎ లిస్ట్‌లోకి భూములు
### భూభారతి కాదు.. భూహారతి, మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి
### పవర్ పాయింట్ ప్రెజంటేషన్ చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** కలెక్టర్ల మెడపై కత్తిపెట్టి భూములను 22ఏ లిస్టులో పెట్టించారని, కేసీఆర్ సమస్యలను పరిష్కరిస్తే రేవంత్ సమస్యలు సృష్టించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క సెంట్ భూమి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదన్న వ్యాఖ్యలపై ఆధారాలతో సహా కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేదిత జాబితా వివాదంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరుతో ప్రజల భూములకు భూ హారతి పడుతోందని ధ్వజమెత్తారు. 33 జిల్లాల కలెక్టర్లు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని లిస్ట్ తయారు చేసి ప్రభుత్వానికి పంపింది నిజం కాదా అని ప్రశ్నించారు. అన్ని జిల్లాల కలెక్టర్ల జీవోల ఆధారాలతో చూపించాం.. చీము నెత్తురు ఉంటే పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.భూ భారతి కాదు.. అది భూ హారతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో రాధ అనే వృద్ధురాలికి చెందిన భూమిని భూ భారతి ద్వారా కబ్జా చేశారు. బాధితురాలికి తెలియకుండానే ఆమె భూమిని వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. కేవలం 10 రోజుల్లోనే ఆమె భూమిని ఆమెకు కాకుండా చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన 5 నెలల్లోనే అనుముల తిరుపతిరెడ్డికి సానుకూలంగా భూమి డాక్యుమెంట్లు మార్చేశారని ఆరోపించారు. ఒక్కో ఊర్లో కాలనీలకు కాలనీలే 22ఏ కిందికిపోయిన్.. ఒక్కో కాలనీలో 2 వేల ఇండ్లు, 5 వేల ఇళ్లు ఇందులోకి పోయినయ్ అని చెప్పారు.

## బిసిల జనాభా లెక్కలు తేల్చాలి
### కులగణన చేపట్టాలి
### బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి
### శాసనసభలో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామా జిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని పేర్కొన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు, వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతి నిధ్యం, రాజకీయంగా వారి వాటా అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు. ఇది కేవలం ఒక సర్వే కాదని, సామాజిక న్యాయానికి పునాదని పేర్కొన్నారు.

బీసీల హక్కులకు బలమైన ఆధారమన్నారు. జనాభాలో ఎంత వాటా ఉంటే అవకాశాలు, అధికారంలో అంత వాటా ఉండాలనే స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్రంలో పన్నెండేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి ఎందుకు వెనకడుగు వేస్తోందని ప్రశ్నించారు. బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారని నిలదీశారు. డేటా లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమన్నారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను స్పష్టంగా చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన చేయండి, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయండని విజ్ఞప్తి చేశారు.

## ప్రధాని మోడీ 25 యేళ్ల సుదీర్ఘ ప్రజాసేవకు అంకితంగా సేవా సంకల్ప్ అభియాన్
### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా దేశానికి అందించిన విశిష్ట సేవలను పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వెల్లడించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేముల అశోక్, వీరేందర్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పల్నాటి వెంకట్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ 12.5 ఏళ్లు సిఎంగా, ఆపై మరో 12.5 ఏళ్లు ప్రధానిగా మొత్తం 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకుంటున్నారని అన్నారు. ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత అరుదైన మైలురాయి అని కొనియాడారు. బిజెపి జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు, సెప్టెంబర్ 17న మోడీ జన్మదినం నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ చేపడుతున్నట్లు తెలిపారు. దేశ జిడిపి 7.8 శాతానికి చేరిందని, గతంలో 9.7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణాన్ని 2.5 శాతానికి కట్టడి చేశామని చెప్పారు. హైవేలు, రైల్వేలు, ఎయిర్‌పోర్టుల వంటి మౌలిక వసతుల కల్పనతో వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతుందని, మోడీ 25 ఏళ్ల పాలనా విజయాలను సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ స్ఫూర్తితో ప్రతి గడపకూ తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

# విద్యుత్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలుచేయాలి

**భూములిచ్చిన రైతుల కుటుంబాలలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలి**

**తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వరరావు**




ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఈశ్వరరావు

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ సంస్థలైన ఎస్‌పిడిసిఇఎల్, ఎన్‌పిడిసిఎల్ లలో గత 15, 20 సంవత్సరాలుగా బిల్ కలెక్టర్లుగా, స్పాట్ బిల్లర్లుగా పనిచేస్తున్న వారందరికీ జీవో నెంబర్ 6 ప్రకారం కనీస వేతనం 18,500 రూపాయలు ఇవ్వాలని తెలంగాన స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటియూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి ఈశ్వర్‌రావు మాట్లాడుతూ సబ్ స్టేషన్‌ల కొరకు రైతుల నుంచి భూములు సేకరించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేసిందని, కాంగ్రెస్ హయాంలో అయినా వారికి ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారికి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే భూములిచ్చిన రైతుల కుటుంబాలలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్‌పై పనిచేస్తున్న బిల్ కల్లెర్లకు, స్పాట్ బిల్లర్లకు నెలలో 30రోజులు పని కల్పించాలని, పీస్ రేట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ డిప్యూటి జనరల్ సెక్రటరీ ఎస్.చంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా బిసి కులగణన చేపట్టాలి

**- బిసిలను మోసం చేస్తే బిజెపికి ఇదే చివరి పాలన - త్వరలో లక్షలాది మందితో పార్లమెంట్ ముట్టడి - బిసి జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బిసిల ధర్మ పోరాట దీక్ష**

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** జాతి జనగణనను తక్షణమే నిలిపివేయాలని, దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని పలువురు బీసీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ స్పీకర్, శాసనసభాపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఈరావత్ అనిల్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టకపోతే బీజేపీని గద్దె దింపటం ఖాయమని హెచ్చరించారు. జాతీయ స్థాయిలో అఖిలపక్ష పార్టీలు, సామాజిక నిపుణులతో సమావేశం ఏర్పాటుచేసిన తరువాతనే జనగణన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దేశంలోని బీసీ సమాజమంతా బీసీ లెక్కలు కావాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించాలని ఉద్యమిస్తూ ఉంటే, బీసీ ప్రధాని అయి ఉండి కూడా బీసీలకు న్యాయం చేయటం లేదని ఆరోపించారు. ఈనెల 20వ తేదీ బీసీ కులగణనపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని, ఆ సదస్సులో దేశ వ్యాప్తంగా మరో మండల్ ఉద్యమానికి రూపకల్పన చేసి, కేంద్రం దిగి వచ్చే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బీజేపీ రిజర్వేషన్లు ఎత్తివేయాలన్నారు.

## నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కనీస వేతనాలు అమలుచేయాలి

**కెజిబివి సిబ్బంది వేతనాల పెంపునకై ప్రకటన చేయాలి**

**ప్రగతి శీల కెజిబివి నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నేతల డిమాండ్**

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కనీస వేతనాలు అమలుచేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, టియూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎల్.ఎల్.పద్మ, ఎం.సుధాకర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టియూసీఐ), తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై పోటు రంగారావు మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని, ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల పట్ల ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి.

## రూ. 18 వేల వేతనం చెల్లించాలి: ఆశా వర్కర్ల చలో అసెంబ్లీ ఉద్రిక్తం

**రణరంగంగా మారిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిసరాలు**

**బి ఆర్ టి యు నేతలు సహా ఆశా వర్కర్ల అరెస్ట్**




చలో అసెంబ్లీ ర్యాలీకి బయలుదేరుతున్న మాజీ వినోద్ కుమార్, బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తదితరులు

**చిక్కడపల్లి సెప్టెంబర్ 11 ( ప్రభాతవార్త ):** ఆశా వర్కర్ లకు రూ. 18,000 ఫిక్స్డ్ వేతనం చెల్లించాలని, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బి ఆర్ టి యు అనుబంధ ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన "చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ మీదుగా అసెంబ్లీ వైపు ర్యాలీగా బయలుదేరిన వేలాది మంది ఆశా వర్కర్లను పోలీసులు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా జరిగింది.

ఈ సందర్భంగా బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ర్యాలీ నిర్వహించుకోవడానికి డీసీపీకి ముందస్తుగా విజ్ఞప్తి పత్రం సమర్పించినా అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు. సిఐటియు , బీసీ సంఘాలకు ధర్నాలకు అనుమతులిచ్చి, బి ఆర్ టి యు అనుబంధ సంఘాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వైషమ్యంతో వ్యవహరిస్తోందని జి. రాంబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా కార్యకర్తలపై మగ పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించారని, దుర్భాషలాడుతూ ఈడ్చిపారేశారని ఆరోపించారు. కాగా పోలీసుల దౌర్జన్యం, తోపులాట కారణంగా ఆశా వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. సంతోష, సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి ృ స్పృహతప్పి పడిపోయారు. పలువురు మహిళా కార్యకర్తల దుస్తులు చిరిగిపోయి, తీవ్ర గాయాలయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో కూడా మహిళలపై ఇటువంటి దహనకాండ చూడలేదని రాంబాబు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫీజు బకాయిల కోసం బిఆర్ఎస్వీ విద్యార్థుల ప్రదర్శన - అరెస్టు చేసిన పోలీసులు




గన్‌పార్కు సమీపంలో బిఆర్ఎస్వీ విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**సైఫాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాని డిమాండ్ చేస్తూ శుక్రవారం చలో అసెంబ్లీ ప్రదర్శన చేపట్టిన వందలాది మంది విద్యార్థులను శుక్రవారం పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి చలో అసెంబ్లీ ప్రదర్శనకు వెళుతున్న విద్యార్థులను పోలీసులు గన్‌పార్కు సమీపంలో బలవంతగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత 33 నెలలుగా విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు ఫీజల బకాయిలను చెల్లించకుండా మోసం చేస్తున్నదని ఆరోపించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేస్తున్నదని, కమిషన్‌లు ఇచ్చిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తున్నదని, కాని విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడానికి సిఎంకు మనసు రావడం లేదని విమర్శించారు.

# అటవీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



-ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ఆయుధాల కోసం 4,095 కోట్ల రూపాయల ప్రతి పాదన
- ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది
- అటవీ అమర వీరుల త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**చార్మినార్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న అటవీ ఉద్యోగులు, సిబ్బంది భద్రత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అటవీ అమర వీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులోఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో శుక్రవారం జరిగిన జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. నెహ్రూ జూలాజికల్ పార్కు స్మారక చిహ్నం వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, వైరా ఎమ్మెల్యే బానోతు రాందాస్ నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్ కుమార్‌తో పాటు రాష్ట్ర అటవీ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. వన్య ప్రాణుల వేల కోసం అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి మరణించిన చెరువు సింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ కుటుంబానికి మంత్రి జూపల్లి కృష్ణారావు 30 లక్షల రూపాయల చెక్కును అంద చేశారు. ఆయన కుటుం బాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కాగా కార్యక్రమం ప్రారంభానికి ముందు అటవీ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని సభలో అటవీ శాఖ అధికారి చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అటవీ రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అటవీ నేరాలు, అటవీ ఆక్రమణాలు, వన్య ప్రాణుల వేటను అరికట్టేందుకు క్షేత్ర స్థాయిలో నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అటవీ శాఖను మరింత బలపేతం చేయటానికి గాను 1393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, 15ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 18 అసిస్టెంట్ కన్జర్ వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, ఇతర కేట గిరిలో కలిపి మొత్తం 1516 ఉద్యోగాల నియ మాలకు భర్తీ ప్రక్రియ కొనసాగు తుందని ఆయన తెలియజేశారు. 2014 నుంచి జూలై 2026 వరకు 1,06,685 కేసులు నమోదు అయ్యాయని, వీటిలో 55.99 కోట్ల విలువైన కలపకు సంబంధించిన కేసులు ఉన్నాయని, రూ.160.75 కోట్ల కంపౌండింగ్ ఫీజు వసూలు చేశామని, ఈ కేసులకు సంబంధించి 19,482 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అదనంగా 31,523 యూడిఓఆర్ కేసులు నమోదు చేసి 70.72 కోట్ల విలువైన కలపను స్వాధీనం చేసుకుని కలప డిపోలకు తరలించటం జరిగిందని, 11,824 అటవీ ఆక్రమణ కేసులు కూడ నమోదయ్యాని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూపార్కు డైరెక్టర్ సునీల్ ఎస్.హీరామత్, జూపార్కు క్యూరేటర్ జె.వసంత, రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ సంపదను కాపాడుకోవటం చాలా ముఖ్యం : రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్ అటవీ సంపదను కాపాడుకోవటం చాలా ముఖ్యమని తెలం గాణ రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్ అన్నారు. జూపార్కులో శుక్రవారం జరిగిన జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా డిజిపి సి.వి.ఆనంద్ మాట్లాడుతూ పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని అక్టోబరు నెల 21వ తేదీన, అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్స వాన్ని సెప్టెంబరు నెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని, అటవీ శాఖను మరింత బలోపేతం చేసి, ఖాళీలను భర్తీ చేయటంతో పాటు వన్య ప్రాణులను కాపాడవలసిన అవసరం ఉందని తెలిపారు. అటవీ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి ఆయుధాలు ఉండాలని నా యొక్క భావనని, అడవులను కాపాడు కోవటం చాలా ముఖ్యమని, పోలీస్ శాఖ తరుపున రాష్ట్ర అటవీశాఖకు అన్ని విధాల సహాయాన్ని అందిస్తామని డిజిపి సి.వి.ఆనంద్ తెలియజేశారు.

## బిఆర్ఎస్, కెసిఆర్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

**మాల మాదిగ సంఘాలు హెచ్చరిక**

**సైఫాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** మాల, మాదిగలు మాజీ సిఎం కెసిఆర్ ఫామ్ హౌస్‌కు వస్తే మైలు పడింది అంటూ పసుపు నీళ్ళతో శుద్ధి చేసి దళితులను అవమానించడం సిగ్గు చేటని మాల మాదిగ సంఘాల జెఎసి ఛైర్మన్ దేవని సతీష్‌మాదిగ, జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య విమర్శించారు. దళితులను అవమానించిన కెసిఆర్, బిఆర్ఎస్ నాయకులను దళిత వాడల్లోకి రానీయకుండా అడ్డుకుంటామని, తక్షణమే దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ నాయకులు శుద్ధి చేయాల్సింది నేలను కాదని, కెసిఆర్ బుర్రనని, పసుపు నీళ్ళతో శుద్ధి చేసి దళితులను అవమానించిన విషయంపై ఈ నెల 15వ తేదీన ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి పార్టీ గుర్తింపును రద్దు చేయమని కోరుతామన్నారు.

## తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఆధికారికంగా నిర్వహించాలి

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**




తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్రలో పాల్గొన్న పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ట్యాంక్‌బండ్‌పైనున్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మఖ్దూం మోహియుద్దీన్ విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ.నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ తదితరులతో కలసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వరకు తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి యాత్ర పేరుతో భారీ రెడ్ షర్ట్ వాలంటీర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడారు.

## మహిళా పోలీసు సిబ్బంది పట్ల అనుచిత ప్రవర్తనపై డిజిపికి సమగ్ర నివేదికలు సమర్పించాలి: రాష్ట్ర హెచ్ఆర్సి ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. తాతా మధు వ్యవహారంలో పోలీసు సిబ్బందిపై బీఆర్ఎస్ నేతల అనుచిత ప్రవర్తనపై నివేదిక ఇవ్వాలని డీజీపీని హెచ్ఆర్సీ ఆదేశించింది. ఈనెల 7న జరిగినట్లు ఆరోపించబడిన రెండు సంఘట నలకు సంబంధించి దాఖలైన ఫిర్యాదులపై శుక్రవారం మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్. ఇతరులు చేసిన ఫిర్యాదులో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మీడియా సమక్షంలో దూషించినట్లు ఆరోపించారు.

**వాణిజ్యం**

# స్తంభించిన బ్యాంకింగ్ సేవలు!

## దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమ్మె




**ముంబయి, సెప్టెంబరు 11:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలు శుక్రవారం స్తంభించి పోయాయి. బ్యాంకు ఉద్యోగులు మెరుపు సమ్మెకు దిగారు. జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బ్యాంక్ ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. వారానికి అయిదు రోజుల పనిదినాలను ప్రవేశపెట్టాలని, ఇతర పెండింగ్ అంశాలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు రోడ్డెక్కారు. ఈ సమ్మె దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సర్వీసులపై ప్రభావం చూపింది. ప్రధాన కార్యాలయాలు, వివిధ శాఖల పరిధిలో బ్యాంక్ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసనల్లో పాల్గొన్నారు. ఈ సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కారణంగా దేశంలోని అత్యధిక ప్రభుత్వ రంగ బ్యాంకులలో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు, చెక్కుల క్లియరెన్స్, ఇతర పరిపాలనాపరమైన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్నిచోట్ల ప్రైవేట్ బ్యాంకులలో సైతం సేవలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఖాతాదారుల సౌకర్యార్థం యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా అందుబాటులో ఉన్నాయి. ఒక్క మధ్యప్రదేశ్ లోనే దాదాపు 7వేల బ్యాంకులు మూతపడ్డాయి. సుమారు రూ. 5,500 కోట్ల విలువైన రోజువారీ బ్యాంకింగ్ లావాదేవీలు నిలిచిపోయాయి. సుమారు 42వేల మంది ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో కూడా దాదాపుగా ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. బ్యాంకింగ్ రంగంలోని వివిధ ఉద్యోగ సంఘాలు సుదీర్ఘ కాలంగా వారానికి అయిదు రోజుల పని విధానాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని శనివారాలు కూడా సెలవు దినాలుగా గుర్తించాలనే ప్రతిపాదన కేంద్రం ముందు పెట్టారు. 2024 మార్చిలో కుదిరిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ కూడా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి దీనిపై తుది నోటిఫికేషన్ విడుదల కాకపోవడం వల్ల ఈ ఆలస్యం జరుగుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం నెలలో ఒకటి, మూడు, అయిదో శనివారాల్లో బ్యాంకులు పనిచేస్తోన్నాయి. వాటన్నింటినీ కూడా సెలవు రోజులుగా పరిగణించాలని బ్యాంక్ ఉద్యోగులు డిమాండ్ చేస్తోన్నారు. పనిదినాల సంఖ్యను తగ్గించడమే కాకుండా పెన్షన్ల సవరణ, పింఛనర్లకు ఒకే విధమైన ఫార్ములాను వర్తింపజేయడం వంటి ఇతర డిమాండ్ల కోసం కూడా ఆయా సంఘాలు పట్టుబట్టాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ కింద ఉన్న ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో కేంద్రం పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తోందని, తమను నిర్లక్ష్యం చేస్తోందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం పేర్కొన్నారు. కేంద్రం దిగివచ్చేంత వరకూ తమ నిరసనలు కొనసాగుతాయని తెలిపారు. రెండుతెలుగురాష్ట్రాల్లోకూడా బ్యాంకింగ్ సేవలు మొరాయించాయి. రెండురోజుల ముందునుంచే ఉద్యోగులు తమ చొక్కాలకు సమ్మెస్లిప్‌లతో విధులకు హాజరయ్యారు.

## ట్రేడింగ్ ఆరంభంలోనే రూ.ఆరులక్షలకోట్లు ఆవిరి

**రికవరీతో స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ**

**ముంబయి, సెప్టెంబరు 11:** భారత స్టాక్ మార్కెట్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, చివరి గంటల్లో ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో కొనుగోళ్లు లభించడంతో సూచీలు రోజు కనిష్ఠ స్థాయిల నుండి కొంత కోలుకుని ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఈ సెన్సెక్స్ 120.83 పాయింటు నష్టపోయి 74,781.76 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 79.70 పాయింట్లు క్షీణించి 23,398.10 వద్ద ముగిసింది. అంతకుముందు మార్కెట్ ప్రారంభంలోనే గ్లోబల్ మార్కెట్ల పతనం ప్రభావంతో సెన్సెక్స్ 740 పాయింట్లకు పైగా కుప్పకూలి 74,160 కనిష్టానికి, నిఫ్టీ 250 పాయింట్లు పడిపోయి 23,231 కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ట్రేడింగ్ మొదటి ఐదు నిమిషాల్లోనే పెట్టుబడిదారుల సంపద ఏకంగా రూ. 6 లక్షల కోట్ల మేర తుడిచిపెట్టుకుపోయి. బిఎస్ఈ నమోదితకంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ. 484 లక్షల కోట్ల నుండి రూ. 478 లక్షల కోట్లకు పడిపోయింది.

నష్టాల్లో ఉన్న 2,377 షేర్లతో పోలిస్తే కేవలం 504 షేర్లు మాత్రమే లాభాల్లో ముగియడం ద్వారా మార్కెట్ తీవ్ర ప్రతికూలతను ప్రతిబింబించింది. ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాలు రికవరీ అయ్యాయి.

## బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నగదు ఆర్బీఐ విత్‌డ్రా రూ.1 లక్ష కోట్లు విలువైన ప్రభుత్వ బాండ్ల విక్రయం




**ముంబయి, సెప్టెంబరు 11:** బ్యాంకింగ్ వ్యవస్థలో భారీగా పేరుకుపోయిన అదనపు నగదును తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. సుమారు రూ.1 లక్ష కోట్లు 10.5 బిలియన్ విలువైన ప్రభుత్వ బాండ్లను విక్రయించడం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకోనుంది. అదనపు నగదు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్బీఐ బాండ్ విక్రయాలను మూడు విడతల్లో నిర్వహించనుంది. ఈనెల 17, 21, 28 తేదీల్లో ఈ విక్రయాలు జరగనున్నాయి. ఇటీవల ఆర్బీఐ చేపట్టిన మూలధన సమీకరణ చర్యల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నిధులు రావడంతో అదనపు నగదు నిల్వలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం బ్యాంకుల వద్ద సుమారు రూ.11 లక్షల కోట్లు అదనపు నగదు ఉన్నట్లు అంచనా. తొలి విడత ఈనెల 17న జరగనున్న తొలి వేలంలో 2029, 2030, 2031, 2032 సంవత్సరాల్లో మెచ్యూర్ అయ్యే ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్బీఐ విక్రయించనుంది. ఈ అదనపు రుణ పత్రాల సరఫరా కారణంగా ప్రభుత్వ బాండ్లపై రాబడులు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఈకామర్స్ మోసాలకు కేంద్రం బ్రేక్! కొత్తరూల్స్‌పై నోటిఫికేషన్.. జనవరి నుంచే అమలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** ఇకామర్స్ ప్లాట్ ఫామ్స్ ద్వారా కొనుగోళ్లు చేస్తున్నప్పుడు జరుగుతున్న మోసాలకు కళ్లెం వేస్తూ మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. యూజర్లను తప్పుదోవ పట్టించే మోసపూరిత పద్ధతులకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఇకామర్స్) రూల్స్ 2020కి సవరణలు చేసింది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఇకామర్స్) సవరణ నిబంధనలు నోటిఫై చేసింది. ఈ కొత్త రూల్స్ 2027, జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఏదైనా వస్తువుపై డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించినప్పుడు తగ్గించిన ధరతో పాటు, అంతకు ముందు ఉన్న ధరను సైతం స్పష్టంగా చూపించాల్సి ఉంటుంది. రాయితీ ప్రకటించేందుకు ముందు 30 రోజుల్లో ఆ వస్తువు అమ్ముడైన అత్యల్ప ధరనే ప్రయర్ ప్రైస్ గా పరిగణించాలి.

## 21.57 లక్షల కోట్లకు వాణిజ్య లోటు!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కూటమితో దేశానికి నానాటికీ పెరుగుతున్న వాణిజ్య లోటు అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. భారత్‌వాణిజ్య లోటు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 226.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 21.57 లక్షల కోట్లు)కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలతో భారత్ మొత్తం వాణిజ్యం రెట్టింపై సుమారు 417.5 బిలియన్ డాలర్లకు చేరినప్పటికీ, లోటు కూడా అదే స్థాయిలో పెరగడం గమనార్హం. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలకు భారత్ ఎగుమతులు 48.8 వృద్ధితో 95.7 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే సమయంలో దిగుమతులు ఏకంగా 131.8 పెరిగి 321.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం భారతదేశ మొత్తం దిగుమతుల్లో 40 బ్రిక్స్ దేశాల నుంచే వస్తుండగా, మన ఎగుమతుల్లో కేవలం 22 మాత్రమే ఆ దేశాలకు వెళ్తున్నాయి. వాణిజ్య లోటుకు చైనా, రష్యాలే కారణమవుతున్నాయి.

ఫ్యాషన్ ఫ్యాషన్

# గళ్ల నడికట్టు ట్రెండీగా..



అలనాటి నేత చీరలంటే గళ్లు, కలనేతతో ఎంతో ముచ్చటగా ఉండేవి ఆ చీరల మాటున మహిళల సహజ సౌందర్యాన్ని వర్ణించ తగునా? అన్నట్లుండేవి. మళ్లీ ఇప్పుడు అదే ఫ్యాషన్‌గా మారింది. మనకి మాత్రం ఈ గళ్ల ఫ్యాషన్ కొత్తా? జీన్స్ మీదకి వేసే టాప్‌లు, ఫ్రాకుల్లో ఎప్పుడో అలరించింది. మరిప్పుడెందుకు ప్రస్తావన అంటారా? సస్టెయినబిలిటీ.. దీనికి ఎంత ప్రాధాన్యం పెరుగుతోందో తెలుసు కదా! దానికి వస్త్ర ప్రపంచంలో అనువైనదంటే చేనేతే! ఈ వస్త్రాలు పర్యావరణహితం.. భూమిలోనూ త్వరగా కలిసిపోతాయి. నేతతీరు చర్మానికి గాలి తగిలేలా చేసి మేనికి హాయినిస్తుంది. పైగా కాలంతో సంబంధం లేకుండా అనువుగానూ ఉంటాయి. సమస్యల్లా.. అవి కనిపించే తీరే! ఆధునిక అమ్మాయిలు ఆ తరహావి ఎలా మెచ్చుతారు? అలాగని ఊరుకుంటే ఎలా.. అందుకే డిజైనర్లూ నేత వస్త్రాలపై దృష్టిపెట్టారు. ఆనాటి గళ్ల డిజైన్లలో ఇలా ట్రెండీగా ఫ్రాక్‌లను తీసుకొచ్చేశారు. ఫలితమే సంప్రదాయ వస్త్రానికి ఇలా ఆధునిక లుక్! బాగున్నాయి కదూ! నాటి లుక్‌లో నేటి ఫ్యాషన్.. మీకూ నచ్చిందా? ఇంకేం ప్రయత్నించేయండి. ట్రెండీగా కనిపించొచ్చు. పర్యావరణానికీ మేలు భలే జోడీ కదూ!





## కొల్లార్డ్ గ్రీన్స్ ఆకుకూర

కొల్లార్డ్ ఆకుకూరలో కాల్షియం విటమిన్ 'కె' ఎక్కువగా ఉండడం వల్ల దంతాలు ఎముకలు ఆరోగ్యానికి మంచి చేస్తుంది. ఈ ఆకుకూరలోని విటమిన్ ఎ, ట్యాటిన్ జియాక్సంతిన్ అనే కెరోటినాయిడ్స్ రేచీకటి, కంటి శుక్లాలు దయాజెటిక్ రెటినోపతి గ్లకోమా వంటి కంటి వ్యాధులు 57% తుగ్గుతాయని ఒక అధ్యయనంలో తెలిసింది. ఈ క్రూసిఫెరస్ ఆకుకూరల్ని తినడంవల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడం వల్ల రక్త ప్రసరణ మెరుగై 16% గుండె జబ్బులు స్ట్రోక్ వ్యాధుల్ని ఆరికట్టవచ్చు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చవచ్చు. కొల్లార్డ్ ఆకుకూరలోని ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియాని పెంచి జీర్ణకోశ ఆరోగ్యాన్ని పెంపొందించడం వల్ల హెలికో బ్యాక్టీరియా వంటి జీర్ణకోశ ఇన్ఫెక్షన్స్‌ని ఆరికట్టవచ్చు. వీటిలోని విటమిన్ 'ఎ' విటమిన్ 'సి' రోగనిరోధక వ్యవస్థని బలోపేతం చేస్తాయి. వీటిలోని అధిక ఐరన్ ఎర్ర రక్త కణాల్ని ఉత్పత్తి చేసి రక్తహీనతని నివారిస్తుంది. అధిక ఫోలేట్స్ వల్ల గర్భధారణ సమయంలో పుట్టుకతో వచ్చే లోపాల్ని నివారించడంలో సహాయపడుతుంది. కొల్లార్డ్ గ్రీన్స్‌లోని గ్లూకోసినోలేట్స్, సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి పాంక్రియాటిక్ అన్నవాహిక కేన్సర్, రొమ్ము, లంగ్స్, పెద్ద ప్రేగు కేన్సర్ నివారించి డిఎన్ఎ దెబ్బతినకుండా కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధించ గలవు. వీటిలోని విటమిన్ కె, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు శరీరంలోని మంటల్ని, వాపుల్ని తగ్గిస్తాయి. తక్కువ గ్లైసెమిక్ ఇంపెక్స్ ఉన్న ఆహారాలు జీర్ణ కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఎక్కువ సేపు కడుపు నిండినట్లుండి అతిగా తినలేము. దీనివల్ల బరువు తగ్గుతారు. డయాబెటిక్స్‌లోచక్కెర స్థాయులు తగ్గుతాయి. హార్మోన్ల అసమానతుల్యతని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని దూరం చేస్తుంది. చర్మం జుట్టు సమస్యల్ని నివారించి వాటి ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. వీటిలోని అధిక ఆక్సలేట్స్ జింక్, కాల్షియం, ఐరన్, ఖనిజాల శోషణకు ఉపయోగపడుతుంది. ఒక కప్పులో 10 మిగ్రా ఆక్సలేట్స్ ఉంటాయి. ఇవి ఎక్కువైతే వీటి శోషణ లోపం ఏరనపడి శారీరక వ్యాధులేర్పడతాయి. ఇది పిల్లల్లో ఆటిజం, హైపర్ ఆక్టివిటీని తగ్గించి ఏకగ్రత జ్ఞాపకశక్తిని పెంచి మెదడు ఆరోగ్యానికుపయోగ పడుతుంది. వీటిలో విటమిన్ కె, రక్తం గడ్డ కట్టడాన్ని ప్రోత్సహిసునతంది. కొల్లార్డ్ గ్రీన్స్ జీవితకాలం 3-5 సంవత్సరాలుంటుంది. వీటిని విత్తనాల ద్వారా ప్రపంచం మంతటా సాగు చేసి అధిక రాబడిని పొందవచ్చు. ఎందుకంటే అనేక దేశాల్లో ఇది సంప్రదాయ ఆహార వంటకం. వీటిలో పరుగు మందుల అవశేషాలుం టాయి. కాబట్టి వీటిని చల్లని నీటిలో ఉప్పు వేసి బాగా కడగాలి. లేదా ఆవిరి మీద 10-20 నిమిషాలు ఉడికించాలి. దీనినన ఉడికించేటప్పుడు చిటకెడు బేకింగ్ సోడా కలపడం వల్ల వీటి రుచి మరింత ఎక్కువై మృదువుగా మారి, రంగు, పోషకాలు మారకుండా ఉంటాయి. ఆక్సలేట్స్ తగ్గడం వల్ల కిడ్నీ-పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడవు. వీటిని వింతంగా సీజన్‌లో 1-2 కప్పులు మాత్రమే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల వీటిలోని ఫైబర్ జీర్ణం కాక మలబద్దకం, కడుపునొప్పి, కడుపుబ్బరం గ్యాస్ ట్రబుల్ వస్తాయి. అంతేగాకుండా అధిక ఆక్సరేట్స్ వల్ల కిడీనలో రాళ్ళు ఏర్పడతాయి. కిడ్నీ ఆరోగ్యం క్రమేణా తగ్గుతుంది. పోషకాల శోషణదెబ్బ తింటుంది. జీర్ణాంతర ప్రేగు సమస్యలున్న వారు వీటిని తినరాదు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



## ఇంట్లో ఆఫీసు కబుర్లెందుకు !



ఆయనకి ఆఫీసు కాల్ వచ్చింది.. పనులు నెమ్మదిగా చేస్తాం, పిల్లల్ని పక్కకి తీసుకెళతాం. తన పనికి ఆటంకం కలిగించొద్దని! మరి మన విషయానికొచ్చేసరికి.. ఇంట్లోనూ ఆఫీసు పని అంటూ చిరాకులు, పరాకులు, ఇలా అంటున్నారని కాకపోయినా రెంటికీ మధ్య హద్దు తప్పదు. లేంటే మనకే ఒత్తిడి. కాబట్ట.. వేళలు పక్కాకగా.. ఆఫీసు ఏదైనా పక్కా పనివేళలు ఉంటాయిగా! ఆ సమయంలోనే పని పూర్తవ్వాలి. రిమైండర్లే పెట్టుకుంటారో, టైమ్ టేబులే వేసుకుంటారో.. ఆ సమయం దాటాక బ్యాగు సర్దు కోవాల్సిందే అలాగని అర్జెంటు పనులున్నా వదిలేయమని కాదు. అత్యవసరాల్లో అయితే ఎవరైనా అర్థం చేసుకుంటారు. రోజూ ఇదే పరిస్థితి అయితేనే సమస్య. కాబట్టి, వివరంగా మెయిల్ పెట్టేయండి. అలాగే ఇంట్లో ఉన్నప్పుడు అత్య వసరమైతే తప్ప కాంటాక్ట్ అవ్వొద్దనీ చెబితే.. ఇల్లు ఆఫీసు సమన్వయం ఇబ్బంది అవదు. నో చెప్పాలి... పని నేర్చుకోవాలి, గుర్తింపు తెచ్చుకోవాలి అనికొత్తల్లో చెప్పిన పనల్లా చేసేస్తాం. మరి తరవాత? ఏమనుకుంటారో అని కొనసాగిస్తాం.కొన్నిసార్లు మొహమాటమూ అడ్డొస్తుంది. పూర్తవక ఇంటిదాకా తెచ్చేస్తుంటాం. పని తప్పించుకోమని ఎవరూ చెప్పరు.కానీ భారమవుతోంటే మృదువుగానైనా కష్టమవుతుంది, చేయలను అని చెప్పేయండి. చెప్పక పోతే ఎలా?.. పనిపై ఎప్పుడు విరక్తి కలుగుతుందో తెలుసా? భారమైనా చేయాల్సి వచ్చినప్పుడే! శారీరంగా ఆరోగ్యంగా ఉన్నా.. మానసికంగా కొన్నిసార్లు అలసిపోతుంటాం. ఆ సమయంలో విరామం కావాలని పిస్తుంది. కానీ మొహమాటం కొద్దీ పూర్తి చేస్తూవస్తుంటాం. అదేమో విరక్తికి కారణమవుతుంది. దీన్నే 'బర్నవుట్'గా చెబుతున్నారు. అంతవరకూ రావొద్దంటే పైవాళ్లకి విరామం కావాలని చెప్పండి, తీసుకోండి. సెలవులు దాచుకోవడం మనకి అలవాటు భవిష్యత్తులో అవసరమవుతుంది అన్న బెంగ. తీరా సెలవు సమయానికి వేరెవరికో అవసరం రావొచ్చు. దీంతో అసంతృప్తి. కాబట్టి, భవిష్యత్తు సంగతి తరవాత. అప్పటికి తీసుకోండి. ఒత్తిడి ఇంటిదాకా చేరదు.

## ఓం విష్ణు సహస్రనామ పారాయణం

జీవితమన్నాక ఎన్నో కష్టాలు ఎదురవుతుంటాయి .. మరెన్నో సమస్యలు పలకరిస్తుంటాయి. ఆర్థికపరమైన ఇబ్బందులు .. అనారోగ్య కారణాలు మానసికంగా కుంగదీస్తుంటాయి. జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడానికి, పూర్వ జన్మలో చేసిన పాపాలే కారణమనేది పెద్దల మాట. పాపాలను హరించే శక్తి భగవంతుడి నామానికి వుంది. అందువలన అనునిత్యం దైవ నామస్మరణ చేస్తుండాలని పెద్దలు చెబుతుంటారు. ఇక కష్టనష్టాలు ఒక్కసారిగా మీదపడి ఉక్కిరి బిక్కిరి చేస్తోన్న సమయంలో, విష్ణు సహస్రనామ పారాయణానికి మించిన విరుగుడు లేదని అంటారు. జీవితంలో రకరకాల సమస్యలు సతమతం చేస్తున్నప్పుడు, అనునిత్యం అత్యంత భక్తి శ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేయాలి. ఈ విధంగా చేయడం వలన కష్టాలు.. బాధలు.. వ్యాధులు తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయి. విష్ణు సహస్రనామ పఠనం వలన పుణ్యరాశి పెరుగుతుందనీ .. ఉత్తమగతులు కలుగుతాయనేది మహర్షుల మాట.

తెర

## 'వృషకర్మ' డిసెంబర్ 4న గ్రాండ్ రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య, విజనరీ ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండు మోస్ట్ ఎవైటెడ్ మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతోంది. బాపినీడు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాలను ఎవరూ టచ్ చేయని ఒక సరికొత్త నేపథ్యంలో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. తాజాగా 'వృషకర్మ' సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా డిసెంబర్ 4, 2026న థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కార్తిక్ దండు డిఫరెంట్ విజన్‌తో పాటు ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ క్రియేటివ్ ఫోర్సెస్ 'వృషకర్మ'కోసం కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పటికే సినిమా స్ట్రైకింగ్ గ్లింప్స్, బిహైండ్ ది సీన్స్ వీడియోలు విడుదలై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని పెంచాయి. వైవిధ్యమైన, ఛాలెంజింగ్ సబ్జెక్టుల తో వస్తున్న నాగచైతన్య 'వృషకర్మ'లో డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన మ్యాసివ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. రిలీజ్ డేట్ అధికారికంగా లాక్ కావడంతో మేకర్స్ భారీ ప్రమోషనల్ క్యాంపెయిన్‌కు సిద్ధమవుతున్నారు. వృషకర్మ కోసం స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. రాగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తూ సినిమా కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్.

## ఘనంగా ఇరుముడి బ్లాక్ బస్టర్ సెలెబ్రేషన్స్

రవితేజ ఎమోషనల్



మాస్ మహారాజా రవితేజ ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్ రన్ కొనసాగిస్తోంది. అన్ని వర్గాల ఆడియన్స్ ఈ సినిమాకు బ్రహ్మ రథం పడుతున్నారు. భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా నేటికీ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లా డుతూ.. మా డైరెక్టర్లు, ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ చాలా చాలా థాంక్స్. ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు.. అందరూ ఈ సక్సెస్ గురించి ఎంతో చెప్పారు. ఈ సినిమా నాకు విపరీతమైన సాటిస్ఫాక్షన్ ఇచ్చింది. ఎంతో రెస్పెక్ట్ తెచ్చి పెట్టింది. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ వేల వేల కృతజ్ఞతలు. మమ్మల్ని శివ ఎన్నో నైట్స్ కష్టపెట్టి సూపర్ సక్సెస్ ఇచ్చారు. సినిమా సెట్స్‌లో అందరం ఎంతో సరదాగా ఎంజాయ్ చేశాము. కోట శ్రీనివాసరావు బాబాయ్ అంత టాలెంట్ ఉన్న నటుడు అజయ్ ఘోష్. ఏ క్యారెక్టర్ అయినా చేయగలడు. రైటర్, ప్రొడ్యూ సర్ బీవీఎస్ రవి మాట్లాడుతూ.. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. శివ నిర్వాణ న్యూ ఏజ్ ఫిలిం మేకర్. ఈ సినిమా ఓకే చేసిన తర్వాత రవితేజకు కాల్ చేసి ఈ సినిమా సూపర్ సక్సెస్ అవుతుందని చెప్పా. రైటర్ కోన వెంకట్ మాట్లాడుతూ.. ఇరుముడి కథ మొదట విన్నది నేనే. అందుకే ఈ సినిమాకు ఫస్ట్ ప్రేక్షకుడిని నేనే. నేను కథ వినగానే చెప్పా, ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్ కాబోతోంది అని మైత్రి నిర్మాతలు రవి గారికి, నవీన్‌కి చెప్పా. 6యాక్టర్ అజయ్ ఘోష్ మాట్లాడుతూ.. జనాలు హాల్‌కి రావట్లేదు, ఓటీటీల్లోనే చూస్తున్నారు అనేది అబద్ధం. కొడితే కుంభ స్థలం బద్దలవ్వాలి. ఇరుముడి అదే నిరూపించింది. ఒక దర్శకుడికి ఉండాల్సిన దార్శనికత శివ నిర్వాణకు ఉంది.

## 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'కు మంచి స్పందన

ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్ కమర్షియల్ లెక్కలు కాదు, మనసుకు నచ్చి చేసిన సినిమా ఇది: నిర్మాత



సూర్యదేవర నాగవంశీ బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్. '90ఎస్' వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయమయ్యారు.'బేబీ' జోడీ, '90ఎస్' దర్శకుడి కలయికలో సితార నిర్మించిన సినిమా కావడంతో విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా యువతలో తారాస్థాయి అంచనాలను ఏర్పరచుకున్న'ఎపిక్' చిత్రం.. సెప్టెంబర్ 11 విడుదల తేదీ కాగా, సెప్టెంబర్ 10 రాత్రి ప్రీమియర్స్ తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకుంది. కథానాయకుడు ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "ప్రీమియర్స్ నుంచే సినిమాకి మంచి స్పందన లభించింది. ఇందులో ఉన్న కంటెంట్ చూసి, ఇది ఐదేళ్ల తర్వాత రావాల్సిన సినిమా అంటున్నారు. ప్రేమ కథ, కుటుంబ భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతున్నాయి. ఇది నిజాయితీగా చేసిన సినిమా. నేను విదేశాల్లో చదువుకున్నాను. అందుకే ఈ కథకు బాగా కనెక్ట్ అయ్యాను. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన యువకుడి ప్రయాణం, ఆ భావోద్వేగాలు, తండ్రితో జరిగే సంభాషణలు ఇవన్నీ నా మనసుకు దగ్గరయ్యాయి. కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ.. "సినిమా చూసి ఎందరో నాకు మెసేజ్ లు చేశారు. ఆదిత్య పాత్ర గురించి, కదలి పాత్ర గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారు. తెరపై తమను తాము చూసుకున్నట్టు ఉందని ఎందరో నాకు మెసేజ్ లు చేశారు. మేమందరం నమ్మి చేసిన కొత్త ప్రయత్నమిది. నా ఫ్రెండ్స్, కజిన్స్‌తో కలిసి నేను సినిమా చూశాను. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "ఎపిక్ సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువతకు బాగా నచ్చుతోంది

## శ్రీరామ్ నటించిన హాలీవుడ్ మూవీ 'కౌబాయ్ అండ్ ఇండియన్'

'ఫణి' చిత్ర హీరో మహేశ్ శ్రీరామ్ నటించిన హాలీవుడ్ మూవీ 'కౌబాయ్ అండ్ ఇండియన్' వరుస ఆంగ్ల చిత్రాల్లో నటిస్తూ హాలీవుడ్ లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు తెలుగు హీరో మహేశ్ శ్రీరామ్. ఆయన ప్రస్తుతం వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న 'ఫణి' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ప్రమోషనల్ కంటెంట్ తో ఇప్పటికే 'ఫణి' సినిమా మీద మూవీ లవర్స్ లో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు మహేశ్ శ్రీరామ్ హాలీవుడ్ లో నటించిన 'కౌబాయ్ అండ్ ఇండియన్' సినిమా రేపు గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు బ్రాడ్ నాప్ పోషించిన స్టీవ్ క్యారెక్టర్ కు స్నేహితుడు విజయ్ పాత్రలో మహేశ్ శ్రీరామ్ నటించారు. స్నేహితుడి అభిప్రాయాలకు విలువనిస్తూ అతని చెప్పే మాటల్ని అర్థం చేసుకుని సపోర్ట్ గా నిలిచే మిత్రుడు విజయ్ క్యారెక్టర్ లో మహేశ్ శ్రీరామ్ తన పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకోనున్నారు. డైరెక్టర్ లియో పి షెల్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హాలీవుడ్ లో ఇలా ఎగ్జైటింగ్ మూవీస్ లో నటిస్తున్న మహేశ్ శ్రీరామ్ 'ఫణి' సినిమాలో లీడ్ రోల్ చేస్తుండటం ఈ మూవీకి మరింత క్రేజ్ తీసుకొస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ డాక్టర్ వీఎన్ ఆదిత్య 'ఫణి' మూవీని గ్లోబల్ ప్రాజెక్ట్ గా రూపొందిస్తున్నారు. ఈ థ్రిల్లర్ సినిమాను ఓ. ఎం. జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఫణి సినిమాలో బ్యూటిఫుల్ హీరోయిన్ కేథరీన్ ట్రెసా లీడ్ రోల్ లో నటిస్తున్నారు. త్వరలోనే హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, ఇతర ప్రపంచ భాషల్లో ఖిఖిఫణిఖిఖి సినిమాను విడుదల చేయబోతున్నారు.



## '418' సెప్టెంబర్ 18న రిలీజ్



ఇటీవలే సంచలన బ్లాక్‌బస్టర్ 'ఇరుముడి'ని అందించిన పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, '418'తో థియేటర్లకు ఒక విభిన్న మైన హారర్ చిత్రాన్ని తీసుకురావడానికి సిద్ధమవు తోంది. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రంతో కీర్తన్ నాడగౌడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి ఆయనే కథను కూడాఅందించారు. నవీన్ యెర్నేని, యల మంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండగా, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ థ్రిల్లర్ సెన్సార్‌తో సహా అన్ని లాంఛనాలను పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికేట్‌ను పొందింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. పోస్టర్ లో మసక వెలుతురులో నేలపై కూర్చున్న ఒక వ్యక్తి, 'ఎ' అక్షరం ఆకారంలో ఉన్న రక్తపు మరకల వైపు తన ఒక చేతిని చాచి ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ నీడల వెలుగు, మసక రంగులు, పాతబడిన ఆకృతులు, స్పష్టంగా కనిపించే గీతలు ఒక టెర్రిఫిక్ గా ఉన్నాయి. '418' సీరియస్ ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన కంటెంట్ సినిమాలోని మెయిన్ సీక్రెన్‌ని ఇంకా రివిల్ చేయకుండా, భయానక ప్రపంచం గురించి కొన్ని గ్లింప్స్ అందించింది. ఇప్పుడు చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి దినేష్ దివాకర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, వెంకీ జీజీ సంగీతం , నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. ఉల్లాస్ హైదూర్ ప్రొడక్షన్ డిజైనర్,

## 'కాగితం పడవలు' క్లైమాక్స్ షాక్ అవుతారు:

డైరెక్టర్ ఎంజీఆర్ తుకారాం



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ 'కాగితం పడవల్లు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్, ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో వర్ధన్ మాట్లాడుతూ ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. చాలా కష్టపడి చేశాం. మీరందరూ ఇష్టపడి చూస్తారని నమ్ముతున్నాము. డైరెక్టర్ తుకారాం మాట్లాడుతూ.. ప్రయత్నం చేసి ఓడిపోయిన వాడు ఎవరూ చరిత్రలో లేడు. ఈరోజు అదే ప్రయత్నం మీ ముందు నిలబడింది. సెప్టెంబర్ 18న ఫలితాన్ని ఇస్తుంది. హీరోయిన్ కృష్ణప్రియ మాట్లాడుతూ: సెప్టెంబర్ 18న థియేటర్‌లో రిలీజ్ అవుతుంది. చాలా మంచి సినిమా ఇది. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా. నిర్మాత అంజనప్ప మాట్లాడుతూ: ముందుగా మా నిర్మాతలు అందరికీ థాంక్యూ. డైరెక్టర్ చాల కష్టపడ్డారు. ఈ కథ మీద నమ్మకంతో ఎక్కడా రాజీ పడకుండా చాలా అద్భుతంగా తీర్చిద్దాము. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. చాలా మంచి సినిమా ఇది. మీడియా మిత్రులందరూ ఈ సినిమాకి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. నిర్మాత కీర్తన మాట్లాడుతూ: సెప్టెంబర్ 18న మా సినిమా థియేటర్‌లోకి వస్తుంది




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-195/6, Kanteshwar, Nizamabad-503001, RNI No. 64862/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.